www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-1-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 258 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.01 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర పూర్తి; వర్జ్యం: మ. 3.10 -4.58; దుర్ముహూర్తం: ఉ. 10.29-11.13, మ. 2.53-3.37; అమృతఘడియలు: రా. 1.57-3.45; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

"గగన్‌యాన్, చంద్రయాన్-3 రెండు ప్రాజెక్టుల పనులు సక్రమంగా, జోరుగా సాగుతున్నాయి. గగన్‌యాన్ కోసం నలుగురు ఎయిర్‌ఫోర్స్ పైలట్లను ఇప్పటికే ఎంపిక చేశాం. వారికి ఈనెల మూడో వారం నుంచి రష్యాలో వ్యోమగామ శిక్షణ మొదలవుతుంది. బహుశా వచ్చే సంవత్సరమే గగన్ యాన్ ప్రయోగం చేపడతాం"

-ఇస్రో చైర్మన్ కె.శివన్



నింగిలోకి నలుగురు!

మన గగన్‌యాన్‌కు రెడీ.. ఎయిర్‌ఫోర్స్ నుంచి ఎంపిక.. వచ్చే ఏడాది ప్రయోగం!?

- సిద్ధమవుతున్న చంద్రయాన్-3
- ఈ ఏడాది నవంబరులో లాంచ్!
- వెలాసిటీ రిడక్షన్ వైఫల్యంవల్లే విక్రమ్ ల్యాండర్ హార్డ్ ల్యాండింగ్
- ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రకటన

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు గగన్ యాన్! మరోవైపు చంద్రయాన్-3. అంతరిక్ష రంగంలో దూసుకుపోయేందుకు భారత్ సిద్ధమవుతోంది. 2019లో 'జస్ట్ మిస్' అయిన చందమామను మళ్లీ పట్టుకుంటామని ఇస్రో ప్రకటించింది. అలాగే... భారత దేశ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' కోసం వైమానిక దళానికి చెందిన నలుగురు పైలట్లను ఎంపిక చేశారు. కొత్త సంవత్సరం తొలిరోజైన బుధవారం ఇస్రో చైర్మన్ కె.శివన్ బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. చంద్రయాన్-2 విఫలమైనప్పటికీ చంద్రుడిని చేరుకోవాలన్న తమ ప్రయత్నాలు ఆగలేదన్నారు. "చంద్రయాన్-3లో ల్యాండర్, రోవర్ల తయారీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ల్యాండర్, రోవర్, ప్రొపెల్షన్ మాడ్యూల్ తయారీలో శాస్త్రవేత్తలు నిమగ్నమై

మిగతా 10వ పేజీలో...




10

'ఒకే దేశం ఒకే రేషన్ కార్డు' ప్రారంభం

ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో అమల్లోకి

ఆపరేషన్ క్రూర!



ప్రత్యర్థులపై వేధింపుల కత్తి

ఆపరేషన్ ఆకర్ష్... పదవులు, పనులు, ఇతర తాయిలాలను చూపించి విపక్ష నేతలు, ఎమ్మెల్యేలను తమ వైపునకు లాక్కోవడం! ఇది... రాజకీయాల్లో కొత్త కాదు. వైఎస్ హయాంలోనే మొదలైంది. టీఆర్ఎస్ అనే పార్టీనే మింగే స్థాయిలో నడిచింది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ కూడా ఇదే నడిపింది. వైసీపీ ఎమ్మెల్యేలకు తలుపులు తెరిచింది. అధికార పార్టీలో ఉండే వెసులుబాట్లు ఉపయోగించుకునేందుకో, ఎన్నికల ఖర్చులు రాబట్టుకునేందుకో, ఇతర కారణాల వల్లో ఇలా పార్టీలు మారడం సహజంగా మారింది. కానీ... ఇప్పుడు జరుగుతున్నది వేరు. ఇది... 'ఆపరేషన్ క్రూర'! ఒత్తిళ్లు, కేసులు, ఆర్థిక మూలాలపై దాడులు, కప్పం కట్టాల్సిందేనంటూ ఆదేశాలు... కనీవినీ ఎరుగని రీతిలో సాగుతున్న ఘోరమిది!

యథేచ్ఛగా కేసులు, సోదాలు, ఒత్తిళ్లు

- ఆర్థిక మూలాలు దెబ్బకొడుతూ దారిలోకి
- వ్యాపారాలను వదులుకోవాలని బెదిరింపులు
- రాజకీయాల్లో లేనివారికీ తప్పని వేధింపులు
- ఒక డీల్‌లో కప్పం విలువ రూ.వెయ్యి కోట్లు
- అధికార కేంద్రం నుంచే వ్యూహ రచన
- కనీవినీ ఎరుగని స్థాయిలో దారుణాలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త రాజకీయ క్రీడకు తెరలేచింది. రాజకీయ ప్రత్యర్థుల నోరు మూయించడానికి, తమ వైపు తిప్పుకోవడానికి, వారి శక్తియుక్తులను నిర్వీర్యం చేయడానికి అధికారాన్ని ఆయుధంగా మలుచుకొని నిర్లజ్జగా ప్రయోగించడం పతాక స్థాయికి చేరుతోంది. పోలీస్ కేసులు, విచారణల పేరుతో ఒత్తిడికి గురి చేసి లొంగదీసుకోవడం, ఆర్థిక మూలాలను దెబ్బ తీసి మానసిక స్థైర్యాన్ని దెబ్బ తీయడం, తాయిలాలు ప్రయోగించడం ఈ క్రీడలో కీలకాంశాలు. దీని దెబ్బకు నాలుగైదు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న, బలమైన నాయకులుగా గుర్తింపు పొందినవారు కూడా గింగిరాలు తిరుగుతున్నారు. ప్రత్యర్థి పక్షం తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు పార్టీలు మారిపోతున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న వారు మాత్రమేకాదు...

మిగతా 2వ పేజీలో...



బాబుకు ప్రతిపక్ష హోదా ఉండదు


మంత్రి కృష్ణదాస్

3



అదో ప్రతిపక్షం, ఆయనో నాయకుడు

స్పీకర్ తమ్మినేని ఎద్దేవా



మందడం సభలో చంద్రబాబు, భువనేశ్వరి తదితరుల నినాదాలు

వేడుక 'మూడు' లేదు!

- రాజధాని మార్చబోమంటూ ప్రకటనొస్తేనే మాకు పండగ
- న్యూఇయర్‌నాడూ రోడ్లపైనే
- ముగ్గులలో నిరసన నినాదాలు
- రేపటి నుంచి జేఏసీ పోరు ఉధృతం

9





రాజధానితో ప్రజలకేం పని?

- ఎక్కడుంటే ఏంటి?
- రియల్టర్లే ఆందోళనలు చేస్తున్నారు: మంత్రి పెద్దిరెడ్డి
- ఆందోళన చేస్తున్నది బినామీలు, పెయిడ్ ఆర్టిస్టులే!
- డిప్యూటీ సీఎం స్వామి

9



కృష్ణాయపాలెంలో చంద్రబాబు వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న ఓ వృద్ధ రైతు

నెత్తిన నిప్పుల కుంపటి

నాడు ముద్దులు.. నేడు పిడి గుద్దులు

- కరెంటు తీగ పట్టుకోవద్దంటే వినలేదు
- మడమ తిప్పనని మాట మార్చారు
- ఇప్పుడు చూడండి ఏమైందో!
- అమరావతిని దేవుడైనా కదిలించలేడు
- ఇక్కడ 75% వెనుకబడిన కులాలే
- కారుణ్య మరణాలకు అనుమతించాలని రాష్ట్రపతిని రైతులు వేడుకున్నారు
- ఈ సీఎంకు సిగ్గుందా?: బాబు ఫైర్

గుంటూరు/మంగళగిరి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'ఒక్కసారి చాన్సివ్వాలంటే నిప్పుల కుంపటి నెత్తిన పెట్టుకున్నారు. ప్రజావేదిక కూలదోస్తుంటే మనకెందుకులే అనుకున్నారు. నా ఇల్లు ముంచాలని చూస్తుంటే మా ఇళ్లు కాదుగా అనుకున్నారు. ఇప్పుడు అమరావతినే ముంచాలని చూస్తున్నారు..' అని టీడీపీ అధినేత చంద్రబాబు

మిగతా 9వ పేజీలో...

మమ్మల్ని కర్ణాటకలో కలిపేయండి

విశాఖ వెళ్లాలంటే 20 గంటలు.. కర్నూలు ప్రజల పాపమేంటి?: తిక్కారెడ్డి

సీమకు రాజధాని ఇస్తారా.. ప్రత్యేక రాష్ట్రానికి మద్దతిస్తారా?


జగన్.. మీ వైఖరి ఏంటో చెప్పు: రాయలసీమ రాష్ట్ర సాధన సమితి



3

రేపటి నుంచే పుస్తక పండగ

బెజవాడలో ప్రారంభించనున్న గవర్నర్ హరిచందన్



10

'మంట' గ్యాస్!

- ఎల్పీజీ సిలిండర్‌కు 21 పెంపు
- 5 నెలల్లో 141.50 పెరుగుదల

ఏపీలో 525 కంపెనీలు మూత

8



మంత్రి పేర్ని నానిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పింఛన్ లేని విలీనమా?

అయితే, మాకేం లాభం

- లాభ, నష్టాలపై నేతల వివరణ
- కార్మికుల్లో కనిపించని సంతోషం
- పీటీడీపై పలు సందేహాలు, ప్రశ్నలు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 2019 సంవత్సరం వెళ్లి పోయింది. కొత్త సంవత్సరం వచ్చేసింది. ఆర్టీసీ పేరు ప్రజా రవాణా శాఖ (పీటీడీ)గా మారింది. అంతకుమించి ఇంకేం దక్కింది? ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఆరు నెలలు ఎదురు చూసిన విలీన సమయం వచ్చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా మారినా వారిలో సంతోషం ఎక్కడా కనిపించడం లేదు. పదవీ విరమణ తర్వాత

మిగతా 2వ పేజీలో...

రీయింబర్స్ లేదు.. రోడ్డున పడాలా?

- ఇంజనీరింగ్ కాలేజీ ఉద్యోగుల ఆందోళన
- 3,400 కోట్ల బకాయిలు
- ఐదారు నెలలుగా అందని వేతనాలు

12

₹130కే 200 ఉచిత చానళ్లు

వినియోగదారు ఎంచుకున్నవి ఇవ్వాల్సిందే

- 26 డీడీ చానళ్లు దానికి అదనం
- రూ.160కి ఉచిత చానళ్లన్నీ ఇవ్వాలి
- బొకేలో ఉండే చానళ్ల గరిష్ఠ ధర రూ.19 నుంచి రూ.12కు తగ్గింపు
- ఒకటికి మించి టీవీలుంటే ఎన్‌సీఎఫ్‌లో 40 శాతానికే రెండో కనెక్షన్
- బ్రాడ్‌కాస్టర్లకూ ఫీజుల నుంచి ఊరట

న్యూఢిల్లీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): టీవీ వీక్షకులకు ట్రాయ్ నూతన సంవత్సర కానుక ప్రకటించింది! కేబుల్ ధరలపై కీలక నిర్ణయం తీసుకుంది. బొకేల పేరుతో చానళ్లు చేస్తున్న మాయాజాలానికి అడ్డుకట్ట వేసేలా.. ఒకటికి మించి కనెక్షన్లు తీసుకున్నవారికి ఊరట కలిగించేలా కొత్త టారిఫ్ విధానాన్ని రూపొందించింది. వినియోగదారులు తాము చూసిన చానళ్లకు మాత్రమే డబ్బు చెల్లించే సదుద్దేశంతో గతంలో రూపొందించిన విధానం, అమలు చేసిన నిబంధనలు అంతిమంగా ప్రజలపై భారం పడేలా చేశాయి. దానిపై తీవ్ర విమర్శలు

మిగతా 10వ పేజీలో...



విశాఖలో భూమంతర్

నిషేధిత జాబితా నుంచి మినహాయింపు

- జిల్లా అధికారులు కాదన్నా... సచివాలయ స్థాయిలో క్లియరెన్స్
- ఒత్తిడి తెచ్చి మరీ ఆదేశాలు జారీ
- రెండేళ్ల కిందటి దరఖాస్తులు పెండింగ్
- కొత్త 'అభ్యర్థనల'కు మాత్రం ఓకే
- అధికార పార్టీ సన్నిహితులకే వరం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

'రాజధాని' ప్రకటన రాగానే విశాఖలో భూముల మాయాజాలం మొదలైంది. మొన్నటిదాకా నిషేధిత 22-ఏ జాబితాలో ఉన్న భూములకు రెక్కలు వస్తున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కాదని... కొత్తగా వచ్చిన అభ్యర్థనలకు 'ల్యాండ్ క్లియరెన్స్' వచ్చేస్తోంది. జిల్లా యంత్రాంగం కాదూ, కూడదు అని స్పష్టం చేసినా... ఏకంగా సచివాలయ స్థాయి నుంచే ఉత్తర్వులు వెలువడుతున్నట్లు తెలుస్తోంది. సర్కారుకు సన్నిహితులైన వారికి

మిగతా 2వ పేజీలో...



పరంజ్యోతి

ధర్మాత్ములు ఎవరంటే..



ధర్మోరక్షతి రక్షితః ..ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. మనిషి ధర్మాన్ని ఆధారం చేసుకొని నడిచి తీరవల్సిందే! ధర్మాన్ని పాటించని వారు అష్టకష్టాలు పడవలసి వస్తుంది. 'వ్యక్తి తన బాధ్యతగా నిర్వర్తించవలసిన కర్మలను పద్ధతిగా ఆచరించడమే ధర్మం' అని శాస్త్ర వచనం. కన్న పిల్లల్ని పద్ధతిగా పెంచడం మాతృధర్మం అయితే, ఆ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి క్రమశిక్షణ పాటించేటట్టు చూడడం పితృధర్మంగా చెబుతారు. మైనపు ముద్దలైన బాలబాలికలను విద్యతో తీర్చిదిద్ది సమాజంలోకి పంపడం గురుధర్మం. ఇలా ప్రతి ఒక్కరూ తమ తమ ధర్మాలను పాటించినప్పుడే సమాజమైనా, దేశమైనా పచ్చగా ఉండి నాలుగు కాలాల పాటు మనగలుగుతాయి.

జహా(దయా తహా(ధర్మ్ హై, జహా(లోభ్ వహా(పాప్
జహా(క్రోధ్ తహా(కాల్ హై, జహా(క్షమా వహా(ఆప్

..ధర్మం, దాని ముఖ్య లక్షణాలైన దయ, క్షమ వంటివాటిని ఆధారంగా చేసుకుని మహాత్మా కబీరు చెప్పిన పద్యమిది. ఎక్కడ దయకు స్థానం ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుంది. ఎక్కడ క్షమ ఉంటుందో అక్కడ దైవం ఉంటుంది. లోభం ఎక్కడ ఉంటుందో అక్కడ పాపం ఉంటుంది. కోపం ఎక్కడ ఉంటుందో అక్కడికి మృత్యువు పిలువని పేరంటంగా వచ్చి సర్వనాశనం చేస్తుంది. మనిషి ధర్మాన్ని పాటించినప్పుడే సుఖసంతోషాలతో సంతృప్తిగా జీవించగలడని దీని అర్థం. అందుకే మన పురాణేతిహాసాలు ధర్మానికి పెద్దపీట వేశాయి. రామాయణంలో ధర్మానికి అద్దం పట్టే ఎన్నో ఘట్టాలున్నాయి. ఉదాహరణకు.. శ్రీరామచంద్రుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు రుషులు, మునులు వచ్చి తాము రాక్షసుల వల్ల పడే బాధల గురించి చెప్పుకుంటే.. రాముడు వెళ్లి రాక్షసులతో యుద్ధం చేసి వారందరిని సంహరిస్తుంటాడు. దీన్ని గమనించిన సీతమ్మ తల్లి ఒకరోజు.. 'మనం వచ్చింది మీ నాన్నగారి మాట పాటించడానికి అనేది మరిచి రాక్షసులను చంపుతున్నారు. ఇది ఎంతవరకు సరియైనదో నాకు అర్థం కావట్లేదు' అంటుంది. ఆమె మాటలు విన్న రాముడు.. 'నేను క్షత్రియుణ్ని. అయోధ్యయినా అరణ్యమైనా నాకు ఒక్కటే. కాబట్టి, నేను రాజధర్మాన్ని పాటిస్తూ చెడును సంహరించి మంచిని కాపాడుతున్నాను' అని సమాధానమిచ్చాడు. ధర్మానికి పది లక్షణాలున్నాయని ధర్మశాస్త్రాలు చెబుతాయి. అవేంటంటే.. ధృతి (ఆత్మవిశ్వాసంతో సంతోషంగా ఉండడం), దమం (మనసును అదుపులో పెట్టకోవడం), క్షమ (సహనం కలిగి ఉండడం), శౌచం (శారీరక, మానసిక శుభ్రత పాటించడం), అస్తేయం (మరొకరికి సొత్తుకు ఆశపడకుండడం.. దొంగతనాలు చేయకుండా ఉండడం), ధీ (బుద్ధి కలిగి ఉండడం), విద్య (మంచి చెడులు విశ్లేషించి ప్రవర్తించడం), సత్యం (నీతి నిజాయితీతో జీవించడం), అక్రోధం (భావోద్వేగాలను అదుపులో పెట్టుకొని వ్యవహరించడం) ఇంద్రియ నిగ్రహం (కోరికలకు కళ్లెం వేయడం). ఈ పది లక్షణాలనూ కలిగి ఉన్నవారు ధర్మాత్ములు.

- పరికిపండ్ల సారంగపాణి, 9849630290

లోకం తీరు



నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు రోడ్లపై ర్యాలీలు చేస్తారు.. మద్యం ధర పెరిగినప్పుడు బాధతో ఇంకా ఎక్కువగా తాగుతారు..!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	18.6	28.4
హైదరాబాద్	18.8	28.4
కడప	19.0	33.0
గుంటూరు	19.2	30.7
విజయవాడ	20.9	29.8
కర్నూలు	21.3	31.5
నెల్లూరు	23.4	30.5

పింఛన్ లేని విలీనమా?

(మొదటి పేజీ తరువాయి)

జీవితాల్లో ఎలాంటి మార్పూ ఉండబోదంటూ నిట్టూర్పు తప్ప ఆనందం కనిపించడం లేదు. కొత్త సంవత్సరం నాడు ఎవరెవరితో కలిసినా కార్మికులు, సిబ్బందిలో "మనకు పెన్షన్ ఇవ్వరా? మరైతే విలీనంతో మేలేం జరిగినట్టు?" అని చర్చించుకుంటున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వంలో ఆర్టీసీని చేశామని చెబుతున్న వైసీపీ నేతల మాటలను తలుచుకుంటూ పలు రాష్ట్రాల్లో ఇప్పటికే జరిగిన విలీనంలో అక్కడి కార్మికులకు జరిగిన మేలేంటో వివరిస్తున్నారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ మాజీ ఎండీ ఆంజనేయరెడ్డి నేతృత్వంలో విలీనంపై కమిటీని ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ వాటా ఉన్నందున సంస్థను విలీనం చేయలేమని కమిటీ నివేదిక ఇవ్వడం, సీఎం సూచన మేరకు సిబ్బందిని విలీనం చేయాలన్న ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్నీ వర్తింపజేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని ఈయూ, ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ సహా అన్ని కార్మిక సంఘాలు, సూపర్ వైజర్ల అసోసియేషన్లు కోరాయి. అది చేయకపోతే విలీనం జరిగినా ఉపయోగం లేదని స్పష్టం చేశాయి. ఇవేవీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. పాత పెన్షన్ అమలు సాధ్యం కాదని ఉన్నతాధికారులు చెప్పేశారు. 'ఏదో ఆశిస్తే మరేదో జరిగింది.. రహస్య నివేదికతో అంతా అయోమయంగా ఉంది' అని నేతలు కార్మికులకు సమాధానం చెప్పలేక పోతున్నారు.

సిబ్బంది వాదన ఇదే

- ప్రభుత్వం ఇచ్చే వృద్ధాప్య పెన్షన్ కన్నా ఆర్టీసీ రిటైర్డ్ సిబ్బందికి వస్తున్న పెన్షన్ చాలా తక్కువ. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పాత పింఛన్ ఇవ్వాలి
- ప్రభుత్వ ఉద్యోగులుగా మారుతున్న క్రమంలో ఉన్న సౌకర్యాలకు కోత పెడుతున్నారు. ఇది తగదు.
- పీటీడీలో కేన్సర్ పేషెంట్లకు ఖర్చు ఎక్కువవుతోందంటూ మధ్యలో ఆపేసే అవకాశం ఉంది. దీనిపై క్లారిటీ ఇవ్వాలి.
- ప్రమోషన్లు, రెగ్యులైజేషన్లలో అధికారుల వరకూ బాగా చేశారు. సిబ్బంది విషయంలో నిబంధనల మార్పుతో కోత పెడుతున్నారు. దీనిపై స్పష్టత కావాలి.
- కార్మికుల సొంత డబ్బుతో నడిచే ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ మూసివేతకు విలీనం బీజం వేస్తోంది. భవిష్యత్తులో సిబ్బంది ఆర్థిక అవసరాలు ఎలా తీరతాయి?

'మీసేవ'ను ముంచేస్తారా?

mee seva easier, faster

- పొమ్మనకుండానే పొగ పెడుతున్నారు
- 11,088 కేంద్రాల నిర్వాహకుల ఆందోళన

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'మీసేవ' కేంద్రాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కొంత సేవా రుసుం తీసుకుని వీరు చేస్తున్న సేవలను ఇకపై గ్రామ సచివాలయాల్లో ఉచితంగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో దాదాపు 17ఏళ్లుగా సేవలందిస్తున్న 11,088 మీసేవ కేంద్రాలు, వాటిపై ఆధారపడి బతుకుతున్న 40వేల కుటుంబాల పరిస్థితి ఇప్పుడు అయోమయంలో పడింది. దీంతో ఈ కేంద్రాల నిర్వాహకులు ధర్నాలు, ఆందోళనల బాటపట్టారు. కొన్నిరోజుల నుంచి సమ్మె కూడా చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు కట్టించుకోవడంతో ప్రారంభమైన వీటి సేవలు క్రమంగా విస్తరించి 37శాఖలకు సంబంధించి 530 సేవలు అందించే స్థాయికి చేరాయి. ప్రజలకు సేవలందించడమే కాకుండా... వేలమందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాయి.

సులభతర సేవల కోసం

ప్రజలకు సులభంగా సేవలు, యువతకు ఉపాధి కల్పన కోసం ఈ-సేవ పేరుతో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఒక్కొక్కరు రూ.లక్ష, రూ.2లక్షలు వెచ్చించి, అవసరమైన కంప్యూటర్, ఇతర పరికరాలు, కార్యాలయాలు అద్దెకు తీసుకుని ఉపాధి దొరుకుతుందన్న ఆశతో ఈ వ్యవస్థలోకి ప్రవేశించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో వీటిపేరును మీసేవ కేంద్రాలుగా మార్చారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పని తప్పడం, అవినీతి తగ్గడంతో ప్రజలు మీసేవ కేంద్రాలకు పోటెత్తడం ప్రారంభమైంది. స్వయం ఉపాధి కోసం ఒకరు ఏర్పాటుచేసిన కేంద్రం.. ముగ్గురు, నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగింది.

మాకూ దారిచూపాలి

మీసేవలో అందిస్తున్న సేవలన్నీ గ్రామ సచివాలయాల్లో ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మీసేవ నిర్వాహకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పొమ్మనకుండా పొగబెట్టిన విధంగానే ఈ పరిణామం ఉంటుందన్నారు. తమ బతుకుతెరువుకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వమే మార్గం చూపించాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాల నిర్వాహకులకు ప్రభుత్వమే వేతనం ఇస్తే తాము కూడా సేవా రుసుం తీసుకోకుండా ఉచితంగా సేవలందిస్తామని చెబుతున్నారు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా మీసేవ కేంద్రాలను ఉపయోగించుకుంటే కొత్త కంప్యూటర్లు, మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదంటున్నారు. పట్టణాల్లోని కేంద్రాల్లో ఉచితంగా సేవలందిస్తామని, సేవా రుసుమును ప్రభుత్వమే చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు.

విశాఖలో భూమంతర్

(మొదటి పేజీ తరువాయి)


మాత్రమే ఇలాంటి 'వెసులుబాటు' వరం లభిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఐదారు దరఖాస్తులను నేరుగా అమరావతి నుంచే పరిష్కరించినట్లు తెలుస్తోంది. దీనిద్వారా విశాఖ జిల్లాలో అధికారపార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు, మరో ఇద్దరు నేతలకు లబ్ధి చేకూరినట్లు తెలుస్తోంది. జిల్లాలో 22-ఎ జాబితాలో నమోదైన భూములపై సుమారు 2600 దరఖాస్తులు వచ్చాయి. 2018నుంచి ఇప్పటివరకు వస్తున్న దరఖాస్తులను జిల్లా యంత్రాంగం క్షుణ్నంగా పరిశీలించి, పక్కా ఆధారాలుంటేనే నిషేధిత జాబితానుంచి తొలగిస్తున్నారు. ఇలా 1,800 దరఖాస్తులు పరిష్కరించినట్లు సమాచారం. 22-ఏలో చేర్చినవాటిలో ఎక్కువ భాగం భూసేకరణలో ఉన్న స్థలాలే ఉన్నాయి. ఉదాహరణకు ఒక సర్వే నంబరులో 100 ఎకరాలు భూమి ఉందనుకుందాం. అందులో ప్రజావసరాలకు 50ఎకరాలు మాత్రమే ప్రభుత్వం సేకరిస్తే... మిగిలిన 50ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉంటుంది. ప్రజావసరాలకు సేకరించిన భూమికి సబ్‌డివిజన్ చేయాలి. లేకపోతే సర్వే నంబరు మొత్తం ప్రభుత్వ భూమిగా నమోదవుతుంది. జిరాయితీ భూమికి ఆనుకుని గోర్జి (దారి), గెడ్డ పోరంబోకు, చెరువులను ఆక్రమించుకుని కొందరు విక్రయాలు చేస్తుంటారు. ఇటువంటి భూములను కూడా 22-ఏ కింద చేర్చుతుంటారు. వాటిని నిషేధిత జాబితా నుంచి తప్పించాలంటే... ఆక్రమణకు గురైన భూమిని సర్వే చేసి మిగిలిన జిరాయితీ భూమిని యజమానికి బదలాయిస్తారు.

విశాఖలో భూములకు విలువతో...

జిల్లాలో భూములకు విలువ పెరగడంతో 22-ఏ కింద చేర్చిన భూములకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వీటి విషయంలో అధికారులు ఆచితూచి అడుగులు వేస్తుంటారు. నగరంతోపాటు విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం, గాజువాక, పరవాడ, అనకాపల్లి మండలాల్లో 22-ఏ దరఖాస్తులపై అధికారులపై తీవ్ర ఒత్తిడి ఉంది. నగరంతోపాటు పరిసర ప్రాంతాల్లో 22-ఏ జాబితాలో నమోదైన భూముల మినహాయింపు కోసం వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని అధికారులు తిరస్కరించారు. ప్రభుత్వం నుంచి వాటికి సంబంధించిన సమాచారం కోరినపుడు అదే విషయాన్ని నివేదించారు. అయితే... అధికార పార్టీ నేతలు రంగ ప్రవేశంచేసి ఉన్నత స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి... అమరావతి నుంచి ఫైళ్లను పంపించారని తెలిసింది. రెండోసారి కూడా అధికారులు సదరు ఫైళ్లను తిరస్కరిస్తూ మళ్లీ ప్రభుత్వానికి పంపారు. అయితే, ఉన్నతస్థాయి వ్యక్తులు రంగ ప్రవేశం చేసి 22-ఏ నుంచి మినహాయించాల్సిందేనని ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం ఆ ఆదేశాలను అమలు చేయడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. ముడసర్లోవ, మద్రిపాలెం, మాధవధార, పెదవాల్తేరు, పోతినమల్లయ్యపాలెంతోపాటు మరో రెండుచోట్ల 22-ఏలో ఉన్న భూములకు మినహాయింపు సాధించినట్లు జోరుగా ప్రచారం సాగుతుంది. దీనిపై స్పందించేందుకు జిల్లా అధికారులు ఎవరూ ఇష్టపడడం లేదు. ఒకటి, రెండేళ్ల క్రితం పెట్టుకున్న దరఖాస్తులను కాదని ఇటీవల వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం ఆగమేఘాల మీద అనుమతి ఇవ్వడంలో ఆంతర్యమేమిటి? 22-ఏలో చేర్చిన భూములు జిరాయితీలో ఉన్నాయా? లేదా అనేది బహిరంగంగా విచారణ చేపట్టకుండా హడావిడిగా ఫైళ్లు తెప్పించుకోవడం వెనుక ఏం జరిగింది? ఇప్పుడు ఇదే చర్చనీయాంశంగా మారింది.

కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి కోస్తాపైకి తేమగాలులు వీస్తున్నాయి. అదే సమయంలో ఉత్తర ఒడిశా పరిసరాల్లో ద్రోణి బలహీనపడినా దాని నుంచి ఉత్తర కోస్తాపైకి గాలులు వీస్తున్నాయి. ఈ రెండింటి ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం నుంచి కోస్తాలో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. దీంతో వాతావరణం చల్లబడడమే కాకుండా అక్కడక్కడా వర్షాలు కురిశాయి. బుధవారం సాయంత్రం వరకు పరదేశిపాలెం, కాపులుప్పాడలో మూడు, చిలకలూరిపేటలో రెండు, శ్రీకాళహస్తిలో ఒక సెంటీమీటరు వర్షపాతం నమోదైంది. రానున్న ఇరవై నాలుగు గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కళింగపట్నంలో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.



అఖిలేశ్ పాక్‌లో ఉంటే హిందువుల బాధలు తెలుస్తాయి

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ నెల రోజుల పాటు పాకిస్థాన్‌లో ఉండాలి. ఆలయాల్లో పూజలు చేయాలి. హిందువులు ఎలాంటి దాడులను చవిచూస్తున్నారో అప్పుడాయనకు అర్థం అవుతుంది.

- స్వతంత్ర దేవ్ సింగ్, బీజేపీ యూపీ అధ్యక్షుడు



పాకిస్థానీ హిందువులు ఇటలీకి వెళ్లాలా?

సీఏఏ వద్దంటే.. పొరుగున ఉన్న ముస్లిం దేశాల్లోని హిందువులు ఎటు వెళ్లాలి ? పాకిస్థానీ హిందువులు ఇటలీకి వెళ్లాలా? అక్కడికి వెళితే.. పేదవాళ్లనే సాకుతో హిందువులు, సిక్కులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఇటలీ అంగీకరించదు.

- జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి

మూర్ఛ, బీపీ ఔషధాలతో కేన్సర్‌కు అడ్డుకట్ట

వాషింగ్టన్: మూర్ఛ, మానసిక సమస్యలు, మైగ్రేన్ తలనొప్పుల చికిత్సకు వాల్‌ప్రోయిక్ యాసిడ్‌ను వినియోగిస్తుంటారు. హైడ్రాలజైన్ అనే మరో ఔషధాన్ని రక్తపోటు నియంత్రణకు వాడుతుంటారు. అయితే ఈ రెండు ఔషధాలను ఏకకాలంలో వినియోగిస్తూ, కొవ్వుతో కూడిన ఆహారపదార్థాలను తినడం ద్వారా రొమ్ము కేన్సర్ కణితుల పెరుగుదల మందగిస్తుందని అమెరికాలోని జార్జ్‌టౌన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. వాటి ప్రభావంతో డీఎన్ఏ మిథైల్‌ట్రాన్స్‌ఫెరేజ్(డీఎన్ఎంటీ)లో జరిగే మార్పులతో ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎలుకలపై ప్రయోగ పరీక్షల అనంతరం ఈ నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు.

సూది మందుతో జన్యుచికిత్స!

జన్యు చికిత్సకు సంబంధించి పరిశోధకులు ముందడుగు వేశారు. ఇంజక్షన్ ద్వారా మూత్రపిండాల్లోకి నేరుగా జన్యువులను ప్రవేశపెట్టే చికిత్సా విధానాన్ని కనుగొన్నారు. దీనిని ఇప్పటికే ఎలుకలపై విజయవంతంగా ప్రయోగించారు. అమెరికాకు చెందిన ఎన్జీవో మాయో క్లినిక్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలు నిర్వహించారు. ఎడినో అసోసియేటెడ్ వైరస్‌(ఏఏవీ), లెంటివైరల్ వెక్టార్లను ఉపయోగించి ఈ మందును అభివృద్ధి చేశారు. భవిష్యత్తులో ఈ చికిత్స విధానాన్ని మనుషుల్లోనూ ఉపయోగించవచ్చన్నారు. తద్వారా ఇంజక్షన్లు ఇచ్చి జన్యు వ్యాధులకు సులభంగా చికిత్స అందించవచ్చన్నారు.



రాజ్‌భవన్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకలలో గవర్నర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న చిన్నారులు

రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలి

- రాజ్‌భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందడుగు వేయాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆకాంక్షించారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఉన్నతాధికారులు, ప్రముఖులు, చిన్నారులు గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ, దుర్గగుడి ఆలయాల పండితులు గవర్నర్ దంపతులను ఆశీర్వదించారు. విభిన్న ప్రతిభావంతుల కేంద్రాలు, అనాథగృహాల చిన్నారులు గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వాదం పొందారు. మంత్రులు పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాస్, టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డీజీపీ గౌతం సవాంగ్, సీపీ ద్వారకా తిరుమలరావు, సీనియర్ ఐఏఎస్ అధికారులు నీరబ్‌కుమార్ ప్రసాద్, కరికాల వలవన్, అజయ్‌జైన్, శశిభూషణ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం జగన్‌కు వేదపండితుల ఆశీర్వాదం



జగన్‌ను ఆశీర్వదిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి టీటీడీ వేద పండితులు ఆశీర్వచనాలు పలికారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జగన్‌ను ఆశీర్వదించిన వేదపండితులు.. ఆయనకు తిరుమల లడ్డూ ప్రసాదం, క్యాలెండర్, డెయిరీ అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి వెలంపల్లి, సీఎంవో ప్రధాన సలహాదారు అజేయకల్లాం, డీజీపీ గౌతం సవాంగ్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుభాకాంక్షలు చెప్పారు. కాగా, గవర్నర్‌కు సీఎం ఫోన్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరం అంతా మంచే జరగాలని సీఎం ఆకాంక్షించారు. గురువారం ఏలూరు పర్యటనకు వెళ్తున్న సీఎం.. సాయంత్రం 4 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ దంపతులను మర్యాదపూర్వకంగా కలుస్తారు.

రూ.92 కోట్లు తాగేశారు!

- న్యూ ఇయర్ వేళ.. భారీగా మద్యం అమ్మకాలు

కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. రికార్డు స్థాయిలో లిక్కర్, బీరు అమ్మకాలు జరిగాయి. డిసెంబరు 31న రాష్ట్రవ్యాప్తంగా రూ.92కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. సగటున రోజుకు రూ.60 కోట్ల విలువైన మద్యాన్ని ఎక్సైజ్ శాఖ అమ్ముతోంది. న్యూ ఇయర్ సందర్భంగా సాధారణం కంటే రూ.30కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయి. ఏటా 31వ తేదీనే మద్యం అమ్మకాలు భారీగా పెరుగుతాయి. ఈసారి 30న కూడా అమ్మకాలు భారీగా జరిగినట్లు తెలిసింది. ఈ రెండురోజుల్లో రూ.170 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు అంచనా. బుధవారం ఒక్కరోజే 1.65 లక్షల కేసుల లిక్కర్, 60వేల కేసుల బీరు అమ్మకాలు జరిగాయి.

ఆపరేషన్ క్రూర!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యర్థి పక్షానికి మిత్రులుగా ముద్రపడిన వారు కూడా దడదడలాడిపోతున్నారు. ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. సంధి మార్గాలు వెతుక్కుంటున్నారు.

తిరగని చక్రం

ఆయన అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు. మాజీమంత్రి ఆయన కుటుంబానికి సంబంధించిన రవాణా, గ్రానైట్ వ్యాపారాలపై ఎడతెరిపి లేని సోదాలు జరుగుతున్నాయి. కేసుల మీద కేసులు పెడుతున్నారు. బస్సులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డికి సమకాలీనుడు. వైఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన రోజుల్లో కూడా తన వ్యాపారాలపై ఇంత స్థాయి దాడులు జరగలేదని సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

దారికి రాకుంటే...

కోస్తా జిల్లాకు చెందిన ఓ టీడీపీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేశారు. 'అంతం కాదిది ఆరంభం. ముమ్ముందు మరిన్ని కేసులు పడతాయ్' అని సుతిమెత్తగా హెచ్చరించారు. దీంతో ఆ ఎమ్మెల్యే భయపడిపోయి పార్టీ నుంచి తప్పుకొన్నారు. మరో ఎమ్మెల్యేకు చెందిన గ్రానైట్ గనులపై పలుమార్లు దాడులు జరిపి సోదాలు నిర్వహించారు. పార్టీ మారని పక్షంలో భారీ జరిమానాలు కట్టడానికి సిద్ధపడాల్సి వస్తుందని హెచ్చరించారు. దీంతో ఆయన తల పట్టుకొని కూర్చున్నారు. కోస్తా జిల్లాకే చెందిన మరో మాజీమంత్రికి గనులు ఉన్నాయి. వాటిని వదులుకోవాల్సిందే అని 'ఆదేశాలు' అందాయి. తాము సూచించినవారికే గనులు అప్పగించాలని, ఇచ్చినంత తీసుకోవాలని స్పష్టం చేశారు. లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సమాచారం పంపారు. ఈ పరిస్థితి గతంలో ఎన్నడూ చూడకపోవడంతో ఆయన నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

మరో నాయకుడికీ...

తూర్పు గోదావరి జిల్లా వంతాడ ప్రాంతం లేటరైట్ గనులకు ప్రసిద్ధి. ఆ ఖనిజాన్ని సిమెంట్ కంపెనీలు వినియోగించుకొంటాయి. అక్కడ టీడీపీ సానుభూతిపరుడొకరికి కొన్ని గనులు ఉన్నాయి. వాటిని అప్పగించి తప్పుకొంటే మంచిదని హెచ్చరికలందాయి. పెద్దలతో పోరాడే ధైర్యం, శక్తీలేని ఆ నాయకుడు... గనులు వదులుకునేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.

పాత కేసుల తవ్వకాలు

నెల్లూరు జిల్లాకు చెందిన మాజీమంత్రికి సంబంధించి పాతికేళ్ల కిందటి భూవివాదాన్ని తెరపైకి తెచ్చారు. పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నాలుగు గంటల పాటు కూర్చోబెట్టారు. గుంటూరు జిల్లాలో ఒక నేత కేసుల ఒత్తిడి తట్టుకోలేక కొన్నినెలల పాటు నియోజకవర్గానికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. కర్నూలు జిల్లాలో మరో మాజీమంత్రి కూడా కేసుల దాడికి ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఎవ్వరినీ వదలకుండా...

రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నవారేకాక వారికి సన్నిహితులుగా ముద్రపడిన వారికీ కష్టాలు తప్పడం లేదు. ఒక ప్రముఖ ఇన్‌ఫ్రా సంస్థ రాష్ట్రంలో మౌలిక వసతుల ప్రాజెక్టు నిర్వహిస్తోంది. ప్రభుత్వం మారిన తర్వాత ఆ సంస్థకు కష్టాలు మొదలయ్యాయి. పరిస్థితి బాగోలేదని గుర్తించిన ఆ సంస్థ... మరో పెద్ద కంపెనీకి విక్రయించాలని ప్రయత్నించింది. డీల్ అమలు కావాలంటే రూ.వెయ్యి కోట్లు కప్పం కట్టాలని సమాచారం అందడంతో ఇరుపక్షాలు షాక్ తిన్నాయి. ఆ వ్యవహారం పెండింగ్‌లో ఉందని అంటున్నారు. అధికార పీఠానికి సన్నిహితంగా ఉన్న ఓ సీనియర్ నేత రాష్ట్రంలో క్రషర్లు, ఇసుక రవాణా వ్యాపారంపై పట్టు సాధించి మొత్తం తన గుప్పిట్లోకి తెచ్చుకొనే పనిలో పడ్డారు. దీంతో ఈ వ్యాపారాల్లో ఉన్న ఇతర పార్టీల వారు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

కుదరకుంటే తాయిలాలు...

గనులు, పెద్ద వ్యాపారాలు, ఇతరత్రా లావాదేవీలు, లొసుగులు లేని వారిని తాయిలాలతో కొడుతున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే నిర్వహించే సంస్థలకు ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీ మొత్తం అందాల్సి ఉంది. దీనికితోడు అప్పులు ఉన్నాయి. ఆ సమస్యలు తీర్చే బాధ్యత తమదని హామీ రావడంతో... ఆయన వెంటనే తన పార్టీపై రాళ్లు విసరడం మొదలు పెట్టారు. ఆ ఎమ్మెల్యే అధికారపక్షంలోకి వెళ్లిపోయినట్లే అని సొంత పార్టీ నాయకత్వానికి అర్థమైంది.

ఇలా ఎన్నడూ లేదు

"గతంలో ఇటువంటి వ్యవహారాలు చిన్న స్థాయిలో స్థానికంగా అక్కడక్కడా ఉండేవి. ఇప్పుడు అవి రాష్ట్ర స్థాయి నుంచే అమలు కావడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అధికారానికి కేంద్ర బిందువుగా ఉన్నవారు ఏ మాత్రం వెరపు లేకుండా యంత్రాంగాన్ని, పోలీస్ శాఖను ప్రత్యర్థులపై ప్రయోగిస్తున్నారు. ఇదొక కొత్త అనుభవం. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రతి నాయకుడినీ వెంటాడే ప్రయత్నం చేస్తున్నారు. మానసికంగా గట్టి పట్టుదల కలిగిన వారే వీటికి తట్టుకొని నిలబడగలుగుతున్నారు"

- విపక్ష పార్టీ సీనియర్ నేత

అప్పుడు జరిగింది వేరు..

పదిహేనేళ్ల కిందట ఏపీ రాజకీయాల్లో ఆపరేషన్ ఆకర్ష్ ఒక సంచలనం! అప్పటి సీఎం వైఎస్ హయాంలో పెద్దసంఖ్యలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి చేరిపోయారు. దీనికి ఆకర్షణలే కీలకంగా పనిచేశాయి. ఒత్తిళ్లు, బెదిరింపులు పెద్దగా కనిపించలేదు. ఇటీవల చంద్రబాబు హయాంలోనూ ఇదే జరిగింది. 'మేం తలచుకుంటే ప్రభుత్వం కూలిపోతుంది' అని జగన్ ప్రకటించిన తర్వాతే ఎమ్మెల్యేల చేరికలకు చంద్రబాబు తలుపులు తెరిచారు. ఇప్పుడు మాత్రం ప్రత్యర్థులను భయకంపితులను చేసి లొంగదీసుకొనే కొత్త తరహా ఆపరేషన్ మొదలైంది. అదీ పాలనకు కేంద్ర బిందువైన స్థానం నుంచే వ్యూహ రచన, ఆదేశాలు, పర్యవేక్షణ జరుగుతుండటంతో ప్రత్యర్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.

కేసులతో కొడతారు..

రాజకీయ ప్రత్యర్థులపై పెద్ద సంఖ్యలో కేసులు పెట్టించి, ఒత్తిడికి గురి చేయడం... లొంగేలా చేసుకోవడం కూడా తీవ్రస్థాయిలో జరుగుతోంది. అధికార పార్టీ వారు ఫిర్యాదు ఇవ్వగానే కేసు నమోదవుతుంది. అదికూడా బెయిలు రాని సెక్షన్ల కింద కేసు పెట్టి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తున్నారు. అదే... ప్రత్యర్థి పక్షం ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోవడం, లేదా స్టేషన్ బెయిలు ఇచ్చి పంపడం జరుగుతోంది. కేసుల నమోదులో పెద్ద నేతలను కూడా వదిలి పెట్టడం లేదు. తనపై ఫర్నిచర్ దొంగతనం కేసు నమోదు చేయడంతో మనస్తాపానికి గురైన మాజీ స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు ఆత్మహత్య చేసుకోవడం ఈ పరిణామాలకు పరాకాష్ఠ. గుంటూరు జిల్లాలోని పల్నాడు ప్రాంతంలో కేసుల నమోదుకు భయపడిపోయి టీడీపీ సానుభూతిపరులు గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వచ్చింది. ఈ ఒత్తిడి తట్టుకోలేక కొందరు నేతలు అధికార పార్టీలో చేరిపోయారు.

నేటి నుంచి ఇంటికే ఇసుక

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇంటివద్దకే ఇసుక సరఫరా చేసే కార్యక్రమం కృష్ణా జిల్లాలో గురువారం నుంచి అమల్లోకి రానుంది. రవాణా సదుపాయం బాధ్యతను కూడా ఏపీఎండీసీనే తీసుకుని కొత్త విధానానికి శ్రీకారం చుడుతున్నట్లు బుధవారం ఆ సంస్థ ఎండీ ఎం.మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఇసుక కొనుగోలుదారులు భవన నిర్మాణ ప్రదేశం వివరాలు పోర్టల్‌లో ఉంచి, మ్యాప్ ద్వారా జియో ట్యాగింగ్ చేస్తారు. దీంతో నిర్మాణ ప్రదేశానికి నేరుగా ఇసుక వచ్చేస్తుంది. బుకింగ్ డబ్బు చెల్లించడంతో పాటు రవాణా చార్జీ కూడా చెల్లించాలి. రవాణా చార్జీ కూడా ఏపీఎండీసీ నిర్ణయించింది. 20 కిలోమీటర్ల దూరం వరకు టన్నుకు కిలోమీటరుకు రూ.6.60 రవాణా చార్జీ చెల్లించాలి. 30 కిలోమీటర్ల దూరం అయితే కిలోమీటరుకు రూ.6 చెల్లించాలి. 30 కిలోమీటర్లకు పైన అయితే కిలోమీటరుకు రూ.4.90 చొప్పున రవాణా చార్జీ నిర్ణయించామని ఆయన తెలిపారు. తొలుత కృష్ణా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, తదుపరి అన్ని జిల్లాల్లోను అమలు చేస్తారు.

విద్యుత్ బకాయి 1,212 కోట్ల చెల్లింపు

» సౌర, పవన విద్యుత్ సంస్థలకు విడుదల

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిల చెల్లింపు ప్రారంభించింది. పీపీఏల వివాదం తర్వాత ఈ సంస్థలకు బకాయిల విడుదల ఇదే మొదటిసారి. డిసెంబరు నెలాఖరు వరకూ ఈ సంస్థలకు రూ.1212 కోట్లు చెల్లించినట్లు విద్యుత్‌శాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీపీఏల రగడ మొదలైంది. సౌర, పవన విద్యుత్‌కు చెల్లించే ధర ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించడం కోసం విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను సవరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థలకు నోటీసులు కూడా జారీ చేసింది. అయితే, ఒకసారి ఒప్పందాలు కుదిరిన తర్వాత వాటిని సవరించడం సరికాదని ఆ సంస్థలు వాదించాయి. ఈ వివాదంతో వాటికి చెల్లింపులను రాష్ట్ర విద్యుత్ సంస్థలు నిలిపివేశాయి. దీంతో ఆ సంస్థలు కోర్టును ఆశ్రయించాయి. యూనిట్‌కు రూ.2.44 చెల్లించడానికి విద్యుత్ సంస్థలు అంగీకరిస్తున్నందు వల్ల ముందు ఆ మొత్తం చెల్లించాలని, మిగిలిన మొత్తం చెల్లింపుపై విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ విచారణను బట్టి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. దీనికి అనుగుణంగా తాజా చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం 219 పవన విద్యుత్ సంస్థలకు రూ.1,896 కోట్లు, 44 సౌర విద్యుత్ సంస్థలకు రూ.359 కోట్లు(మొత్తం రూ.2,255 కోట్లు) చెల్లించాల్సి ఉంది. ఇది సెప్టెంబరు నెలాఖరు నాటి వరకూ ఉన్న లెక్క. ఇందులో డిసెంబరు నెలాఖరు నాటికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు 1,212 కోట్లు చెల్లించాలి. ఇందులో అత్యధిక మొత్తం డిసెంబరు 31నే చెల్లించారు. ఆ ఒక్క రోజే రూ.868 కోట్ల చెల్లింపు జరిగింది. ఈ చెల్లింపుల కోసం ఇరెడా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్‌ల నుంచి డిస్కంలు రుణాలు తీసుకొన్నాయి. ఈ రుణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు గ్యారంటీ ఇచ్చింది. ఎక్కువ ధర వల్ల విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం చాలా ఉందని, అయినా కోర్టు ఆదేశాలను దృష్టిలో ఉంచుకొని బకాయిల చెల్లింపునకు తగిన ఏర్పాట్లు చేశామని విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

మేలు రకం ధాన్యం సేకరించండి

» ప్రభుత్వం మార్గదర్శకాలు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ధాన్యం సేకరణ పాలసీని పౌరసరఫరాల శాఖ ప్రకటించింది. ఇప్పటికే నెల రోజుల నుంచి రాష్ట్రంలో ధాన్యం సేకరణ జరుగుతోంది. ఇప్పటికే కొనుగోలు మార్గదర్శకాలు జారీ చేయగా, అవే మార్గదర్శకాలతో బుధవారం నూతన పాలసీని ప్రకటించింది. ధాన్యం కామన్ రకం క్వింటాలు రూ.1815, గ్రేడ్ ఏ రకం రూ.1835 చొప్పున సేకరించనున్నట్లు తెలిపింది. ధాన్యం సేకరించిన వెంటనే ఆన్‌లైన్‌లో రైతులకు నగదు జమ చేస్తారని పేర్కొంది. వీలైనంత వరకూ స్వర్ణ, ఇతర మంచి రకాలను సేకరించాలని అధికారులను ఆదేశించింది. నాణ్యమైన బియ్యాన్ని రేషన్ షాపుల ద్వారా సరఫరా చేయబోతున్నందున ఈ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

లక్షకు రోజుకు వెయ్యి

రోజువారీ వడ్డీలతో బెంబేలు.. గుంటూరులో కాల్ నాగుల అరాచకం

» నూటికి రోజుకు 30 చొప్పున వడ్డీ

» మహిళలపై లైంగిక వేధింపులు

» ఫిర్యాదులతో రంగంలోకి పోలీసులు

» రూ.30 లక్షలకు పైగా నగదు.. ప్రామిసరీ నోట్లు, చెక్కులు స్వాధీనం

» ఇద్దరు వ్యాపారులపై రౌడీ షీట్లు

గుంటూరు, జనవరి 1: పేదల ఆర్థిక అవసరాలే వారికి ఆయువుపట్లు. చిన్న చిన్న వ్యాపారుల అవసరాలే వారి వడ్డీ వ్యాపారానికి నిచ్చెనమెట్లు. వందల్లో ఇస్తూ వడ్డీ పేరుతో వేలల్లో దోచేస్తూ కాల్‌మనీ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. మహిళలనైతే.. లైంగికంగా కూడా వేధిస్తున్నారు. అదేమంటే తమకు పోలీసుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పుకుంటూ అప్పు తీసుకున్న వారిని బెదిరింపులు, వేధింపులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రోజువారీ, వంద రోజులు, మీటరు(30%) వడ్డీలు వసూలు చేస్తూ బుసలు కొడుతున్న కాల్‌నాగులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గుంటూరులోని లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని హజారు వారి వీధిలో అధిక వడ్డీలు వసూలు చేస్తున్న విద్యానగర్ 1వ లైను ఎక్స్‌టెన్షన్‌కు చెందిన ఇమిడాబత్తుని కల్యాణ చక్రవర్తి అలియాస్ పప్పుల నాని, నెహ్రూనగర్ నాలుగో లైన్‌కు చెందిన మాజేటి శేఖర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. స్పందన కార్యక్రమంలో ఇటీవల నెహ్రూనగర్ 10వ లైన్‌కు చెందిన యేలే దుర్గాప్రసాద్ అనే కళ్లజోళ్ల వ్యాపారి అర్బన్ ఎస్పీని ఆశ్రయించి వీరి వేధింపులపై ఫిర్యాదు చేశారు. వీరి కార్యకలాపాలపై ప్రాథమికంగా విచారించిన అర్బన్ ఎస్పీ రామకృష్ణ చర్యలు తీసుకోవాలని ఈస్ట్ డీఎస్పీ కె.సుప్రజను ఆదేశించారు. దీంతో గత నెల 30న లాలాపేట పోలీస్ స్టేషన్‌లో వీరిపై పలు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం, పప్పుల నాని కార్యాలయంపై దాడి చేసి 30,32,900 నగదు, 9 ఖాళీ ప్రామిసరీ నోట్లు, 10 ఖాళీ బ్యాంకు చెక్కులు, రోజువారి మీటరు వడ్డీకి సంబంధించిన 25 పుస్తకాలు, ఓ ఏటీఎం కార్డును స్వాధీనం చేసుకున్నారు. వీరు మూడు రకాలుగా ప్రజల నుంచి వడ్డీలను వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. లక్ష రూపాయలు అప్పుగా తీసుకుంటే రోజుకు వెయ్యి చొప్పున చెల్లించాలి. ఎన్ని రోజుల పాటు చెల్లించినా దానిని వడ్డీగానే భావిస్తారు. చివరకు ఆ లక్ష ఒక్కసారిగా చెల్లిస్తేనే బాకీ మాఫీ అయినట్లు పరిగణిస్తారు. దీనినే మీటరు వడ్డీగా పేర్కొంటారు. లక్ష అవసరం అయిన వారికి ముందుగానే 22 వేలు మినహాయించుకుని 78 వేలు ఇస్తారు. రోజుకు వెయ్యి చొప్పున వంద



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ డీఎస్పీ సుప్రజ, వెనుక నిందితులు నాని, శేఖర్

రోజుల్లో లక్ష చెల్లించాలి. దీనిని వంద రోజుల వడ్డీగా పేర్కొంటారు. రూ.పది వేలు అవసరం అయితే ఉదయం వెయ్యి మినహాయించుకుని 9 వేలు ఇస్తారు. సాయంత్రానికి వెయ్యి కలిపి పది వేలు ఇవ్వాలి. దీనిని రోజువారి వడ్డీగా పిలుస్తారు. ఈ విధంగా వీరు గడిచిన 20 ఏళ్లుగా నగరంలో వ్యాపారం చేస్తున్నట్లు ఈస్ట్ డీఎస్పీ తెలిపారు. చిన్నప్పటి నుంచి నానికి శేఖర్ స్నేహితుడిగా ఉంటున్నాడని, ఆయన చేసే వ్యాపారంలో శేఖర్ డబ్బు వసూలు చేస్తున్నాడని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారు, వడ్డీలు చెల్లించలేని మహిళలు ఎవరైనా ఉంటే వారిని లైంగికంగా కూడా వేధింపులకు గురి చేస్తారన్నారు. అంతేకాక వీరి వద్ద అప్పు తీసుకుని చెల్లించలేకుంటే వారిని కార్యాలయానికి తీసుకొచ్చి నిర్బంధించి వేధిస్తారని చెక్కులు, నోట్లు తీసుకుంటారని ఆమె తెలిపారు. వీరిలో నానిపై 2010 నుంచి ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదు కాగా శేఖర్‌పై ఓ అత్యాచారం కేసుతో పాటు మరో రెండు కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఇరువురిపై రౌడీషీట్లు తెరుస్తున్నామని చెప్పారు. అయితే వీరు కొందరు పోలీసుల పేర్లు చెప్పి బాధితులను బెదిరించడం చేసేవారని పోలీసు అధికారులకు ఫిర్యాదులు అందాయి. వాటిపై కూడా విచారణ చేస్తున్నారు.



విశాఖ రైల్వేస్టేషన్‌లో నేటి నుంచి హాయ్!

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మరో కొత్త సౌకర్యం గురువారం నుంచి అందుబాటులోకి రానుంది. దీని పేరు 'హ్యూమన్ ఇంటరాక్టివ్ ఇంటర్‌ఫేస్' (హాయ్). ఇది స్మార్ట్ డిజిటల్ కియోస్క్ కమ్ డిజిటల్ బిల్ బోర్డు. దీని ద్వారా ఉచితంగా వీడియో కాల్ చేసుకోవచ్చు. రైళ్ల రాకపోకల వివరాలు, సమయాలు తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్, సిటీ మ్యాప్ అన్నీ ఉంటాయి. నగరంలోకి వచ్చేవారు ఎక్కడ ఏమున్నదీ చూసుకోవచ్చు. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ ఫాస్ట్ ఛార్జింగ్ చేసుకోవచ్చు. ఈ సేవలన్నీ ఉచితమే. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సాధారణ కియోస్క్‌లు ఉన్నాయి. అక్కడ ఫీడ్ చేసిన సమాచారం మాత్రమే డిస్‌ప్లే అవుతుంది. ఇందులో తాజా సమాచారంతో.. వీడియో కాలింగ్, ఫాస్ట్ చార్జింగ్ అదనం.

వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించండి

» హైకోర్టులో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి పిటిషన్

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును సీబీఐ లేక రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ లేని స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివేకా హత్య కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) వైఖరిని చూస్తే.. అమాయకుల్ని కేసులో ఇరికించేలా ఉందని అనుమానం వ్యక్తంచేశారు.ఈ వ్యవహారంలో అనేక అనుమానాలు ఉన్నాయని, అందువల్ల వివేకా హత్య కేసును సీబీఐ లేక స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దర్యాప్తు చేయించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరుగనుంది.

వీసీ దామోదర్‌నాయుడుపై విచారణను తప్పుబట్టలేం

» కానీ చర్యలు తీసుకోవలసింది గవర్నరే

» అది కూడా బలమైన ఆధారాలుంటేనే!

» రాష్ట్ర హైకోర్టు తీర్పు

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ వి.దామోదర్‌నాయుడుపై రేగిన ఆరోపణలకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన ప్రాథమిక విచారణను తప్పుబట్టలేమని హైకోర్టు పేర్కొంది. ఆయనపై బలమైన ఆధారాలుంటే చర్యలు తీసుకోవాల్సింది చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ మాత్రమే తప్ప, రాష్ట్ర ప్రభుత్వం కాదని స్పష్టం చేసింది. వర్సిటీ వీసీగా దామోదర్ నాయుడు పలు అక్రమాలకు పాల్పడ్డారంటూ కొంతమంది ఉద్యోగులు ఛాన్స్‌లర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయగా, వాటి ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో ప్రాథమిక విచారణకు ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ దామోదర్‌నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి ఇటీవల తీర్పు వెల్లడించారు. ఏపీ వ్యవసాయ వర్సిటీ చట్ట నిబంధనల మేరకు వర్సిటీ కార్యకలాపాలకు సంబంధించి విచారణ జరపడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పరిమితులు లేవని స్పష్టంచేశారు. పిటిషనర్‌పై ఉన్న ఆరోపణలకు సంబంధించి బలమైన ఆధారాలుంటే సెక్షన్ 11(7) ప్రకారం గవర్నర్ మాత్రమే చర్యలు తీసుకోగలరని.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకోజాలదని స్పష్టం చేశారు. పిటిషనర్‌పై విచారణ పూర్తయ్యాక భవిష్యత్‌లో సమర్పించబోయే నివేదిక ఆధారంగా మాత్రమే గవర్నర్ వీసీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేరని తేల్చిచెప్పారు.



లేపాక్షి కూడలి వద్ద బారులుతీరిన భక్తులు

సామాన్యులకే శ్రీవారి తొలిదర్శనం

» జనవరి 1న 95వేల మందికి దర్శనభాగ్యం

తిరుమల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాదిన తిరుమలలో దర్శనాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగాయి. ఉగాది పర్వదినాన నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న టీటీడీ... జనవరి 1న సంబరాలకు దూరంగా ఉంటోంది. ఇదే సంప్రదాయాన్ని ఈసారీ కొనసాగించడంతో హంగూ, ఆర్భాటాలకు తావులేకుండా సంవత్సరం మొదటిరోజు సాధారణంగా గడిచింది. వీఐపీ పాస్‌లు, వసతి కేటాయింపుల్లో ప్రత్యేకతలు లేకపోవడం, ప్రముఖులు కూడా పెద్దగా రాకపోవడంతో ఎలాంటి హడావుడి కనిపించలేదు. బుధవారం వేకువన 2గంటలకు ఆలయం తెరిచి తిరుప్పావై పఠనం, ఇతర ధనుర్మాస కైంకర్యాలు నిర్వహించారు. సరిగ్గా 3గంటలకు సర్వదర్శనం ప్రారంభించారు. దీంతో ఏడాది తొలిరోజున స్వామివారి తొలిదర్శనం సామాన్య భక్తులకే దక్కింది. ఉదయం 6గంటల నుంచి వీఐపీ దర్శనం మొదలై 8.30వరకు కొనసాగింది. మొత్తం 1,892మంది వీఐపీలు స్వామిని దర్శించుకున్నారు. ఆ వెంటనే తిరిగి సర్వదర్శనం ప్రారంభించి అర్ధరాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగించారు. ఇతర సేవలు, దర్శనాలు లేకపోవటంతో క్యూలైను త్వరగా ముందుకు కదిలింది. ఉదయం 9గంటలకు క్యూలైను లేపాక్షి కూడలిని దాటింది. ఈ ప్రాంతంలో భక్తుల మధ్య స్వల్పంగా తోపులాటలు చోటుచేసుకున్నాయి. అర్ధరాత్రి ఏకాంతసేవ సమయానికి వీఐపీలతో కలిపి దాదాపు 95వేల మందికి శ్రీవారిదర్శనం లభించింది.



తిరుమలలో వర్షం

బుధవారం ఉదయం తిరుమలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో చలి మరింత పెరిగి చంటిపిల్లలు, వృద్ధులతో పాటు ఇతర భక్తులు గజగజా వణికిపోయారు. కాసేపటికే వర్షం ఆగిపోయినా, రోజంతా ఆకాశం మేఘావృతమై చలి తీవ్రత కొనసాగింది.

రాష్ట్రానికి ఇద్దరు ఐఏఎస్‌లు

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇద్దరు ఐఏఎస్ అధికారులను కేటాయిస్తూ డీవోపీటీ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. నాగాలాండ్ కేడర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ మనజీర్ జిలాని సామూన్, ఉత్తరప్రదేశ్ కేడర్‌కు చెందిన 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి తమీమ్ అన్సారియా ఇద్దరూ భార్యాభర్తలు. వీరిని మ్యారేజ్ గ్రౌండ్స్ కింద బదిలీపై ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

అప్పుల బాధతో నేతన్న బలవన్మరణం

ధర్మవరం, జనవరి 1: అప్పులబాధ తాళలేక ఓ చేనేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనంతపురం జిల్లా ధర్మవరంలో బుధవారం చోటుచేసుకున్న సంఘటన వివరాలు...పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన మాదన దామోదర్ (38) సొంతమగ్గాలు వేసి నష్టం రావడంతో రూ.10 లక్షలకుపైగా అప్పులు చేశాడు. ఈపరిస్థితుల్లో కూలీమగ్గం ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడం, కుటుంబ బాధ్యతలతో తీవ్ర మధనపడేవాడని బంధువులు తెలిపారు. బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

డెంగీతో బాలిక మృతి

పత్తికొండ రూరల్, జనవరి 1: కర్నూలు జిల్లా పత్తికొండ మండలం ఆర్.మండగిరి గ్రామానికి చెందిన దిల్‌షాద్ (6) అనే బాలిక డెంగీతో బుధవారం మృతి చెందింది. సుభాన్, జహీనాబీ దంపతుల పెద్ద కుమార్తె దిల్‌షాద్‌కు నాలుగు రోజుల క్రితం తీవ్రమైన జ్వరం రావడంతో స్థానిక వైద్యుల వద్ద చికిత్స అందించారు. జ్వరం తగ్గకపోవడంతో గుంతకల్లులో చిన్నపిల్లల ఆసుపత్రికి తీసుకువెళ్లగా డెంగీ లక్షణాలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. బాలికను మంగళవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందింది.

రేపటి నుంచే పుస్తక పండగ

» బెజవాడలో ప్రారంభించనున్న గవర్నర్ హరిచందన్

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవానికి విజయవాడ సిద్ధమవుతోంది. ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. విజయవాడ స్వరాజ్య మైదానంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 31వ పుస్తక మహోత్సవాన్ని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ప్రారంభించనున్నారు. ఏటా 300 స్టాల్స్ ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఆ సంఖ్యను 266కి పరిమితం చేశారు. ప్రధాన వేదికకు డాక్టర్ సి.రాఘవాచారి పేరు, ప్రతిభా వేదికకు డాక్టర్ హేమపరిమి పేరు పెట్టారు.

ఉపాధి నిధులు 123 కోట్లు విడుదల

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి మొదటి విడతలో ఐదో ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.123.37 కోట్లు విడుదల చేస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాచ్చింది. ఈ నిధులను మెటీరియల్ పనులు, నిర్వహణకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మెటీరియల్ కింద రూ.30.52 కోట్లు, నిర్వహణ వ్యయం కింద రూ.92.84 కోట్లు విడుదల చేసిన కేంద్రం.. రాష్ట్ర ప్రభుత్వ వాటాను కలిపి మూడు రోజుల్లో పంపిణీ చేయాలని సూచించింది. గడువులోపు నిధులు బదిలీ చేయకపోతే రాష్ట్రానికి రావాల్సిన నిధులు నిలిపివేస్తామని హెచ్చరించింది. పైగా 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది.

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై త్వరలో చర్యలు

» అదో ప్రతిపక్షం, ఆయనో నాయకుడు: తమ్మినేని సీతారామ్

శ్రీకాకుళం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ఏర్పాటు ముసుగులో గత ప్రభుత్వం జరిపిన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ జరిపించి త్వరలో చర్యలు చేపడతామని స్పీకర్ తమ్మినేని సీతారామ్ అన్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో ఆయన మాట్లాడుతూ విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా సమర్థిస్తారా, వ్యతిరేకిస్తారా చంద్రబాబు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అదో ప్రతిపక్షం, ఆయనో నాయకుడు అంటూ ఎద్దేవా చేశారు. వాన్‌పిక్ భూముల వ్యవహారంపై మాట్లాడుతున్న టీడీపీ... ఆ వ్యవహారం ఏ ప్రభుత్వం హయాంలో జరిగిందో గుర్తు చేసుకోవాలన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ దానిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

బాబుకు ప్రతిపక్ష హోదా ఉండదు: మంత్రి కృష్ణదాస్

శ్రీకాకుళం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు తప్పిదాల కారణంగానే ప్రతిపక్షంలో కూర్చున్నారని, ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో ఆయన మాట్లాడుతూ 23మంది టీడీపీ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఇద్దరు బయటకు వెళ్లారన్నారు. మరో ఇద్దరు వెళ్తే చంద్రబాబు ప్రతిపక్ష హోదాలో కొనసాగే అవకాశం ఉండదన్నారు. రాష్ట్రంలో వైసీపీకి 151 స్థానాలు దక్కాయంటే ప్రజలు ఎంతటి గౌరవం ఇచ్చారో ఆయన అర్థం చేసుకోవాలన్నారు.

'నూతనో'త్సాహం ఆవిరి

» ముగ్గురిని మింగిన కడలి.. నెల్లూరు జిల్లాలో విషాదం

వాకాడు, జనవరి 1: సముద్ర స్నానానికి వెళ్లిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. నెల్లూరు జిల్లా వాకాడు మండలం తూపిలిపాళెం తీరంలో జరిగిన వివరాలు.. తిరుపతి జీవకోన ప్రాంతానికి చెందిన బత్తెల సోనియా(20), దేరాంగుల సోనియా (21), రాహుల ద్రావిడ్ అలియాస్ మధు(22), చంద్రశేఖర్ మంగళవారం రాత్రి తూపిలిపాళెం వచ్చారు. ఆంగ్ల సంవత్సరాదిని ఉత్సాహంగా జరుపుకొని.. బుధవారం వేకువజామున స్నానం చేసేందుకు సముద్రంలోకి వెళ్లారు. అలల ఉధృతికి మొదట బత్తెల సోనియా మునిగిపోతుండగా, ఆమెను రక్షించేందుకు ప్రయత్నించి సోనియా, మధు మునిగిపోయారు. చంద్రశేఖర్‌ను జాలర్లు కాపాడారు. మిగిలిన ముగ్గురిని బయటకు తీసి నాయుడుపేటలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు హత్య

పాయకరావుపేట, జనవరి 1: మద్యం తాగివచ్చిన భర్త భార్యతో గొడవపడి, రోకలిబండతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడు. విశాఖ జిల్లా పాయకరావుపేటలో బుధవారం తెల్లవారుజామున జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... స్థానిక మంగవరం రోడ్డులో గల నాగనరసింహ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కంచెర్ల మేరి కమలాక్షి (48), భర్త శోభన్‌రాజు, ఇద్దరు పిల్లలతో స్థానిక చెక్కానగర్‌లో నివాసం ఉంటున్నారు. పిల్లలు బీటెక్ చదువుతున్నారు. శోభన్‌రాజు ఖాళీగా ఉంటూ రోజూ మద్యం సేవించి భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కమలాక్షి, శోభన్‌రాజు పట్టణంలోని చర్చికి వెళ్లి రాత్రి ఒంటి గంట తరువాత ఇంటికి వచ్చారు. ఆ తరువాత శోభన్‌రాజు మద్యం సేవించి వచ్చాడు. ఆతర్వాత భార్య,భర్తల మధ్య గొడవ ప్రారంభమైంది. ఆసమయంలో శోభన్‌రాజు ఇంట్లో ఉన్న రోకలి బండతో కమలాక్షి తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఇంట్లోనే వదిలేసి బయటకు వెళ్లిపోయాడు. బయట నుంచి వచ్చిన పిల్లలు, చుట్టుపక్కలవారు కమలాక్షిని విశాఖపట్నం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది.

పెండింగే పెను సమస్య

» దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో ఖాళీగా 500 జడ్జి పోస్టులు

» ఇది ఆందోళనకరం... దేశమంతా ఇదే పరిస్థితి

» ఏపీలో తగినన్ని కోర్టు భవనాలు.. న్యాయమూర్తులు లేరు

» తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ దినోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ



హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): దేశమంతా హైకోర్టుల్లో జడ్జీల కొరత వేధిస్తోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. "తెలంగాణ హైకోర్టులో 24 మంది జడ్జీలుండాలి. కానీ ప్రస్తుతం 13 మందే ఉన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు చూస్తే 2.07 లక్షల పైనే ఉన్నాయి. ఇది ఆందోళనకరం. జడ్జీల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి హైకోర్టు ద్వారా సిఫారసు వస్తే దాన్ని సుప్రీంకోర్టు వెంటనే పరిశీలిస్తుంది. వారం రోజుల్లోగా దానిపై ఓ నిర్ణయానికి వచ్చి తగిన చర్యలు తీసుకుంటుందని" అని ఆయన చెప్పారు. తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారంనాడు ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఒక్క తెలంగాణయే కాదు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి. దేశమంతా కూడా ఇదే స్థితి. దేశం మొత్తం మీద హైకోర్టుల్లో ఉండాల్సిన జడ్జీలు 1100 పైచిలుకు కాగా, ప్రస్తుతం ఉన్నది కేవలం 600పైన మాత్రమే. సుప్రీంకోర్టులో ఏదీ పెండింగ్‌లో ఉండదు. కొత్త సీజే జస్టిస్ శరద్ బోబ్డే కూడా క్రియాశీలకంగా ఉంటున్నారు. ఏ ఫైలూ పెండింగ్‌లో పెట్టరు. సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న సిఫారసు అంశాలు కేవలం 51 మందికి సంబంధించినవే. మేం క్లియర్ చేసి కేంద్రానికి పంపేస్తున్నాం. కానీ న్యాయశాఖ వద్ద 151 సిఫారసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏవో నిర్దిష్ట కారణాల వల్ల తప్పితే పెండింగ్ ఉండదు. ఎన్నికలు రావడం, ఇతరంశాల వల్ల ప్రభుత్వ స్థాయిలో అప్పుడప్పుడూ ఆలస్యం జరుగుతుంది. కొన్ని విషయాలు బయటికి చెప్పలేం. కానీ ఈ ఖాళీల భర్తీ అనేది మరీ ఆందోళనకరంగా కనిపిస్తోంది" అని జస్టిస్ రమణ పేర్కొన్నారు. 'ఎంతో పోరాడి సొంతంగా హైకోర్టు సాధించుకున్నారు. కానీ తగినంత మంది జడ్జీలుంటేనే సార్థకత. ఇక్కడ పెద్ద భవనం ఉంది, జడ్జీలు లేరు. ఏపీలో భవనాలూ లేవు, తగినంత మంది న్యాయమూర్తులూ లేరు" అన్నారాయన.

ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు మృతి

» చిత్తూరు జిల్లాలో విషాదం

తవణంపల్లె, జనవరి 1: నూతన సంవత్సర ప్రారంభం రోజునే చిత్తూరు జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్ కింద పడి ముగ్గురు ఓంశక్తి మాలధారులు మరణించిన ఘటన జిల్లాలోని తవణంపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..తవణంపల్లె మండలం జి.ఒడ్డిపల్లె గ్రామానికి చెందిన ఓంశక్తి మాలధారులు బుధవారం నూతన సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని గ్రామంలో అన్నదానం చేశారు. అనంతరం సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు 26 మంది మాలధారులు ట్రాక్టరులో బయల్దేరారు. సిద్ధేశ్వర ఆలయ సమీపంలోని పెద్దమడుగు వద్ద మిట్టగా ఉన్న రోడ్డును ఎక్కుతుండగా ట్రాక్టరు అదుపు తప్పి 10 అడుగుల లోతులోకి బోల్తా పడింది. దీంతో ట్రాక్టరు ట్రాలీలో ప్రయాణిస్తున్న లోకమ్మ (40), బుజ్జి (45), గౌతమ్ (7) అక్కడికక్కడే మృతి చెందారు. 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ అదుపు తప్పగానే డ్రైవర్ దూకి పారిపోయాడు. మృతుల్లో లోకమ్మ, గౌతమ్ అవ్వా మనవడు.



బోల్తాపడిన ట్రాక్టరు

అపురూప సాహసి

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కాల గమనంలో కరిగి పోయిన 2019 చిరస్మరణీయ విజయాలను అందించింది. తిరుగులేని రికార్డులను సృష్టించింది. మరపురాని జ్ఞాపకాలను మిగిల్చింది. మానవ చరిత్రకు మరెన్నో విశిష్టతలను కలుగజేసింది. అలాంటి అరుదైన మైలురాయే మేటి మాలావత్ పూర్ణ చేసిన అపురూప సాహసం.

పర్వతారోహణలో ఇప్పటికే పలు సాహసాలు చేసి దేశానికి ప్రత్యేక విశిష్టతలను సంపాదించి పెట్టిన ఈ తెలుగు బిడ్డ గత నెల 26న మంచు ఖండమైన అంటార్కిటికాలోని అతి ఎత్తయిన విన్సన్ మసిఫ్ పర్వతాన్ని అధిరోహించింది. 16,050 అడుగుల ఎత్తు గల ఈ పర్వతం ప్రపంచంలోని అతి ఎత్తయిన పర్వతాల్లో ఒకటిగా రికార్డులకెక్కడమే కాదు, అధిరోహణకు అత్యంత దుర్లభమైనదిగానూ ఉంది. అటువంటి దుస్సాధ్యమైన అధిరోహణను అలవోకగా సుసాధ్యం చేసిన పూర్ణ సాహసాన్ని 'ఔరా' అంటూ ప్రపంచమే కొనియాడుతోంది. దీనితో ఆమె ఆరేళ్లలో ఆరు ఖండాల్లోని ఆరు ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన మహిళగానూ మరో రికార్డును సొంతం చేసుకున్నారు.

2014లో 13 ఏళ్ల 11 నెలల వయస్సులోనే ఆసియాలోని అతి ఎత్తయిన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన పూర్ణ ఈ ఘనతను సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. అందులోనూ తొలి ప్రయత్నంలోనే ఆ శిఖరాగ్రాన్ని చేరి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆ అపురూప విజయంతోనే ఆ బాలిక ఆగిపోలేదు. ఆ విజయోత్సాహంలోనే ప్రపంచవ్యాప్తంగా ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తైన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. నాటి నుంచీ ఏడాదికో ఖండంలోని పర్వతం చొప్పున ఈ ఆరేళ్లలో ఆరు శిఖరాగ్రాలను చేరుకుని తన లక్ష్యానికి అడుగు దూరంలోకి వచ్చింది. 2020లో దాన్నీ పూర్తి చేస్తానంటూ పట్టుదలగా ప్రకటిస్తోంది. ఆమె సాధిస్తున్న విజయాలను, ఆమె దీక్షాదక్షతలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రపంచం అది సాధ్యమేనని నమ్ముతోంది. మన తెలుగు వారి కీర్తి ప్రతిష్ఠలను ఆమె ఇనుమడింపచేయగలదని అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పర్వతారోహణ అంటే కొండలు, గుట్టలు వంటి ఎత్తులు ఎక్కడమే కాదు. అది ఎన్నో సాహసాలతో కూడిన కృత్యం. పర్వత శిఖరాలను అందుకోవడమంటే ప్రాణాలను పణంగా పెట్టడమే. పర్వతాలపై భౌగోళిక స్థితిగతులు మనకు ఏమాత్రం పరిచయం లేనివిగా ఉంటాయి. విషప్పురుగులు, జంతుజాలాలతో కూడిన పరిస్థితులుంటాయి. కొన్ని పర్వతాలు దారీ తెన్నూ తెలియకుండా ఉండేవి అయితే, మరి కొన్ని మంచుతో కప్పబడి ఉంటాయి. ప్రమాదభరితమైన ఉపరితలాలుంటాయి. తోడు వాతావరణం మరింత ప్రతికూలంగా ఉంటుంది. పైకి వెళ్లే కొద్దీ ప్రాణవాయువు తగ్గిపోతూ ఉంటుంది. ఎవరెస్టు వంటి శిఖరాన్ని అయితే గాలి అందక శ్వాస పీల్చుకోవడమే కష్టంగా ఉంటుంది. కేజీల కొద్దీ బరువును మోసుకుంటూ దారి చేసుకుంటూ ముందుకు సాగడమంటే సామాన్యులకు అసాధ్యం, సాహసులకు దుస్సాధ్యం. అందుకే, పర్వతారోహణ అంటే ప్రపంచంలోనే అత్యంత సాహస కృత్యంగా పేరొందింది. అందులోనూ ఖండఖండాల్లోని పర్వతాలపై విభిన్న భౌగోళిక, వాతావరణ పరిస్థితులు ఉంటాయి. ఉష్ణ మండలంలో ఉండే మనలాంటి వారికి అతిశీతలంగా ఉండే అంటార్కిటికాలోని పర్వతంపై అడుగుపెట్టడమంటే అష్టకష్టాలతో కూడినదే. అలాంటి ఎన్నో ప్రతికూలతలను తట్టుకుంటూ 20 ఏళ్ల కూడా నిండని యువతి ఆరు పర్వతాలను అలుపెరగకుండా ఎక్కుతుంటే మాటల్లో వర్ణించలేని, మానవ శక్తికి మించిన పని. ఇలాంటి ఘనతను సాధించిన వారు ప్రపంచంమొత్తంలోనూ వేళ్లమీద లెక్కబెట్టగలిగినంత మందే ఉన్నారు. అలాంటి అరుదైన వారిలో పిన్న వయస్కురాలు పూర్ణ.

ఇప్పుడు సాహసానికి పర్యాయపదమైన ఈ తెలుగు అమ్మాయి బాల్యంలో ఐదో తరగతి వరకు మనకర్తవ్యగ్రంటుగా, చదువుకోవడమే సాహసంగా ఉండేది. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గిరిజన గ్రామమైన పాకాలకు చెందిన పూర్ణ తల్లిదండ్రులు లక్ష్మీ, దేవీదాస్ వ్యవసాయ కూలీలు. అంతటి పేదరికంలో పుట్టిన పూర్ణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంది. 8వ తరగతిలోనే పర్వతారోహణ శిక్షణకు ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్నప్పుడే ఎవరెస్టును అధిరోహించింది. 'జీవితాన్ని గెలుచుకోవడం కష్టం. ఎవరెస్టును అందుకోవడమే ఈజీ' అన్న పూర్ణ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తున్నది. ఆమె చేసిన సాహసాలను చాటిచెప్పడానికి 'పూర్ణ : ద కరేజ్ హాజ్ నో లిమిట్' అన్న పేరుతో ఈ పర్వతారోహకురాలి బయోపిక్ నిర్మితమైంది. నిమ్న స్థాయి నుంచీ అత్యున్నత స్థాయికి ఎదిగిన పూర్ణ 'అమ్మాయిలు ఏదైనా సాధించగలరు' అని నిరూపించడమే కాకుండా లక్ష్యంగా మరిన్ని ఘనతలు సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతోంది. ఆ సమున్నత లక్ష్యసాధనలో ఆమె విజయం సాధిస్తుందనడం నిస్సందేహమే!


హైకోర్టు తరలింపు సాధ్యమా?

ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల ఏర్పాటుపై చర్చోపచర్చలు, వివాదాలు కొనసాగుతున్నాయి. విశాఖపట్నంలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, అమరావతిలో లెజిస్లేటివ్ క్యాపిటల్, కర్నూలులో జుడీషియల్ క్యాపిటల్ ఏర్పాటు చేయనున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమరావతిలో ఉన్న హైకోర్టును కర్నూలుకు తరలించడం సాధ్యమేనా? అనే సందేహాలు ఎదురవుతున్నాయి. ఇది చట్టపరమైన అంశాలతో కూడి ఉంది.

ఆంధ్ర రాష్ట్ర చట్టం (ఆంధ్ర స్టేట్ యాక్ట్, 1953 సెక్షన్ 3(1)) ప్రకారం 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైంది. ఈ చట్టంలోని సెక్షన్ 28 అనుసరించి ఆంధ్ర రాష్ట్ర హైకోర్టు ఏర్పాటై, 1956 జనవరి 1వ తేదీ నుంచి పని చేయడం ప్రారంభమైంది.

1956లో పార్లమెంటు 'రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం' చేసింది. ఈ చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటైంది. ఇదే క్రమంలో సెక్షన్ 50 ప్రకారం 1872లో ఏర్పడిన హైదరాబాద్‌లోని హైకోర్టుతో సహా కొన్ని కోర్టులు రద్దయినాయి. ఈ చట్టంలోని సెక్షన్ 51(1) ఒక రాష్ట్ర హైకోర్టు ఎక్కడ ఉండాలనే అంశాన్ని రాష్ట్రపతి నిర్ణయించవచ్చు అని చెబుతోంది. ఈ మేరకు సెక్షన్ 65 అనుసరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటైంది. ఆ తరువాత చట్టం ఇచ్చిన అధికారం మేరకు ఇతర చోట్ల డివిజన్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు.

2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం వచ్చింది. అదే సంవత్సరం జూన్ 2న అమలులోకి వచ్చిన దీనిలోని సెక్షన్ 30(1) 'రాష్ట్రం ఏర్పాటైన రోజు నుంచీ ఆంధ్రప్రదేశ్‌లో కొత్త హైకోర్టు ఏర్పాటయ్యే దాకా, హైదరాబాద్‌లోని హైకోర్టే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టుగా ఉంటుం'దని ప్రకటించింది. రాజ్యాంగంలోని 214 అధికరణాన్ని అనుసరించి పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 31(1) ప్రకారం 'ఆంధ్రప్రదేశ్ హైకోర్టు' పేరిట ఏర్పాటయ్యే హైకోర్టు ఎక్కడ ఉండాలనే అంశాన్ని రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా నిర్ణయిస్తారని సబ్ సెక్షన్ 2 తెలియజేస్తోంది. ఈ విధంగా హైకోర్టు ఏర్పాటయ్యాక, డివిజన్ బెంచ్‌లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్న విషయాన్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అమోదం మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి నిర్ణయించాలని పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ 3 సూచిస్తోంది.



అంటే, రాష్ట్ర గవర్నర్ ఆమోదంతో ప్రధాన న్యాయమూర్తి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటు చేయవచ్చని స్పష్టం చేస్తోంది. ఈ రాజ్యాంగ అధికరణలు, పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అనుసరించి టి.ధన్‌గోపాల్ రావు అనునతడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ప్రత్యేక హైకోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఉమ్మడి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. దీన్ని విచారించిన డివిజనల్ బెంచ్ ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత హైకోర్టు ఏర్పాటు చేసే స్థలంపై రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదిస్తూ నిర్ణయించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విన్నవించింది. దీనితో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులను రెండు రాష్ట్రాలకు కేటాయించింది. ఏపీ హైకోర్టుకు వెళ్లనున్న ఈ న్యాయమూర్తులు వివిధ స్థలాలను పరిశీలించి ఎంపిక చేసిన చోట హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు 2018 డిసెంబర్ 26న అమరావతిలో హైకోర్టును ఏర్పాటు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దాని ప్రకారమే 2019 జనవరి 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పని చేయడం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 సెక్షన్ 31(2)ను అనుసరించి హైకోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇప్పుడు అమరావతిలోని హైకోర్టును ఇక్కడ నుంచి తరలించాలంటే ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి. అనంతరం ఈ సెక్షన్ ప్రకారం కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేయాలి. అయితే, ఇలా చేయడానికి వీలు లేదని సెక్షన్ 31 సూచిస్తోంది. అంటే, హైకోర్టును తరలించే అధికారం లేదు, డివిజన్ బెంచ్‌లను ఏర్పాటు చేసే అధికారం మాత్రమే ఉందని అది స్పష్టం చేస్తోంది. హైకోర్టును అమరావతి నుంచి తరలించే నోటిఫికేషన్ జారీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉన్నదని తెలుస్తోంది. 'నారాయణ్ శామ్‌రావు పురాణిక్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసు సందర్భంగా అవసరాన్ని బట్టి ఈ అధికారాన్ని ఉపయోగించవచ్చని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే, సెక్షన్ 31(2) ప్రకారం రాష్ట్రపతి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రీ–నోటిఫై చేయవచ్చా? లేక డివిజనల్ బెంచ్‌ల ఏర్పాటుకు మాత్రమే ఉంటుందా? అనేది ప్రశ్నార్థకమే. రాష్ట్రపతికి ఈ అధికారం ఉందా? లేదా? అనేది న్యాయపరమైన చర్చాంశం. అయితే, ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన 'పరిశీలక కమిటీ' ఆమోదించిన మేరకు అమరావతిలో ఏర్పాటైన హైకోర్టును కర్నూలుకు మార్చడం అనేది ఎన్నో అవరోధాలతో కూడిన అంశం. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును కర్నూలుకు తరలించడం అనేది రాజకీయంగా విజ్ఞతాయుత నిర్ణయమైనా చట్టపరంగా ఇబ్బందులున్న అంశం.

> ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 సెక్షన్ 31(2)ను అనుసరించి హైకోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. ఇపుడు అమరావతిలోని హైకోర్టును ఇక్కడ నుంచి తరలించాలంటే ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి. అనంతరం ఈ సెక్షన్ ప్రకారం కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలి. అయితే, ఇలా చేయడానికి వీలు లేదని సెక్షన్ 31 సూచిస్తోంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులతో కూడిన 'పరిశీలక కమిటీ' ఆమోదించిన మేరకు అమరావతిలో ఏర్పాటైన హైకోర్టును కర్నూలుకు మార్చడం అనేది ఎన్నో అవరోధాలతో కూడిన అంశం.

■ చిత్తర్వు రఘు
న్యాయవాది, ఏపీ, టీఎస్ హైకోర్టు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

వారు విభజిస్తున్నారు, మనం ఏకమవుదాం



■ యోగేంద్ర యాదవ్

కొత్త సంవత్సర వేళ మీరు ఏమి నిర్ణయాలు తీసుకున్నారు? సొంత జీవితాన్ని మరింత వెలుగుమయం చేసుకోవడానికి సంబంధించినవే అయివుంటాయి. అవి, సాధారణంగా అలానే వుండడం పరిపాటి. అయితే మన జాతీయ జీవనంలో వర్తమానం ఒక విషమ స్థితిలో వున్నది. మన పురా నవ భారతదేశం గుర్తుపట్టలేని విధంగా విరూపమవుతోంది; మనం విశ్వసించిన విలువలు, మన జీవితాలకు ఆలంబనగా వున్న సంప్రదాయాలు వికృత దాడులకు గురవుతున్నాయి. మరి ఈ పరిస్థితులలో మన వ్యక్తిగత జీవితాలను రాజకీయ పరిణామాల నుంచి వేరు చేయలేము, చేయకూడదు కూడా.

" 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఏఏ)కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వారు ఎటువంటి వస్త్రాలు ధరించారో చూడండి, అటువంటి బట్టలను ఎవరు ధరించేది ఎవరో మీకు తెలియదా?" అంటూ మన ప్రభుత్వాధినేత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నర్మగర్భితంగా ఎత్తిచూపిన కాలమిది. ఒక సామాజిక సముదాయానికి వ్యతిరేకంగా పోలీసులు యుద్ధాన్ని ప్రారంభించిన రోజులివి. అంతేనా? చిన్న పిల్లలను సైతం చిత్ర హింసలకు గురి చేస్తున్న ఘోరాలు పెచ్చరిల్లిపోతున్న పాడు పాలన దాపురించింది కదా! అసత్యాల వ్యాప్తికి 'ఆధ్యాత్మిక గురువులు' నిర్నిరోధంగా దోహదం చేస్తున్న సమాజంలో 'సత్యమేవ జయతే' అన్న ధర్మసూత్రం వర్ధిల్లుతుందా? జ్ఞానాన్ని మధించి, విజ్ఞాన వివేకాలను విస్తరింపజేసే యువ ధీమంతులు, దేశ పాలకులపై తిరగబడాల్సిన అగత్యమెందుకు ఏర్పడింది? ఇటువంటి పరిస్థితులలో నూతన సంవత్సర శుభ వేళ మన నిర్ణయాలు వ్యక్తిగతమైనవిగా మాత్రమే ఎలా వుంటాయి? ఉండవు, ఉండకూడదు కూడా. సుప్రసిద్ధ స్త్రీవాద నినాదాన్ని విలోమీకరించి చెప్పాలంటే ఇప్పుడు రాజకీయమే వ్యక్తిగతం. జాతి జీవితం వక్రగతుల్లోకి వెళ్ళిపోతుండడం మన వ్యక్తిగత సమస్య కాదూ?

అవును, ఏడు దశాబ్దాల భారత గణతంత్ర రాజ్యం పెడదోవ పట్టింది. దాని ప్రస్తుత ప్రస్థానం మన చిరంతన, సమున్నత నాగరికతా విలువల స్ఫూర్తిని కాలరాచివేస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం–జాతీయ పౌర పట్టిక–జాతీయ జనాభా పట్టికపై వెల్లువెత్తుతోన్న నిరసనలు కేవలం ఒక వివక్షాపూరిత చట్టం లేదా రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం చేపట్టిన ఒక చర్యకు వ్యతిరేకంగా పిక్కటిల్లుతోన్న ప్రజాఘోష మాత్రమే కాదు. అసోంలో అన్ని మతాల ప్రజలూ తమ విలక్షణ అస్తిత్వాన్ని సంరక్షించుకునేందుకు, తమకు భరోసా కల్పించిన ఒక ఒడంబడిక ఉల్లంఘనకు గురికాకుండా ఉండేందుకు, విశాల భారతదేశంతో ఒక గౌరవపూర్వక సంబంధాన్ని భద్రపరచుకునేందుకై వీధుల్లోకి పోటెత్తడం కొనసాగుతోంది. ఆసేతు హిమాచలం ముస్లిం సహోదరులు ఒక అపూర్వ సామూహికోద్యమంలో భాగస్వాములవుతున్నారు. సమ పౌర సత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా కుదించివేయడంపై వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ సమ పౌరసత్వాన్ని చట్టబద్ధంగా తొలగించేందుకు చురుగ్గా జరుగుతోన్న ప్రయత్నాలను నిరోధించేందుకు వారు కృతనిశ్చయులయ్యారు. ఇక యువ భారతీయులు మతాలు, ప్రాంతాలకు అతీతంగా సమైక్యమవుతున్నారు. జాతి గత చరిత్రను సంకుచిత దృక్పథంతో చూస్తూ ప్రతీకార ధోరణులకు పాల్పడుతున్న వారికి ఈ దేశ వర్తమానమూ, భవిష్యత్తు బందీ కాకూడదనే సంకల్పంతో వారు ఉద్యమిస్తున్నారు. భారతదేశపు ఆత్మను సంరక్షించేందుకు ఒక మహోద్యమం సాగుతోన్న సందర్భమిది.

కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా అగ్నిపర్వతంలా బద్ధలవుతున్న ప్రజా నిరసనలను అణచివేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం సకల ప్రయత్నాలూ చేస్తోంది. శుద్ధ అబద్ధాలను గౌరవప్రదకరమైనవిగా చేస్తోంది. విద్వేషాలను ప్రేమపూరిత వ్యవహారాలుగా కన్పించేలా చేస్తోంది. పౌరుల ఆలోచనలను ప్రభావితం చేసేందుకు ప్రచార యంత్రాంగాన్ని ముమ్మరంగా వినియోగిస్తోంది. ప్రజల నిరసనలను తక్కువ చేసి చూపేందుకు, ప్రభుత్వ కథనాలకు విశేష వ్యాప్తి కల్పించేందుకు మీడియాను ఉపయోగించుకొంటోంది. అత్యవసర పరిస్థితి కాలంలో ఇందిరాగాంధీ ఇవే పద్ధతులను అనుసరించారు సుమా!

వార్తలు, వార్తా వ్యాఖ్యలు ప్రభుత్వానికి అనుకూలంగా వుండేలా చేసేందుకు మోదీ సర్కార్ క్రూరమైన దమన చర్యలకు పాల్పడుతోంది. పౌరసత్వ సవరణ చట్టం–జాతీయ పౌర పట్టికకు వ్యతిరేకంగా తీవ్రమవుతోన్న శాంతియుత, ప్రజాస్వామ్యయుత ఆందోళనలను బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రభావశీలంగా నిషేధించాయి. నిరసన ప్రదర్శనలకు అనుమతించినప్పుడు శాంతి భద్రతల పరిరక్షణ యంత్రాంగం వాటికి అవాంతరాలను కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. నిరసనకారులతో వ్యవహరించడంలో మితిమీరిన బల ప్రయోగం సాధారణమైపోయింది. పౌరసత్వ చట్ట వ్యతిరేక ఆందోళనలపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరును, హర్యానాలో జాట్‌ల, మహారాష్ట్రలో మరాఠాల నిరసనోద్యమాల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుతో పోల్చి చూడండి. బీజేపీ అగ్రనాయకుడు యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో భయం రాజ్యమేలుతోంది. పలు పట్టణాలలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ముస్లిం సమాజంపై వారు యుద్ధం చేస్తున్నారని చెప్పక తప్పదు.



> పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రజా నిరసనలను మతాల ప్రాతిపదికన దేశ ప్రజలలో చీలికలు తీసుకువచ్చేందుకు ఉపయోగించుకొనేందుకు దేశ పాలకులు ప్రయత్నిస్తున్నారు. దేశాన్ని సమైక్యంగా వుంచే బృహత్తర బాధ్యత ప్రజల పైనే వున్నది. ప్రజా నిరసనలు జాతీయ సమైక్యతకు దోహదం చేసే ఒక సరికొత్త అఖిల భారత ఉద్యమం 'భారత్ జోడో ఆందోళన్'గా పరిణమించి తీరాలి.

ప్రజాస్వామ్యం, వైవిధ్యం, అభివృద్ధి మొదలైనవి భారత్ భావన నిర్వచన ప్రాతిపదికలు. దేశ చరిత్రలోని ప్రస్తుత దశ ఆ సమున్నత సూత్రాలను సవాల్ చేస్తున్నది. భారతీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. బహుశా అది వ్యవస్థాగత సంక్షోభం కావచ్చు. తత్కారణంగానే మన ఆర్థికం అంతకంతకూ దిగజారిపోతున్నది. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్రమాంద్యంగా పరిణమిస్తోంది. నిరుద్యోగం పెరిగిపోతోంది. తీవ్ర దుస్థితి నుంచి వ్యవసాయ రంగానికి ఉపశమనం లభించ డమే లేదు. అన్నదాత ఆవేదన పాలకులకు పట్టడం లేదు. మోదీ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని రూపుమాపడం కాదు కదా అసలు సమస్యను అర్థం చేసుకున్నదా అన్నది కూడా సందేహాస్పదంగా వున్నది. కనుకనే కాబోలు ఈ సంక్షోభ తీవ్రత నుంచి దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు వారిలో జాతీయవాద భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు అవిచ్ఛిన్నంగా ప్రయత్నిస్తోంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి నిచ్చిన అధికరణ 370 రద్దు, అయోధ్య తీర్పు, పౌరసత్వ సవరణ చట్టం మొదలైనవి ఆ ప్రయత్నాలలో భాగమే.

ఈ చర్యల పర్యవసానాలు దేశ శ్రేయస్సుకు ప్రతికూలంగా దీర్ఘకాలిక ప్రభావాలను చూపనున్నాయి. అయితే మోదీ ప్రభుత్వానికి ప్రజాదరణను పెంపొందించడమనేది వాటి స్వల్పకాలిక లక్ష్యం. ఇందుకు ప్రజాస్వామిక హక్కులు, సంస్థాగత సాధనాలు అవరోధంగా వున్నాయి. వీటిని తొలగించుకునేందుకే ప్రజాస్వామ్య సంస్థలు, హక్కులు, పాలనా పద్ధతులను కాలరాచివేసే చర్యలను ముమ్మరంగా చేపట్టడం జరుగుతోంది. ఆ చర్యలకు వ్యతిరేకంగా జరుగుతోన్న పోరాటం ఫలితాలు ఎలా వుంటాయన్నది ప్రస్తుత దశలో చెప్పలేము. కాలంలోకి జారిపోయిన సంవత్సరం (2019)లో మన సమున్నత గణతంత్ర రాజ్యం సంకుచిత ధోరణుల్లోకి ముడుచుకుపోతున్న సూచనలు కన్పించాయి. ఆ తిరోగమనం నుంచి మన రిపబ్లిక్‌ను ప్రస్తుత ప్రజా ఉద్యమం కాపాడే అవకాశమున్నది. అయితే కొనసాగుతున్న ప్రజా నిరసనలను మతాల ప్రాతిపదికన దేశ ప్రజలలో చీలికలు తీసుకువచ్చేందుకు ఉపయోగించుకోవచ్చని మోదీ ప్రభుత్వం ఇంకా ఆశిస్తోంది. ఈ విషయంలో పాలకులు తమ ఆశలను ఇంకా వదులు కోలేదు. రాబోయే కొద్ది వారాలలో నిరసనోద్యమాలు ఎలా పర్యవసించనున్నాయనే దాన్ని బట్టి అంతా ఆధారపడివున్నది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. దేశప్రజలలో చీలికలు సృష్టించేందుకు పాలకులు కృతనిశ్చయంతో వున్నారు. దేశాన్ని సమైక్యంగా వుంచే బృహత్తర బాధ్యతను ప్రజలే చేపట్టాలి. ఈ వాస్తవం దృష్ట్యా కొత్త సంవత్సర నిర్ణయం ఇలా వుండాలని నేను ప్రతిపాదిస్తున్నాను : 'వో తోడేంగే, హమ్ జోడేంగే' (వారు విభజిస్తున్నారు, మనం ఏకమవుదాం).

పౌరసత్వ సవరణ చట్టం జాతీయ పౌర పట్టిక–జాతీయ జనాభా పట్టిక వ్యతిరేక నిరసనలు జాతీయ సమైక్యతకు దోహదం చేసే ఒక సరికొత్త అఖిల భారత ఉద్యమం భారత్ జోడో ఆందోళన్‌గా పరిణమించి తీరాలి. బీజేపీ ప్రభుత్వ విచ్ఛిన్నకర కుతంత్రాలకు వ్యతిరేకంగా ఈ నిరసనోద్యమాలు మరింతగా ముమ్మరమవ్వాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఈ నిరసనోద్యమాలతో పాటు మత సామరస్యాన్ని పెంపొందించే సానుకూల, నిర్మాణాత్మక చర్యలను కూడా మనం చేపట్టవలసి వున్నది. మూక హింసాకాండకు వ్యతిరేకంగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రతిఘటించడానికి నిరసనకారులు కచ్చితంగా గాంధేయ అహింసా పద్ధతులను అనుసరించి తీరాలి. ప్రజా నిరసనలు రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగమవ్వడాన్ని అరికట్టేందుకు ఉద్యమకారులు తమ ఉద్యమ రాజకీయేతర స్వభావాన్ని పరిరక్షించుకోవాలి. భారత్ సమైక్యత, సమగ్రతలకు జరిగిన నష్టాన్ని నివారించేందుకు ఉద్యమ ప్రతీకలుగా త్రివర్ణ పతాకం, భారత రాజ్యాంగం మాత్రమే ఉండాలి. జాతీయ సమైక్యతా సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళేందుకు జనవరిలో పలు సందర్భాలు ఉన్నాయి. అవి: జనవరి 3న మహిళా, బహుజన సంస్థలు నిర్వహించే సావిత్రీ బాయి పూలే జయంతి; జనవరి 12న జాతీయ యువజనోత్సవంగా పాటిస్తున్న వివేకానంద జయంతి; జనవరి 17న రోహిత్ వేముల వర్ధంతి; జనవరి 23న నేతాజీ సుభాస్ బోస్ జయంతి; జనవరి 26న గణతంత్ర దినోత్సవం, జనవరి 30న గాంధీజీ వర్ధంతి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతోన్న ఉద్యమం ఇప్పటికే పలు సృజనాత్మక జాతీయ ఐక్యతా వ్యక్తీకరణలను చూసింది. యథాప్రకారం జరిగే నిరసన ప్రదర్శనలు ఒక స్థాయి, దశను దాటి కార్యసాధక ఫలితాలను సాధించలేవు. ఈ వాస్తవం దృష్ట్యా మన నిరసనలు వినూత్న రీతుల్లో జరగాల్సిన అవసరమున్నది.

(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)



నాల్గుపడగల 'పౌరలోకం'

సర్పం అండాన్ని, పిండాన్ని
మింగి విషనాగులను ప్రసవించినట్టు
ఒక్కోసారి 'ప్రజా'సమ్మతి వికటించి
కోరలుచాచి వికటాట్టహాసం చేస్తుంది
మనిషికి వర్ణాన్ని, వివక్షను అద్దిన వ్యవస్థే
అల్పసంఖ్యాకుల రాజపత్రాన్ని సృష్టిస్తుంది
'ఈశాన్యం' విరుచుకుపడితే
లాఠీల కాఠిన్య నృత్యాన్ని కళ్ళకు కడుతుంది
జామియామిల్లియా విద్యార్థి ఎముక విరిగి
రక్తం మరుగుతూవుంటుంది
'విశ్వ' విద్యార్థిలోకం సరి'హద్దులు' దాటి
హక్కుల గొంతును రక్షణ కోసం నినదిస్తుంది
ప్రపంచకోర్టు 'పంచాయితీ'లో
యథావిధిగానే 'శాంతిభద్రతల'
సోకు సాక్ష్యమిస్తుంది

మన 'స్మృతి' గీతం జన్మనిచ్చిన సంస్కృతి నుంచి
పుట్టుకొచ్చిన క'షా'య్ బంధం
అక్కడ ని'షా'దంగా జనస్వామ్యం
పుర్రె మీద మోదుతుంది
స్వయంసేవ త్రిశూలాసనమై తొడగొడుతుంది
ఒక్క తుపాకీ తూటా కూడా వాడకుండా
'370'ని 3+7+0 = 10 అంటే మొత్తం 1 చేశామని
శపథం చేస్తుంది
అప్పుడు నీ చుట్టూ నువ్వు అష్టాంగమార్గాన్ని
సృష్టించుకొని..
పదకొండవ అవతారాన్ని ప్రార్థిస్తూ..
'తామర' తెంపరల మధ్య తనువు చాలించాలి
అప్పుడే వారు ఆశించిన మతం పేరుతో
'పౌరుని మరణం రిజిస్టర్' అవుతుంది.

– డాక్టర్ జికెడి ప్రసాద్

ధ్వంసమవుతున్న కల

సరిగ్గా అయిదు సంవత్సరాలక్రితం ఆ ప్రాంతమంతా ఒక సంతోషం, ఒక ఉద్వేగం, ఒక కోలాహలం, ఒక ఉత్సాహం ఏదో జరగబోతోందని, విభజన వల్ల నష్టపోయి కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రానికి రాజధాని ప్రకటితమైందని తెలుసుకున్న రైతులలో ఒక ఉద్విగ్న పరిస్థితి. రాజధాని ప్రాంతంగా ప్రకటించిన 29 గ్రామాలలో ఆరేడు గ్రామాలు తప్ప మిగిలిన గ్రామాలన్నింటా, వ్యవసాయం లాటరీ అయిన పరిస్థితి. వర్షాధార వ్యవసాయం. అతివృష్టులు, అనావృష్టులు, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు, గిట్టుబాటుధర ఇవ్వలేని ప్రభుత్వాలు... సంవత్సరాల తరబడి ఇదే ఇదే పునరావృతం. ఈ నేపథ్యంలో వచ్చిన ఈ ప్రకటన ఇక్కడి రైతుల్లో ఆనందోత్సాహాల్ని నింపింది. వీరికి ఈ ప్రకటన వెనుకవున్న రాజకీయ కారణాలు తెలియవు; మద్రాస్ నుండి చెంబు తపేల సర్దుకొని వచ్చి కర్నూలు గుడారాలలో పాలన సాగించటం, అక్కడి నుండి హైదరాబాద్‌కు వలసపోవడం, అక్కడ నుండి తరిమేస్తే రాజధాని లేని అనాథ రాష్ట్రంగా మిగిలిపోవడం ఇలాంటివేవీ వాళ్లకు తెలియదు. కేవలం తమ మెడకు గుదిబండలా తయారైన వ్యవసాయం చెయ్యలేకపోవడం, ఈ ప్రాంతం రాజధానిగా అభివృద్ధి



చెందితే తమ వారసులకే కాక, ఇక్కడికి వచ్చి స్థిరపడేవారికి కూడా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, తమబిడ్డల భవిష్యత్తు బాగుంటుందని ఆశ. అందుకే నాయకులకు అధికారులకు మేళతాళాలతో స్వాగతం పలికి మరీ తమ భూముల్ని రాజధానికి అప్పగించారు. సరిగ్గా అయిదు సంవత్సరాల తరువాత ఇప్పుడిక్కడ ఏంజరుగుతోంది? ఒక నిరాశ, ఒక నిస్పృహ, ఒక ఆవేదన, ఒక ఆక్రోశం. దుఃఖంతో రోడ్డెక్కిన రైతులు. "ఎక్కడో మూడొందల మైళ్ల దూరాన ఉండాల్సిన రాజధాని, ఇప్పుడు నా నట్టింట్లోకి నడిచొచ్చింది, ఇప్పటిదాకా పొట్టచేత బట్టుకున్న ఊళ్లు, రాజధాని బాటపట్టాయి. ఇప్పుడు దస్త్రాలు చుట్టేసుకున్న రాజధాని, నా గుమ్మంలో అడుగుపెట్టింది, ఎవరు కోడి పందాలతో పణంగా పెట్టారో, ఎవరు పొమ్మన్నారో, ఎవరు రమ్మన్నారో, నా ఊరికేం తెలుసు. రాజధాని ఇప్పుడు నాపంచన చేరడానికి ఉబలాటపడుతోంది" – అని అప్పట్లో రాసుకున్నాను. మరి ఇప్పటి ఈ ఆందోళనకు కారణమెవరు? రైతుల్ని రోడ్డు మీదకు ఈడ్చి పరాచికాలతో పరిహాసం చేస్తున్నదెవరు? ఎవరి రాజకీయ కక్షలకు రైతులు బలిపీఠంమీద తమ తలలు పెట్టారు. బతకలేకనే అయినా తమ బతుకు తాము వెళ్లమారుస్తున్న రైతులను ఊహల సౌధంలోకి ఎక్కించి తటాలున అక్కడి నుండి ఎడమకాలితో తన్నేసిన మహారాజకీయులు ఎవరు? ఇవాళ అమరావతిని రావణకాష్ఠంలా రగిల్చి చలికాసుకోవాలని ప్రయత్నిస్తున్నదెవరు?

అప్పట్లోనే రాజధానికి ఇన్నివేల ఎకరాలు అవసరమా? ఇంత ఖర్చు అవసరమా అని మాట్లాడినవారున్నారు. దానికి సమాధానంగా ఇప్పటికే మహానగరాలుగా విలసిల్లుతున్న ఢిల్లీ, ముంబయి, కలకత్తా, హైదరాబాద్ లాంటి నగరాలలోని ప్రజల అవస్థలు ముఖ్యంగా వాహనరద్దీ, వర్షంపడినపుడు మునిగిపోతున్న రోడ్లు, ఇళ్లు ఉదాహరణలుగా చూపి కనీసం ఒక 50 సంవత్సరాల వరకైనా పెరుగబోయే జనాభాను దృష్టిలో వుంచుకొని ఎటువంటి ఇబ్బందులు కలగని ఒక సుందర నగరాన్ని అప్పటి పాలకులు కళ్లముందుకు తెచ్చారు. నిజమే కదా అనుకున్నాం. నిజానికి పొలాలు ఇళ్లుగా, పట్టణాలుగా, నగరాలుగా మారడం కొత్త విషయమేమీ కాదు. ఏ నగరమైనా, పట్టణమైనా, కనీసం పల్లె అయినా– మనం చిన్నప్పుడు చూసినప్పుడు ఎలా వుందో అలా లేదన్నది ఒక నగ్న సత్యం. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లుగా పట్టణీకరణ చెందటం సర్వసాధారణ విషయం. ఇటువంటప్పుడు పర్యావరణమనో, మరొకటనో వచ్చిన సాధారణ అడ్డంకుల్ని అధిగమించి అమరావతికి పునాదులు పడ్డాయి. అప్పటి ప్రతిపక్షనేత, ఇప్పటి ముఖ్యమంత్రి కూడా అమరావతికి సంపూర్ణంగా స్వాగతం పలికాడు. అందువల్లనే భూసమీకరణ విషయంలో పెద్దగా అడ్డంకులు ఏర్పడలేదు. కొన్ని ప్రాంతాలలో భూసమీకరణను వ్యతిరేకించినప్పుడు ప్రభుత్వం భూసేకరణ ద్వారా బలవంతంగా భూములు స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించింది. కాని కొందరు నాయకుల సూచనల మేరకు దానిని నిలుపుదల చేసింది. కాగా రాజధాని ప్రాంతమున్న రెండు నియోజకవర్గాలలోనూ ఇప్పటి పాలక పక్ష శాసనసభ్యులే గెలిచారు. ఈ నేపథ్యంలో రాజధానిని ఇక్కడి నుండి మార్చాల్సిన అగత్యం ఏమి ఏర్పడింది? దీనికి ప్రభుత్వం చెబుతున్న కారణాలేవీ సరైనవికాదని ఏమాత్రం చదువుకున్నవాడైనా సమాధానం చెబుతాడు. వీళ్ల చూపిస్తున్న కారణాలలో మొదటిది– అంత విశాలమైన నగరం నిర్మించడానికి తగినంత ఆర్థిక వనరులు లేవు, లక్షకోట్లకు పైగా ఖర్చు చేయాల్సిన చోట ఇప్పటికి ఐదువేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. ఈవిధంగా చేస్తూపోతే ఇది ఎప్పటికీ పూర్తి కాదు– అన్నది. దీనికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కూడా దేశాన్ని అభివృద్ధి పథంలో నడపడం కోసం పంచవర్షప్రణాళికలతో ముందడుగువేశారు. దూరదృష్టి వున్న ఎవరైనా నగరం మొత్తం ఒకేసారి నిర్మితం కాదనీ, వంతులవారీగా అభివృద్ధి చేసుకుంటూ వెళ్లొచ్చు అని, ఈవాదనను కొట్టి పారేస్తారు. రెండవకారణం అభివృద్ధి కేంద్రీకృతం కావడం. గతంలో అభివృద్ధి హైదరాబాద్ నగరంలో కేంద్రీకృతం కావడం వలన జరిగిన నష్టాన్ని గత ప్రభుత్వం ఆంధ్ర ప్రాంత ప్రజలు ప్రత్యక్షంగా చూసారు. గత పాలకులు దీన్ని దృష్టిలో పెట్టుకొనే అభివృద్ధి వికేంద్రీకరణకు అవసరమైన నిర్ణయాలు తీసుకొని అందుకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంతకు మించిన కారణాలను ప్రస్తుత పాలకవర్గం ప్రజలముందు పెట్టలేకపోతోంది. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపుచర్య గానూ, దురుద్దేశ పూరితంగా ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే చర్యగానూ మాత్రమే కనబడుతుంది.

> గట్లు కందకాలు వాగులు డొంకలు అన్నీ ఏకమయ్యాక, పొలాల మధ్య కొత్తగీతలు, సరిహద్దు రాళ్లు పరుచుకున్నాక ఎవరి పొలాన్ని ఎవరికి అప్పగిస్తారు? 2015కు పూర్వంలాగా ఆ భూమి వ్యవసాయపరంగా మార్చడానికి వీలవుతుందా? ఈ ప్రాథమిక ప్రశ్నలకైనా పాలక వర్గాల నుంచి సమాధానం దొరుకుతుందా? మూడు రాజధానుల ప్రకటన ఏ ప్రాంతం వారికీ సంతోషాన్ని కలిగించలేదనే వాస్తవాన్ని రాష్ట్ర పాలకులు గ్రహించి తమ ఆలోచనలను విరమించుకోవాలి.

అమరావతి రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన అభివృద్ధి హామీలను ఎలా నెరవేరుస్తారు అనేది అంతు చిక్కని ప్రశ్న. రైతులకు – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మధ్య మాత్రమే భూసమీకరణ ఒప్పందం జరిగింది కాని అప్పటి ముఖ్యమంత్రికి, లేదా మంత్రులకు – రైతులకు మధ్య జరిగిన ఒప్పందం కాదనేది అందరికి తెలిసిన సత్యం. ఈ నేపథ్యంలో అమరావతి రైతులకు ఏవిధమైన పరిష్కారం ఈ ప్రభుత్వం ఇస్తుందో అర్థం కాదు. ఎన్నికలకు ముందు కూడా రాజధాని అమరావతి నుండి మారదు అని నమ్మించడం కోసం అప్పటివరకు హైదరాబాదులో నివాసమున్న ఇప్పటి ముఖ్యమంత్రి అమరావతి ప్రాంతానికి తన నివాసాన్ని మార్చుకున్నారు. ఇప్పుడు రాజధానిని మార్చాలనుకోవడం పూర్తిగా నమ్మకద్రోహమే అవుతుంది.

కొంతమంది మంత్రులు రైతులకు తిరిగి భూములు అప్పగిస్తామని ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు మూడు వేల కిలోమీటర్లు పైగా రహదారులు అనేక భవనాలు నిర్మించిన తరువాత, ప్లాట్లు విభజన జరిగి ఆయా ప్లాట్లు కూడా కొంత మంది అమ్ముకున్న తరువాత ఇది ఎలా సాధ్యమవుతుందనే కనీసపు ఆలోచన కూడా లేకుండా ఈమంత్రులు ఎలా మాట్లాడుతున్నారో అర్థంకాని విషయం. పైగా గట్లు, కందకాలు, వాగులు, డొంకలు అన్నీ ఏకమయ్యాక పొలాలమధ్య కొత్త గీతలు, సరిహద్దు రాళ్లు పరుచుకున్నాక ఎవరి పొలాన్ని ఎవరికి అప్పగిస్తారు. 2015కు పూర్వంలాగా ఆ భూమి వ్యవసాయపరంగా మార్చడానికి వీలవుతుందా? ఈ ప్రాథమిక ప్రశ్నలకైనా పాలకవర్గాల నుంచి సమాధానం దొరుకుతుందా? రైతుల్ని కడుపుకోతకు గురిచేసిన ఏ పాలకవర్గాలైనా మట్టిలో కలిసిపోవాల్సిందే. మూడు రాజధానుల ప్రకటన ఏ ప్రాంతం వారికి సంతోషాన్ని కలిగించలేదనే వాస్తవాన్ని ఈనాటి పాలకవర్గం గ్రహించి తమ ఆలోచనలను విరమించుకోవాలని ఆశిస్తున్నాను.

■ బండ్ల మాధవరావు
రాజధాని ప్రాంత కవి

(జనవరి 1, 2015న తుళ్లూరులో అప్పటి ముఖ్యమంత్రి సమక్షంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నప్పటి జ్ఞాపకాల నేపథ్యంలో)

శ్రీశక్తి



ఫొటో: సింహాచారి



చదువు... అది అయిపోగానే ఉద్యోగం... ఈ రొటీన్ జీవితం కాదు ఆమె కోరుకుంది! తన కాళ్లపై తాను నిలబడి... నలుగురికి ఉపాధి కల్పించాలనే సంకల్పం. అన్నింటికి మించి గిరిజన యువతులూ స్వయంశక్తితో ఎదగ గలరని నిరూపించాలన్న తాపత్రయం. అదే గౌతమి కుర్సమ్‌ను అభిరుచి వైపు అడుగులు వేయించింది. ఓ బ్రాండెడ్ పిజ్జా అవుట్‌లెట్‌కు యజమానిని చేసింది. అమ్మానాన్నలు అండగా... ఆత్మవిశ్వాసం తోడుగా నచ్చిన రంగంలో ఇష్టపడి కష్టపడుతున్న గౌతమి అంతరంగం ఇది...

కలల అభిరుచి!

"నాన్న ప్రభుత్వ డాక్టర్. అమ్మ ఉపాధ్యాయురాలు. అన్నయ్య కూడా మెడిసిన్ చదివి నాన్న బాటలోనే నడుస్తున్నాడు. కానీ నాకెందుకో వాటి వైపు మనసు మళ్లలేదు. డాక్టర్ని కావాలనీ, 'టెన్ టు ఫైవ్' ఉద్యోగం చేయాలనీ అనిపించలేదు. ఏదైనా సరే... సొంతంగా, నాకంటూ ఒక గుర్తింపు ఉండే పని చేయాలనుకున్నా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం భైరాగులపాడు మాది. గిరిజన కుటుంబం. మా నాన్న డాక్టర్ కె.వెంకటరమణ ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. దీంతో నేనూ విద్యాలయాలు మారాల్సి వచ్చింది. అమ్మ ప్రభుత్వ టీచర్ కావడంతో ఇంట్లో ఎప్పుడూ చదువుకు ప్రాధాన్యం ఉండేది. పాత ఖమ్మం జిల్లా చర్లలో టెన్త్ అయిపోగానే గుంటూరులో ఇంటర్ చదివాను. అమ్మానాన్నలు నన్ను కూడా డాక్టర్‌గా చూడాలనుకున్నారు. అయితే పారిశ్రామికవేత్త కావాలన్నది నా కల. నా అభిరుచి తెలుసుకుని నాన్న నన్ను ఫుడ్ ప్రాసెసింగ్ వైపు దృష్టిపెట్టమన్నారు. అలా బాపట్లలోని 'కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ'లో చదివా. తరువాత జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్సెస్‌లో బీటెక్, పంజాబ్‌లోని సంత్ డొంగోవాల్ ఇనిస్టిట్యూట్‌లో పీజీ పూర్తి చేశాను.

అనుభవం కోసం ఉద్యోగం...

ఏదైనా పరిశ్రమ పెట్టాలంటే సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి కదా! అందుకే పీజీ అయ్యాక బెంగళూరులోని 'క్వాలిటీ వాల్స్'లో రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. అదే సమయంలో నాకు పెళ్లయింది. దీంతో కొన్నాళ్లు ఉద్యోగానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. అలాగనీ నా లక్ష్యాన్ని పక్కన పెట్టలేదు. దానికితోడు బీటెక్ చదివే రోజుల్లో సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగింది. గిరిజనులంటే కాస్త చిన్న చూపు చూస్తున్నట్టు అనిపించేది. దానికి బాధపడినా... విద్య, విజ్ఞానంతో దేన్నయినా జయించవచ్చని అమ్మానాన్నలు చెప్పేవారు. ఆత్మనూన్యతకు లోనైనప్పుడు భుజం తట్టి ప్రోత్సహించేవారు. అది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. స్వయంకృషితో ఉన్నత స్థానాన్ని అందుకోవాలని, తద్వారా గిరిజనులు కూడా గొప్ప పారిశ్రామికవేత్తలు కాగలరని నిరూపించాలనే పట్టుదలను మరింత పెంచింది.

అప్పుడే ఆ ఆలోచన...

సొంతగా బిజినెస్ ప్రారంభించాలన్న కోరికైతే ఉంది కానీ... ఏంచేస్తే బావుంటుంది? ఎంత ఆలోచించినా స్పష్టత రాలేదు. మా ఆయన ఉద్యోగరీత్యా అప్పుడు మేము పటాన్‌చెరులో ఉంటున్నాం. ఎప్పుడైనా ఇష్టమైంది తినాలంటే నగరానికి రావాల్సి వచ్చేది. అక్కడున్న చిన్న చిన్న హోటళ్లలో ఏం తినాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి. ఆ సమయంలోనే ఫుడ్ కోర్ట్ పెడితే ఎలా ఉంటుంది? అదికూడా బ్రాండెడ్ అయితే కస్టమర్లు నమ్మకంగా వస్తారు. పైగా పిజ్జా సెంటర్ అయితే ప్రస్తుత ట్రెండ్‌కు సరిగ్గా సరిపోతుందనిపించి, దానికే ఫిక్సయిపోయాను.

రెండేళ్లు బ్రేక్...

ఏ వ్యాపారం అన్నదానిపై స్పష్టత వచ్చేసింది. కానీ పెట్టుబడి! అంత పెట్టే ఆర్థిక పరిస్థితి మాకు లేదు. దీంతో స్నేహితులను ఇందులో భాగం చేయాలనుకున్నా. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ లోగా పాప పుట్టింది. తన ఆలనా పాలనతో రెండేళ్లు వేరే పని ముట్టుకోలేకపోయాను. ఆ తరువాత తెలిసింది... గిరిజన యువతకు 'సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్' (సీఎంఎస్టీఈఐ) కింద ప్రభుత్వం చేయూతనిస్తుందని! సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకొనే గిరిజన ఔత్సాహికులకు దీని ద్వారా శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారని. రాత పరీక్ష, ఇంటర్వ్యూల తరువాత దానికి ఎంపికయ్యాను. వ్యాపార మెలకువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) నిపుణులు శిక్షణనిచ్చారు. మార్కెట్‌ను ఎలా అంచనా వేయాలో అక్కడే నేర్చుకున్నా.



గిరిజన యువతకు 'సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్' (సీఎంఎస్టీఈఐ) కింద ప్రభుత్వం శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుంది. అందులో శిక్షణ పూర్తి చేసుకుని, ఇటీవల హైదరాబాద్‌లో 'ఛీజియానో పిజ్జా' అవుట్‌లెట్ ఏర్పాటు చేశా. శిక్షణ సమయంలో హామీ ఇచ్చినట్టుగానే కేటీఆర్ వచ్చి ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఐఎస్‌బీ సహాయంతో ఈ ఫ్రాంచైజీ నాకు దక్కింది.

కేటీఆర్ ఫిదా...


గత నెలలో సీఎంఎస్టీఈఐ శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఐఎస్‌బీ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశానికి తెలంగాణ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మా బ్యాచ్‌లో కొంతమందికి ఆయన ముందు మాట్లాడే అవకాశం ఇచ్చారు. అందులో నేనూ ఒకదాన్ని! నేను పారిశ్రామికవేత్తను ఎందుకు కావాలనుకొంటున్నానో చెప్పే ప్రయత్నం చేశాను. ఎంతో ఆత్మవిశ్వాసంతో నేను వివరించిన పద్ధతి, అనర్గళంగా మాట్లాడే తీరును కేటీఆర్ ప్రశంసించారు. అభినందనలు తెలిపారు. నేను ఏ వ్యాపారం చేయాలనుకొంటున్నానో అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవానికి తప్పకుండా వస్తానన్నారు. నాకు పట్టరాని ఆనందం కలిగింది. నేను చేయగలనన్న ధైర్యమూ వచ్చింది.

అదే పెద్ద సవాలు...

అనుకున్నట్టుగానే అన్నీ సమకూరాయి. శిక్షణ పూర్తయిన వారం రోజుల్లో, అంటే డిసెంబర్ మొదటి వారంలోనే హైదరాబాద్‌లో 'ఛీజియానో పిజ్జా' అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేశాను. హామీ ఇచ్చినట్టుగానే కేటీఆర్ వచ్చి ప్రారంభించారు. అయితే అంతర్జాతీయ స్థాయి బ్రాండెడ్ సంస్థల ఫ్రాంచైజీలు దక్కించుకోవడం నాలాంటి కొత్తవారికి సాధ్యం కాదు. ఐఎస్‌బీ సహాయంతో ఈ ఫ్రాంచైజీ నాకు దక్కింది. ఇక్కడితో సొంత వ్యాపారం ప్రారంభించాలన్న నా కల నెరవేరింది. కానీ అసలు సవాల్ ఎదురైంది. అదే మార్కెటింగ్! ఇప్పటికే ఉన్న బడా కంపెనీలతో పోటీపడి నిలబడటమంటే పెద్ద సవాలే! లాభాల మాట అటుంచితే, ముందు నష్టాలు రాకుండా చూసుకోవడంపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది. నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తేనే ఇక్కడ నిలబడగలం. ఫ్రాంచైజీ ఒప్పందం మొదలు అవుట్‌లెట్ ఏర్పాటు వరకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. కానీ వాటి నుంచి తప్పుకొనే ప్రయత్నం చేయలేదు. ఇంకా చెప్పాలంటే వాటిని ఎదుర్కోవడం వల్లే నాకు మరింత అనుభవం వచ్చింది. ఇకముందు కూడా ఇదే ఉత్సాహంతో అవుట్‌లెట్‌ను నడిపించగలనన్న ఆత్మవిశ్వాసం కలిగింది. విజయవంతమైన పారిశ్రామికవేత్త కావాలన్న నా లక్ష్యాన్ని నిజం చేసుకొనే క్రమంలో ఇవేవీ నాకు అడ్డుకాదు."

• శ్యామసుందర్ ఆకుల

తిరుప్పావై



సౌభాగ్యదాయినీ! తలుపు తెరువమ్మా!


పద్ధెనిమిదో పాశురం

ఉన్దు మదకళిత్తన్ ఓడాద తోళ్ వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్;
వన్దెంగుమ్ కోళి అళైత్తనగాణ్; మాదవి
ప్పన్దల్ మేల్ పల్కాల్ కుయిల్ ఇనంగళ్ కూవినగాణ్;
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్ పాడ
శెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొళిప్ప
వన్దు తిరవాయ్ మగిళ్న్దు ఏల్ ఓర్ ఎంబావాయ్!

భావం: నీలాదేవి ఇంట శ్రీకృష్ణుడు ఉన్నాడని తెలిసి, గోపికలు అక్కడకు చేరారు. నీలాదేవి శ్రీకృష్ణుడికి అత్యంత ప్రియురాలు. ఆమెను ద్రావిడ భాషలో 'నప్పిన్న' అని పిలుస్తారు. కృష్ణుడికి రుక్మిణి, రాధాదేవి ఎంత ప్రీతిపాత్రులో నపికసన్న అంత ప్రీతిపాత్రురాలు. శ్రీకృష్ణుడి అష్టభార్యలలో ఆమె పేరు 'నాగ్నజితి' అని భాగవతంలో ఉంది. గోపికలు ఆ నప్పిన్నను కీర్తిస్తున్నారు. "మదజలం స్రవించే ఏనుగు వంటి బలం కలిగినవాడు, మహా భుజబలశాలి అయిన నందునికి ప్రియమైన కోడలా! నీలాదేవీ! పరిమళాలు ఎల్లెడలా వ్యాపింపజేసే కేశపాశాలు కలిగినదానా ! తలుపు తీయవమ్మా!" అని ప్రార్థిస్తున్నారు. ఆమె లేపితే కాని కృష్ణుడు కళ్ళు తెరవడు. ఈ సందర్భంలో తెల్లవారిందని తెలిపే గురుతులను గోపికలు ఏకరవు పెడుతున్నారు. ఇంటిలోని కోళ్ళు అన్ని దిక్కుల్లో తిరుగాడుతున్నాయి. కోళ్ళు అరిస్తే తెల్లవారినట్టు! వాటిని ఇక్కడ జ్ఞానులతో పోలిక చేసి చెబుతోంది గోదాదావి. మాధవీ పందిరి రెమ్మల్లో కోకిలలు కూస్తున్నాయి. నప్పిన్న చేతిలో పూల బంతి ఉంది. స్వామితో బంతులాట సలిపి, అలసి, స్వామి పక్కన ఆమె నిదురిస్తున్నది. ఎర్ర తామరల వంటి చేతుల గాజులు ఆ క్రీడలో గలగలలాడుతూండగా, ప్రేమతో, ఉత్సాహంతో వచ్చి తెలుపు తెరవాలని సౌందర్య సౌభాగ్యదాయిని అయిన నీలా దేవిని గోపికలు వేడుకుంటున్నారు.

• ఎ. సీతారామారావు


ముత్యాల ముగ్గు



22 చుక్కలు
5 వరుసలు
2 చుక్కలు వచ్చే వరకు
సరిచుక్క



ఎన్. తిరుమలేశ్వరి
కనిమెట్ట, వనపర్తి



15 చుక్కలు
8 వరకు
సందు చుక్కలు



పి. సాయిదీప్తి
తిరుపతి

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.
మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

వినూత్నం



ఫ్యాషన్ ప్రియుల కోసం రకరకాల దుస్తులను డిజైన్ చేసే కంపెనీలు మార్కెట్లో చాలా ఉంటాయి. కానీ చక్రాల కుర్చీకి పరిమితమైన దివ్యాంగుల కోసం దుస్తులు రూపొందించే కంపెనీలు చాలా అరుదు. కొన్ని బొటిక్స్ దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా దుస్తులు తయారుచేస్తూ 'అడాప్టివ్ ఫ్యాషన్' అవసరాన్ని చాటుతున్నాయి. ఆ విశేషాలివి...

ఈ దుస్తులు 'ప్రత్యేకం'!

ఫ్యాషన్ దుస్తుల్లో మెరిసిపోవాలనుకునే దివ్యాంగుల కలను ముంబయ్‌లోని 'ఓరోఫిట్', చెన్నైలోని 'సువస్త్ర డిజైన్స్', కొట్టాయంలోని 'మూవ్ ఎబిలిటీ' బొటిక్స్ నిజం చేస్తున్నాయి. వీల్‌ఛెయిర్ ఫ్రెండ్లీ శారీస్, జిప్ ఫ్రీ డ్రెస్సెస్, అయస్కాంత శక్తి ఉన్న బటన్స్‌తో చేసే దుస్తులను డిజైన్ చేయడం వీటి ప్రత్యేకత. తమ కుటుంబసభ్యుల కోసం కొందరు డిజైనర్లు రూపొందించిన దుస్తులను చూసి, చాలామంది తమ పిల్లలకు అలాంటివి కావాలని కోరడంతో ఈ బొటిక్స్ పుట్టుకొచ్చాయి.

భర్త కోసం తొలి డిజైన్!

వీల్‌ఛెయిర్‌కు పరిమితమైన తన భర్త సౌకర్యం కోసం చెన్నైకి చెందిన శాలిని విశాఖన్ నడుము దగ్గర ఎలాస్టిక్ బ్యాండ్‌తో ఉండే ప్యాంట్ తయారు చేశారు. అదే ఆమె మొదటి 'ఆడాప్టివ్ ఫ్యాషన్' డిజైన్. దివ్యాంగురాలైన స్నేహితురాలి తల్లికోసం వన్ పీస్, స్లిప్ ఆన్ సారీ డిజైన్ చేసి ఇచ్చారు. 'వన్ స్లిప్ సారీ డ్రెస్ మాదిరిగా ఉంటుంది. వీల్ ఛెయిర్‌లో సౌకర్యంగా ఉంటుంది" అని చెబుతారు శాలిని. ఇవే కాదు లెహంగాలు, షేర్వానీ కుర్తాలు కూడా డిజైన్ చేస్తారావిడ. " గుండీలు, లేస్‌ల కింద ఆల్టరింగ్ కుట్టు వచ్చేలా చూస్తా. వీల్ ఛెయిర్ ఉపయోగించేవాళ్లు, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ఆడాప్టివ్ ఫ్యాషన్ ద్వారా నావంతు తోడ్పాటు అందిస్తున్నా" అంటుందీ ఫ్యాషన్ డిజైనర్.

కొట్టాయంలోని 'మూవ్ ఎబిలిటీ' బొటిక్‌లో కాళ్లు లేదా చేతులు చచ్చుబడిన వాళ్ల కోసం దుస్తులు ఉంటాయి. 'నిఫ్ట్'లో చదివిన జో ఇకరేత్, మూవ్‌మెంట్ థెరపిస్ట్ అయిన తన భార్య మురిఎల్లాతో కలిసి ఈ బొటిక్‌ను ప్రారంభించారు. పక్షవాతంతో చక్రాల కుర్చీలోనే ఉండేవాళ్ల కోసం పూల ప్రింట్లు, ఆర్ట్‌వర్క్‌తో కూడిన దుస్తులు రూపొందిస్తున్నారు ఇకరేత్. "ఈ రకమైన డ్రెస్సుల తయారీకి 15ఏళ్ల నా కూతురు తిలోత్తమ మాకు ఇన్‌స్పిరేషన్. తనకు శారీరకంగా కొన్ని సమస్యలతో పాటు ఒక చేతికి పక్షవాతం వచ్చింది. తనలా



బాధపడుతున్న వారికి డైలీవేర్‌గా, ఫ్యాషనబుల్‌గా ఉండే దుస్తులు అందించాలనే ఆలోచన లోంచి 'మూవ్ ఎబిలిటీ' పుట్టింది" అని చెబుతారు ఇకరేత్.

ముంబయ్‌లో మగవాళ్ల బ్రాండెడ్ దుస్తులకు కేరాఫ్ అడ్రస్ అయిన 'ఓరోఫిట్' తమ డిజైనర్లతో 'అడాప్టివ్ ఫార్మల్‌వేర్'ను సిద్ధం చేయిస్తోంది. వన్ హ్యాండ్ జిప్పర్, బటన్స్ భుజాల వద్ద ఉండే షర్ట్స్, జిప్పులు ఉండే చెప్పులు, షూ ఇక్కడ దొరకుతాయి. "నాకు ఒక చేతికి పక్షవాతం సోకింది. దాంతో షర్ట్స్ వేసుకోవడం కష్టంగా ఉండేది. అయితే డిజైనర్లు నా కోసం అనువైన షర్ట్స్ తయారుచేశారు. మొదట్లో వాటిని వేసుకునేందుకు గంటపైగా పట్టేది. ఇప్పుడు అరగంటలోనే నేను డ్రెస్సు వేసుకోగలుగుతున్నా" అని చెబుతారు 52 ఏళ్ల రష్మికాంత్ షాహ్. మొత్తానికి వీరు రూపొందిస్తున్న ఈ సౌకర్యవంతమైన దుస్తులు దివ్యాంగులకు ఆత్మస్థయిర్యంతో పాటు ఆనందాన్నిస్తున్నాయి.


మార్గం ఉందా?

మా అమ్మాయికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరూ సమ హోదాలో ఉన్నవారే. చిన్న చిన్న సమస్యలతో రెండేళ్ల క్రితం విడిపోయారు. పిల్లలు లేరు. ఎంత చెప్పినా వినడం లేదు. కౌన్సెలింగ్‌కు వెళ్లమంటే వద్దంటున్నారు. వీళ్లని కలిపే మార్గం ఉందా?

- లక్ష్మి

చదువు మన ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలి. ఎదుటివారిని అర్థం చేసుకునే తత్వం పెరగాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే భావన రావాలి. అప్పుడే ఆ చదువు సార్థకం అయినట్లు. దురదృష్టవశాత్తూ మీ అమ్మాయి, అల్లుడు ఈ విషయం పట్టించుకున్నట్టు లేరు. ఒకరినొకరు మరింతగా అర్థం చేసుకుని సహకరించుకోవాల్సింది పోయి లేని పోని ఇగోలతో చికాకులు కొని తెచ్చుకుంటున్నారు. విడిపోయి రెండేళ్లయ్యిందని అంటున్నారు. కాబట్టి విడాకులకు వెళ్లడమే మేలు. పిల్లలు లేరు కాబట్టి పెద్దగా ఇబ్బంది లేదు. అయినా ఇప్పటికీ మీరు వాళ్లిద్దరూ కలవాలనే కోరుకుంటున్నారు కాబట్టి చివరి ప్రయత్నంగా ఇద్దరితో విడిగా మాట్లాడి అపోహలు తొలగించే ప్రయత్నం

ఫ్యామిలీ కౌన్సెలింగ్



చేయండి. వైవాహిక జీవితంలో సర్దుబాటు అనేది ఎంత ముఖ్యమో వివరించండి. ఇందుకు మీ అల్లుడి తల్లిదండ్రుల సహకారమూ తీసుకోండి. ఇంతమంది పెద్దల ఆకాంక్ష ఆ ఇద్దరినీ కలుపుతుందనే ఆశిద్దాం.

• **కె.శోభ,**
ఫ్యామిలీ కౌన్సిలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

లిటిల్ఫ్

ప్రతిభ



కళ్లజోడుతో వెలుగులోకి...

పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఇందుకు పదమూడేళ్ల ప్రియభారత సాహూ మంచి ఉదాహరణ. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ కుర్రాడు దృష్టి, వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం కళ్లద్దాలు రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అంధులు, కంటి చూపు సరిగాలేని వారు సింపుల్ స్టిక్ సహాయంతో నడవడం చూస్తూనే ఉంటాం. టెక్నాలజీలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నా దృష్టిలోపంతో బాధపడే వారికి సరైన పరికరాలు అందుబాటులోకి రాలేదు. అయితే ఇప్పుడు ఈ కుర్రాడు రూపొందించిన కళ్లజోడు వీరికి అద్భుతంగా ఉపయోగపడనుంది. "మా ఊళ్లో దృష్టిలోపంతో బాధపడుతున్న ముసలివాళ్లను చూశాను. మరొకరి ఆసరా లేకుండా వాళ్లు నడవలేకపోవడం చూసి వాళ్లకు పనికొచ్చే పరికరం తయారుచేయాలని అనిపించింది. నా ఆలోచనను మా సైన్స్ టీచర్‌తో పంచుకున్నాను. ఆ టీచర్ సహకారంతో మా స్కూల్ ప్రయోగశాలలోనే కళ్లద్దాలు రూపొందించాను" అని చెబుతున్నాడు ప్రియభారత్. ప్రస్తుతం అతడు ఒడిస్సాలో జజ్‌పూర్ జిల్లా అడంగలోని ప్రహ్లాద్ చంద్ర బ్రహ్మాచారి హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రియభారత్ రూపొందించిన కళ్లద్దాలలో రెండు మోడల్స్ ఉన్నాయి. దృష్టిలోపం ఉన్న వారికి అల్ట్రాసోనిక్ సెన్సర్, బజర్ ఉన్న అద్దాలు ఒకరకమైతే, దృష్టిలోపంతో పాటు వినికిడి లోపం ఉన్న వారికి వైబ్రేటర్ మోటర్ ఉన్న మోడల్‌ను రూపొందించాడు. త్వరలోనే ఈ అద్దాలకు జీపీఎస్ మోటర్, స్పీకర్ అమర్చనున్నాడు. జీపీఎస్ అమర్చితే గూగుల్‌మ్యాప్స్‌తో సింక్రనైజ్ అయితే ఆటోమెటిక్‌గా గైడ్ చేస్తుంటాయి. తాను రూపొందించిన కళ్లద్దాలకు పేటెంట్ కోసం దరఖాస్తు చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు ప్రియభారత్.


దారి కనుక్కోండి?




పదాలను పట్టికలో కనిపెట్టండి?



6 తేడాలు గుర్తించండి?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు -240

7			4		6		5	
	5	4						
	2	9			5			8
		8				1	9	2
9	1	2				5		
1			7			8	6	
						4	3	
	7		5		4			1

సుడోకు - 239 సమాధానం

4	5	8	9	2	3	6	1	7
7	3	2	4	6	1	5	9	8
9	6	1	5	7	8	3	4	2
8	4	3	1	9	2	7	5	6
2	7	5	3	4	6	1	8	9
6	1	9	7	8	5	2	3	4
5	9	4	6	1	7	8	2	3
1	8	6	2	3	4	9	7	5
3	2	7	8	5	9	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

2019కి వీడ్కోలు చెబుతూ 2020 వచ్చేసింది. తనతోపాటే ఎన్నో ఆశలను మోసుకొచ్చింది. కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నప్పుడల్లా మనకు ఒక ప్రేరణ, స్ఫూర్తి లభిస్తుంటాయి. నిత్యం మారుతూ వెళ్లే ఈ కాల ప్రవాహంలో సంవత్సరాలు మారడం అనేది ఓ చిన్న బిందువే కావచ్చు. అయితే ఆ బిందువే ఎన్నో ఆశయాలు, మరెన్నో అవకాశాలను తన వెంట తీసుకు వస్తుంది. గతాన్ని వారధిగా చేసుకొని వర్తమానాన్ని స్ఫూర్తిగా మలుచుకొని సుస్థిరమైన భవిష్యత్‌కు స్వాగతం పలికేందుకు కావల్సిన ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇవన్నీ కలిసి 2020ని హ్యాపీ న్యూ ఇయర్‌గా మలిచేందుకు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో 2020లో ఉద్యోగార్థులకు ఎలాంటి అవకాశాలు రాబోతున్నాయో తెలుసుకుందాం..



ఉద్యోగ ప్రాప్తిరస్తు

ఆర్థికంలో ఉద్యోగాల మేళా



అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తోన్న రంగాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ విభాగాలు ముందంజలో ఉంటాయి. ఒక అంచనా ప్రకారం ఈ రంగం 2022 నాటికి 16 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా ముందుకు వెళుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఏటా ఐబీపీఎస్ ద్వారా క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ కేడర్‌లో క్రమం తప్పకుండా నియామకాలను చేపడుతుంటాయి. ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా సంబంధిత సమాచారాన్ని పొందొచ్చు. ఆర్‌బీఐ ఇప్పటికే 926 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. అందుబాటులోని సమాచారం మేరకు ఎస్‌బీఐ 8 వేల క్లరికల్ కేడర్, 2 వేల పీవో పోస్టులు, ఐబీపీఎస్ ఆర్‌ఆర్‌బీ 8 వేల ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు, ఆర్‌బీఐ గ్రేడ్-బి ఆఫీసర్, ఎల్ఐసీ అసిస్టెంట్ / అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ / అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఐడీబీఐ అసిస్టెంట్ మేనేజర్, ఎఫ్‌సీఐ మేనేజర్, ఈపీఎఫ్‌వో అసిస్టెంట్, నాబార్డ్ గ్రేడ్ ఏ, బీ ఆఫీసర్ పోస్టులకు ఈ ఏడాది నోటిఫికేషన్లు వెలువడతాయి. వీటికి అదనంగా ప్రైవేట్ రంగంలోని బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు, ఫైనాన్షియల్ సంస్థలు, స్టాక్ మార్కెట్లు, ఫండ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో పుష్కలమైన అవకాశాలు ఉంటాయి.

వీటిల్లో ఆశాజనకం

ఐటీని మినహాయిస్తే ఎడ్యుకేషన్, ఎనర్జీ, హెల్త్‌కేర్, ఎన్విరాన్‌మెంట్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో రిక్రూట్‌మెంట్‌పరంగా ఆశాజనక పరిస్థితులు ఉంటాయి. ఐటీఈఎస్, ఇంజనీరింగ్, ఆటోమోటివ్, ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ, ఫార్మా అండ్ హెల్త్‌కేర్, బీపీఓ, కేపీఓ, ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో రిక్రూట్‌మెంట్ సరళి మధ్యస్తంగా ఉండొచ్చు. ఫ్రెషర్స్‌కు రిటైల్, ఐటీ, ఎడ్యుకేషన్, బ్యాంకింగ్, ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఫార్మా, హెల్త్‌కేర్, హాస్పిటాలిటీ వంటి రంగాల్లో మంచి అవకాశాలు దక్కుతాయి.

వేతనాలు: కోర్న్ ఫెర్రీ గ్లోబల్ శాలరీ ఫోర్‌క్యాస్ట్ అనే సంస్థ సర్వే ప్రకారం ఈ ఏడాది దేశంలో వివిధ రంగాల్లోని ఉద్యోగులకు దాదాపు 9.2 శాతం మేర జీతాలు పెరిగే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం దేశంలో జీతాల్లో వాస్తవ పెరుగుదల 5.1 శాతంగా ఉంటుందని తెలిపింది.

ఐటీలో వీటికే డిమాండ్



విశ్లేషకుల అంచనాల ప్రకారం ఐటీ రంగంలో రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి గతేడాది పరిస్థితులే ఈ ఏడాది కొనసాగే అవకాశాలెక్కువ. ప్రస్తుతం నియామకం విషయంలో కంపెనీలు అచితూచి స్పందిస్తున్నాయి. ఈ రంగంలో అందుబాటులోకి వచ్చే అవకాశాల్లో అధిక శాతం ఏఐ, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, ఐఓటీ, బిగ్ డేటా వంటి నవీన సాంకేతికల ఆధారంగానే ఉంటాయి. ప్రముఖ హైరింగ్ వెబ్‌సైట్ లింక్డన్ ప్రకారం దేశంలో ఈ ఏడాది ఎక్కువగా డిమాండ్ ఉండే ఉద్యోగాలు.. బ్లాక్ చెయిన్ డెవలపర్, ఏఐ స్పెషలిస్ట్, జావా స్క్రిప్ట్ డెవలపర్, రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ కన్సల్టెంట్, బ్యాక్ ఎండ్ డెవలపర్, సైట్ రియలబిలిటీ ఇంజనీర్, ఫుల్‌స్టాక్ ఇంజనీర్, రోబోటిక్స్ ఇంజనీర్, సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్, పైథాన్ డెవలపర్, ఫ్రంట్ ఎండ్ ఇంజనీర్.

సుస్థిరమైన ఆలోచన ఉంటే

ప్రైవేట్ రంగంతో పోల్చితే.. ఆకర్షణీయమైన జీతం, సుస్థిరమైన కెరీర్‌కు ప్రభుత్వ రంగం హామీగా నిలుస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో కెరీర్ ప్రారంభించడానికి చక్కని అవకాశం కల్పిస్తోంది యూపీఎస్సీ. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఇంజనీర్, డాక్టర్, అసిస్టెంట్ కమాండెంట్ వంటి కొలువులతోపాటు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, త్రివిధ దళాలకు కావల్సిన వేలాది అధికారుల నియామక ప్రక్రియను యూపీఎస్సీ పర్యవేక్షిస్తుంది. ఈ సంస్థ ఉద్యోగుల రిక్రూట్‌మెంట్ కోసం క్యాలెండర్ విధానాన్ని అనుసరిస్తుంది. అందులో పేర్కొన్న విధంగానే నోటిఫికేషన్లు విడుదలవుతాయి. వివరాలను యూపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లోని గ్రూప్-బి, గ్రూప్-సి, జూనియర్ ఇంజనీర్, స్టెనోగ్రాఫర్, సైంటిఫిక్ అసిస్టెంట్, జియాలజిస్ట్ కేడర్ ఉద్యోగాలతోపాటు సాయుధ పోలీస్ దళాల్లోని వివిధ ఖాళీల భర్తీకి ఈ ఏడాది స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (http://ssc.nic.in/) నుంచి నోటిఫికేషన్లు విడుదలవుతాయి. పీఎస్‌యూలు.. అప్రెంటీస్‌షిప్, మేనేజ్‌మెంట్ ట్రైనీ, కెమిస్ట్, ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాలను ఏటా తప్పకుండా భర్తీ చేస్తాయి. ఈ ఒరవడి ఈ సంవత్సరం కూడా కొనసాగుతుంది. త్రివిధ దళాలకు సంబంధించి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ నుంచి సమయానుకూలంగా సోల్జర్, సెయిలర్, ఎయిర్‌మెన్, ఆఫీసర్స్, పైలట్, ఇంజనీర్, ఎడ్యుకేషన్, లా, మెడికల్ విభాగాల్లోని ఖాళీలకు నోటిఫికేషన్లు వెలువడతాయి.

నూతన సంవత్సర కానుక!

రాష్ట్ర విషయానికొస్తే ప్రారంభంలోనే డీఎస్సీ రూపంలో ఉద్యోగార్థులకు నూతన సంవత్సర కానుక లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. దాదాపు 10 వేలకుపైగా పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడవచ్చు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా ఉద్యోగాల భర్తీకి సంబంధించి యూపీఎస్సీ తరహాలో రిక్రూట్‌మెంట్ క్యాలెండర్‌ను విడుదల చేస్తారని సమాచారం. అదేవిధంగా పోలీస్ శాఖ నుంచి కూడా పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రకటన ఉండొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే లక్ష్య సాధన దిశగా సన్నాహాలు ప్రారంభించడం మంచిది.

టెక్నీషియన్ అప్రెంటీస్

ఖాళీలు 312

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, మార్కెటింగ్ డివిజన్ టెక్నీషియన్ ట్రేడ్ అప్రెంటీస్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివరాలు..
- అర్హత: టెక్నీషియన్ అప్రెంటీస్‌కు సంబంధిత విభాగంలో డిప్లొమా. ట్రేడ్ అప్రెంటీస్‌కు సంబంధిత బ్రాంచ్‌లో ఐటీఐ
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 22, 2020
- వెబ్‌సైట్: www.iocl.com/

అసిస్టెంట్ మేనేజర్

ఖాళీలు 17

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..
- పోస్టుల వారీగా ఖాళీలు: అసిస్టెంట్ మేనేజర్ - 13, మేనేజర్ - 2, లీగల్ ఆఫీసర్ - 1, లైబ్రరీ ప్రొఫెషనల్స్ (గ్రేడ్ ఏ) - 1.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20, 2020.
- వెబ్‌సైట్: www.rbi.org.in/

నర్సింగ్ ఆఫీసర్

ఖాళీలు 104

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) - నాగ్‌పూర్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- భర్తీ చేసే పోస్టులు: ప్రిన్సిపల్, లెక్చరర్, నర్సింగ్ ఆఫీసర్
- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రిన్సిపల్- 1, లెక్చరర్ - 3, నర్సింగ్ ఆఫీసర్ - 100.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 14, 2020.
- వెబ్‌సైట్: aiimsnagpur.edu.in/

ట్రేడ్ అప్రెంటీస్

ఖాళీలు 100

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, ట్రేడ్ అప్రెంటీస్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
- బ్రాంచ్‌ల వారీగా ఖాళీలు: ఫిట్టర్ - 45, ఎలక్ట్రిషియన్-35, వెల్డర్-4, మెషినిస్ట్-4, టర్నర్ - 4, కార్పెంటర్ / ప్లంబర్ - 4, డ్రాట్స్‌మ్యాన్ - 4.
- అర్హత: సంబంధిత బ్రాంచ్‌లో ఐటీఐ
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20, 2020
- వెబ్‌సైట్: www.hindustancopper.com/

జూనియర్ టెక్నీషియన్

ఖాళీలు 29

సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పీఎంసీఎల్)కి చెందిన హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..
- పోస్టుల వారీగా ఖాళీలు: జూనియర్ టెక్నీషియన్ (ప్రింటింగ్) - 26, ఫైర్‌మెన్ (రిసోర్స్ మేనేజ్‌మెంట్) - 3.
- అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ, నిర్ధేశించిన శారీరక ప్రమాణాలు.
- ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 8, 2020.
- వెబ్‌సైట్: spphyderabad.spmcil.com/

రీసెర్చ్ అసోసియేట్

ఖాళీలు 29

వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) - డెహ్రాడూన్ పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..
- భర్తీ చేసే పోస్టులు: రీసెర్చ్ అసోసియేట్, వైల్డ్ లైఫ్ బయాలజిస్ట్, వెటర్నరీ ఆఫీసర్, ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ అసిస్టెంట్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 23, 2020
- వెబ్‌సైట్: https://wii.gov.in/

మెయింటైనర్

ఖాళీలు 185

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్) - రావత్‌భట్టా (రాజస్థాన్), పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..
- పోస్టుల వారీగా ఖాళీలు: ఆపరేటర్ - 70, మెయింటైనర్ - 105, ఫైర్‌మెన్ - 10
- అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి మెట్రిక్యులేషన్, ఇంటర్మీడియెట్ / తత్సమానం, ఐటీఐ.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 21, 2020.
- వెబ్‌సైట్: https://npcil.nic.in/

డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్

ఖాళీలు 29

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- భర్తీ చేసే పోస్టులు: డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్, డిప్యూటీ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్.
- అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్, బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణత.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 16, 2020
- వెబ్‌సైట్: www.upsc.gov.in/

మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు 14

నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌బీసీసీ) - న్యూఢిల్లీ, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...
- పోస్టుల వారీగా ఖాళీలు: సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - 2, చీఫ్ జనరల్ మేనేజర్ - 2, మేనేజ్‌మెంట్ ట్రైనీ - 10.
- అర్హత: సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ / తత్సమానం, గేట్ స్కోరు, అనుభవం
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 28, 2020
- వెబ్‌సైట్: www.nbccindia.com/

సైంటిస్ట్ / ఇంజనీర్


ఖాళీలు 21

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) - శ్రీహరికోట, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..
- భర్తీ చేసే పోస్టులు: సైంటిస్ట్ / ఇంజనీర్, మెడికల్ ఆఫీసర్
- పోస్టుల వారీగా ఖాళీలు: సైంటిస్ట్ / ఇంజనీర్ - 19, మెడికల్ ఆఫీసర్ - 2.
- విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, పవర్ సిస్టమ్స్.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్, ఎంఈ/ఎంటెక్ లేదా తత్సమానం, ఎంబీబీఎస్.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 17, 2020
- వెబ్‌సైట్: apps.shar.gov.in/

అసిస్టెంట్ డైరెక్టర్

ఖాళీలు 19

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) - న్యూఢిల్లీ, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు...
- అర్హత: 2016, 17, 18 సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్‌లో ఇంటర్వ్యూకు హాజరైనవారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 18, 2020.
- వెబ్‌సైట్: sportsauthorityofindia.nic.in/



మాస్ లుక్

సిగిరెట్ కాల్చుతూ మాస్ అవతారంలో సందడి చేస్తున్నారు రవితేజ. తాజాగా ఆయన నటిస్తున్న 'డిస్కోరాజా' చిత్రంలోని స్టిల్ ఇది. రవితేజ బాడీ లాంగ్వేజ్‌కి తగ్గట్టు పక్కా మాస్ లుక్‌లో ఉన్న ఈ పోస్టర్‌ను నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ విడుదల చేసింది చిత్ర బృందం. వి.ఐ ఆనంద్ దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నభా నటేశ్, పాయల్ రాజ్‌పుత్ నాయికలు. ఇటీవల విడుదలైన టీజర్‌కు, రెండు పాటలకు చక్కని స్పందన లభించింది. ఈ నెల 24న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంతకుముందు ఇలా జరగలేదు

- అనిల్ సుంకర



"సరిలేరు నీకెవ్వరు' టైటిల్ ఓ వ్యక్తిని ఉద్దేశించి పెట్టింది కాదు. ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో అలా పెట్టాం. ఇంట్లో ఒక వ్యక్తిని దేశానికి కాపలా పెట్టే వారి పేరెంట్స్‌కి 'సరిలేరు మీకెవ్వరు' అని చెప్పే సినిమా ఇది. సైనికుల గౌరవం మరింత పెంచుతుంది. ఇండియన్ ఆర్మీకి సరైన నివాళి అవుతుంది" అని నిర్మాతల్లో ఒకరైన అనిల్ సుంకర అన్నారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'సరిలేరు నీకెవ్వరు' చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. "ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో ఇంతవరకూ రాని యూనిక్ పాయింట్‌తో తెరకెక్కిన చిత్రమిది. 140 రోజులు ఎలాంటి అవాంతరాలు లేకుండా సినిమా పూర్తి చేశాం. మహేశ్‌ని ఫ్యాన్స్ ఎలా చూద్దాం అనుకుంటున్నారో అలా ఈ చిత్రంలో చూస్తారు. 13 సంవత్సరాల తర్వాత మళ్లీ తెరపై కనిపించబోతున్న విజయశాంతి అవార్డు విన్నింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. మహేశ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయి. వాళ్లిద్దరి మధ్య వచ్చే ప్రతి సీన్‌కి ప్రేక్షకుల నుండి ఈలలు, చప్పట్లు కొడతారు. అవి లేనిచోట కన్నీళ్ళు పెడతారు. ఫస్టాఫ్‌లో 30 నిమిషాలు సాగే ట్రైన్ ఎపిసోడ్ ఆద్యంతం అలరిస్తుంది. ఫస్ట్ కాపీ చూశాక గర్వంగా అనిపించింది. ఇప్పటి వరకూ అనిల్ రావిపూడిలో ఒక యాంగిల్ మాత్రమే చూశారు. ఈ సినిమా తర్వాత ఆయన వేరే లీగ్‌లో ఉంటారు. ఎంటర్‌టైన్‌మెంట్ వదలకుండా మహేశ్‌లాంటి హీరోతో ఏమేం చేయగలడో అన్నీ చేశారు. ఈ నెల 5న జరగబోయే ప్రీ రిలీజ్ వేడుకకి చిరంజీవి అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి మహేశ్ హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు. అందుకే దీనికి మెగా సూపర్ ఈవెంట్ అని పేరు పెట్టాం" అని అన్నారు.

	సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
మార్పు	52.28 ↑	14.05 ↑	121 ↓	520 ↓	14 పైసలు ↑	↑
ముగింపు	41,306.02	12,182.50	39,119	46,145	71.22	66.00

బంగారం: ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)

కొత్త ఏడాది శుభారంభం

» 52 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ కొత్త సంవత్సరం తొలి రోజే లాభాలు నమోదు చేసింది. సెన్సెక్స్ 52.28 పాయింట్ల లాభంతో 41,306.02 వద్ద, నిఫ్టీ 14.05 పాయింట్ల లాభంతో 12,182.50 వద్ద ముగిశాయి. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, ఇందుకు దోహదం చేశాయి. 2019 సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) జీడీపీలో 0.9 శాతానికి తగ్గడం, వృద్ధి రేటును పట్టాలు ఎక్కించేందుకు మౌలిక రంగంపై వచ్చే ఐదేళ్లలో రూ..102 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనా, మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచాయి.

కొత్త ఏడాది తొలి రోజు ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లన్నీ సెలవు పాటించాయి. దీంతో దేశీయ అంశాలే మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. ఈ ఏడాది లార్జ్ క్యాప్ కంపెనీల షేర్లతో పోలిస్తే స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు మంచి లాభాలు ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు ఊపందుకున్నాయి. దీంతో ట్రేడర్లు, మదుపరులు మంచి ఫండమెంటల్స్ ఉన్న స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్ల కొనుగోళ్లకు దిగారు.

రూపాయి అప్

డాలర్ మారకంలో రూపాయి బుధవారం 14 పైసల లాభంతో 71.22 వద్ద ముగిసింది. కరెంట్ ఖాతా లోటు తగ్గడం, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి త్వరలో తెరపడబోతోందన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. కొనసాగుతున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులతో సెంటిమెంట్ మరింత బలపడింది.

పార్క్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూ

క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ.1,000 కోట్లు సమీకరించేందుకు అపీజే సురేంద్ర పార్క్ హోటల్స్ ఐపీఓ కోసం సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ప్రస్తుతం ఉన్న కొన్ని అప్పుల చెల్లింపుతోపాటు ఇతర వ్యాపార అవసరాల కోసం ఈ ఐపీఓ తలపెట్టినట్టు కంపెనీ పేర్కొంది.

ప్రైవేట్ రంగంలో 7లక్షల కొలువులు

» దక్షిణాది రాష్ట్రాల్లోనే అధిక ఉద్యోగాలు

» స్టార్టప్స్‌లో ఎక్కువ కొలువులు

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నాయి. అయినా ఈ ఏడాది ప్రైవేట్ రంగంలో సుమారు 7 లక్షల కొత్త ఉద్యోగ నియామకాలు ఉంటాయని అంచనా. వీటితో పాటు ఉన్న ఉద్యోగుల జీతాలూ ఈ ఏడాది దాదాపు 8 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. మైహైరింగ్‌క్లబ్.కామ్, సర్కారి నౌకరి.ఇన్ఫో అనే వెబ్‌సైట్లు జరిపిన 'ఎంప్లాయ్‌మెంట్ ట్రెండ్స్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది.

హైదరాబాద్, ముంబై, బెంగుళూరుతో సహా దేశంలోని 42 ప్రధాన నగరాల్లో 12 రంగాలకు చెందిన 4,278 కంపెనీలను సర్వే చేసిన నివేదిక రూపొందించారు. ఈ ఏడాది కొత్తగా ఏర్పడే ఉద్యోగాల్లో ఎక్కువ (2,15,400) దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పడతాయని అంచనా. కొత్త ఉద్యోగాల్లో అధికంగా స్టార్టప్స్‌ల్లోనే ఉండనున్నాయి.



ఈ రంగాల్లోనే ఎక్కువ కొలువులు

కొత్త కొలువుల్లో ఎక్కువ (1.12 లక్షలు) రిటైల్, ఈ-కామర్స్ రంగాల్లో ఏర్పడనున్నాయి. 1,05,500 ఉద్యోగాలతో ఐటీ, ఐటీ సేవల రంగాలు ద్వితీయ స్థానంలో ఉంటాయి. హెల్త్‌కేర్ (98,300) ఎఫ్ఎంసీజీ (87,500), తయారీ (68,900), బీఎఫ్ఎస్ఐ (59,700) తర్వాతి స్థానాల్లో ఉండనున్నాయి.

సర్వేలోని మరిన్ని అంశాలు..

- మెట్రో నగరాల్లోనే 5,14,900 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి.
- ఖర్చులు తగ్గించుకునేందుకు చిన్న నగరాలకు కంపెనీలు మారుతున్నాయి.
- 10 శాతం వరకు బోనస్‌కు అవకాశం ఉంది.

తగ్గిన విశాఖ ఉక్కు అమ్మకాలు

» ఫ్యాక్టరీలో పేరుకు పోయిన నిల్వలు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మందగమనం ప్రభావం విశాఖ ఉక్కు కర్మాగారం (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్...ఆర్ఐఎన్ఎల్) పైనా కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో (ఏప్రిల్-డిసెంబరు, 2018) రూ.14,687 కోట్లు ఉన్న ఉక్కు అమ్మకాలు, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో రూ.12,700 కోట్లకు పడిపోయాయి. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం ఆగిపోవడమూ ఇందుకు తోడయ్యాయి. డిమాండ్ తగ్గడంతో ప్రస్తుతం ఫ్యాక్టరీలో దాదాపు నాలుగు లక్షల టన్నుల ఉక్కు నిల్వలు పేరుకు పోయాయి.



లక్ష్యానికి ఆమడ దూరం

గత ఆర్థిక సంవత్సరం (2018-19) మొత్తం మీద విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ రూ.20,844 కోట్ల అమ్మకాలు నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) రూ.25,000 కోట్ల అమ్మకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే డిసెంబరు, 2019 నాటికి అందులో సగం లక్ష్యం మాత్రమే సాధ్యమైంది. దీంతో రాబోయే మూడు నెలలు కీలకమని, వీలైనంతగా అమ్మకాలు పెంచడానికి కృషిచేయాలని ఆర్ఐఎన్ఎల్ సీఎండీ పీకే రథ్ అధికారులను కోరారు.

బ్యాంకు మోసం కేసులో
రూ.51 కోట్ల ఆస్తుల జప్తు

» చేపల చెరువుల పేరుతో ఐడీబీఐ బ్యాంకుకు టోపీ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసిన కేసులో నిందితుడితోపాటు అతడి బంధువులకు చెందిన రూ.51.43 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరానికి చెందిన కుమార్ పప్పూ సింగ్ చేపల చెరువులు, కోళ్ల ఫారాల కోసమని తనతోపాటు తన కుటుంబసభ్యులు, తెలిసిన వ్యక్తులు 87 మంది పేరు మీద ఐడీబీఐ బ్యాంకు నుంచి రూ.51 కోట్లు రుణం తీసుకున్నాడు. రుణం సకాలంలో తీర్చకపోవడంతో బ్యాంకు అధికారులు షూరిటీ పెట్టిన ఆస్తులను జప్తు చేసేందుకు యత్నించగా తప్పుడు పత్రాలని తేలింది. బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న వారి ఖాతాలను పరిశీలించగా...పప్పూ సింగ్ ఆ మొత్తాలను తన వ్యక్తిగత ఖాతాలు, కంపెనీకి చెందిన ఖాతాల్లోకి మళ్లించినట్టు తేలింది. దీనిపై బ్యాంకు అధికారులు సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయగా రుణం మంజూరుచేసిన బ్యాంకు అధికారులతోపాటు రుణగ్రహీతలపై కేసు నమోదుచేశారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేసి కుమార్ పప్పూసింగ్‌తో పాటు రుణగ్రహీతలకు చెందిన రూ.37.7 కోట్ల విలువైన ఆస్తులను, వారి ఖాతాల్లోని రూ.13 కోట్లను అటాచ్‌మెంట్ చేసింది.

మాల్యా చరాస్తులు వాడుకోవచ్చు

» బ్యాంకులకు అనుమతిచ్చిన ప్రత్యేక కోర్టు

ముంబై: లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా కేసులో బ్యాంకులకు కాస్త ఊరట లభించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సారథ్యంలోని 15 బ్యాంకుల కన్సార్షియం మాల్యా రుణ తిరిగి చెల్లింపుల కోసం ఆయన చరాస్తులను వాడుకునేందుకు ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆస్తుల్లో ఫైనాన్షియల్ సెక్యూరిటీలైన యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్) షేర్లు వంటివి ఉన్నాయి.

జీఎస్‌టీ వసూళ్లు
రూ.లక్ష కోట్లు

» డిసెంబరులో 16 శాతం వృద్ధి

» పుంజుకుంటున్న 'వినియోగ' డిమాండ్



న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లు మళ్లీ రూ.లక్ష కోట్లు దాటాయి. గత ఏడాది డిసెంబరు నెల్లో, జీఎస్‌టీ కింద రూ.1,03,184 కోట్లు వసూలయ్యాయి. 2018 డిసెంబరులో వసూలైన రూ.94,726 కోట్లతో పోలిస్తే ఇది 16 శాతం (రూ.8,274 కోట్లు) ఎక్కువ. 2019లో జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లు దాటడం వరుసగా ఇది రెండో నెల. గత ఏడాది నవంబరు నెల్లోనూ జీఎస్‌టీ వసూళ్లు రూ.1,03,492 కోట్లకు చేరాయి. గత ఏడాది డిసెంబరు నెల్లో వసూలైన రూ.1,03,184 కోట్ల జీఎస్‌టీలో రూ.19,962 కోట్లు సీజీఎస్‌టీ, రూ.26,792 కోట్లు ఎస్‌జీఎస్‌టీ, రూ.48,099 కోట్లు ఐజీఎస్‌టీ, రూ.8,331 కోట్లు సెస్సు ద్వారా వసూలయ్యాయి.

గాడిన పడుతున్న 'వినియోగం'

జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండు నెలలపాటు రూ.లక్ష కోట్లు దాటడంతో 'వినియోగ' డిమాండ్ క్రమంగా గాడిన పడుతోందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జీడీపీ వృద్ధి రేటు పడకేయడానికి పెట్టుబడులతోపాటు వినియోగ డిమాండ్ పడకేయడం ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండు నెలలు రూ.లక్ష కోట్లు దాటడం, ప్రభుత్వానికీ కొంత ఊరట ఇస్తోంది.

కొనసాగనున్న జోరు

ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన మూడు నెలల్లో ప్రతి నెలా రూ.1.1 లక్షల కోట్లకు తగ్గకుండా జీఎస్‌టీ వసూళ్లు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగ డిమాండ్ గాడిన పడడం నిజమైతే, ముందు ముందూ నెలవారీ జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లు దాటడం పెద్ద కష్టం కాదని భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోనూ జోరు

తెలుగు రాష్ట్రాల్లో కూడా జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి నమోదయింది. గత ఏడాదితో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 11 శాతం పెరిగి రూ.2,265 కోట్లకు చేరగా తెలంగాణలో 13 శాతం వృద్ధితో రూ.3,420 కోట్లు వసూలయింది. గత ఏడాది డిసెంబరు నెల వసూళ్లు ఏపీలో రూ.2,049 కోట్లు.

మార్కెట్‌లో అప్రమత్తత

టెక్ వ్యూ

నిఫ్టీ మైనర్ రికవరీలో ప్రారంభమై రోజంతా కన్సాలిడేషన్ ధోరణిలోనే ట్రేడయింది. ఆ క్రమంలో మద్దతు స్థాయి 12150 వరకు దిగజారి మళ్లీ మైనర్ రికవరీ సాధించింది. చివరికి 21 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల మధ్యన ముగియడం అనిశ్చితిని సూచిస్తోంది. ప్రధాన ట్రెండ్ మైనర్ కరెక్షన్ ధోరణిలో ఉంది. ఇప్పటికీ 20 డిఎంఏ, స్వల్పకాలిక మద్దతు స్థాయి 12150కన్నా స్వల్పంగా పైనే ఉంది. ప్రస్తుత అప్‌ట్రెండ్ నిలబెట్టుకోవాలంటే ఇక్కడ రికవరీ తప్పనిసరి.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 12230 మద్దతు : 12150

- మరింత రికవరీలో పడితే ఇంట్రాడే నిరోధం 12230 కన్నాపైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12300. ఆ పైన పటిష్ఠంగా క్లోజయినప్పుడే సానుకూల సంకేతం ఇస్తుంది.
- మద్దతు స్థాయి 12150కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 12000..

■ వి.సుందర్ రాజా

సాధారణ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య శుక్ల సప్తమి
నక్షత్రం : ఉత్తరాభాద్ర
అప్రమత్తం : భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 11.05

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.40 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.15 వరకు మెరుగ్గా ట్రేడయి ఆ తర్వాత చివరి వరకు మరోసారి నిస్తేజంగాను ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 10.40 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 10.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు. 2 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే తిరిగి షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 12225, 12260

మద్దతు స్థాయిలు : 12140, 12105

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

ఏపీలో 525 కంపెనీలు మూత

» గత ఏడాదిలో నమోదైనవి 3,000

» విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయం ప్రారంభించి ఏడాది

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గత ఏడాది (2019) ఆంధ్రప్రదేశ్‌లో 525 కంపెనీల మూసివేతకు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ)కి దరఖాస్తు చేసుకున్నాయి. అనుకున్న విధంగా నిధుల సమీకరణ చేయలేకపోవడం, ఉత్పత్తులకు గిరాకీ లేకపోవడం, ఊహించిన విధంగా ప్రభుత్వ ప్రాజెక్టులు చేతికి రాకపోవడం, నష్టాలు తదితర కారణాలతో ఈ కంపెనీలు మూతపడ్డాయి. వీటితోపాటు గత రెండేళ్లుగా ఆస్తులు, అప్పుల పట్టికను సమర్పించని 971 కంపెనీలను ఆర్‌ఓసీ రద్దు చేసింది. 2,927 మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించారు. 2018లో ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 2,000 కంపెనీలను ఏర్పాటు చేస్తే.. 2019లో 3,000 కంపెనీలు నమోదయ్యాయి. 2020 జనవరి ఒకటి నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 32,691 కంపెనీలు ఉండగా.. 20,000 కంపెనీలు చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని కంపెనీల రిజిస్ట్రార్ డెన్నింగ్ బాబు, సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా తెలిపారు. మిగిలిన కంపెనీలు రద్దు చేసే స్థితికి వచ్చాయన్నారు. విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తయింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఆర్‌ఓసీ కార్యాలయ సిబ్బందితోపాటు కంపెనీ సెక్రటరీస్ అమరావతి చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆర్‌ఓసీ డెన్నింగ్ బాబు, సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా తదితరులు.

గత ఏడాది కాలంలో వివిధ కంపెనీలు ఆర్‌ఓసీకి సమర్పించిన 5,000 ఎలక్ట్రానిక్ ఫారమ్ (ఈ-ఫారమ్)లను ప్రాసెస్ చేశారు. గతంలో ఒక ఈ-ఫారమ్‌ను ప్రాసెస్ చేయడానికి సగటున నెల రోజులు పట్టేది. ప్రస్తుతం మూడు రోజుల్లోనే ప్రాసెస్ చేసి అనుమతులు ఇస్తున్నామని ఆర్‌ఓసీ వర్గాలు తెలిపాయి. 2019లో మొత్తం 50 కంపెనీలపై ఆర్‌ఓసీకి ఫిర్యాదులు అందాయి. విగో

3 రోజుల్లో ఈ-ఫారమ్ ప్రాసెస్

రైడిన్ ఫన్, బిట్ కాయిన్ ఇండియా, లుకాస్ షాపింగ్ షాపింగ్, సెర్వా మార్కెటింగ్, వంటి కంపెనీలపై ఆర్‌ఓసీ కఠిన చర్యలు తీసుకుంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ.. కంపెనీ సెక్రటరీలు, చార్టర్డ్ అకౌంటెంట్ల సహాయ సహకారాలతో కంపెనీల కార్యకలాపాలు సజావుగా సాగడానికి విజయవాడ ఆర్‌ఓసీ కార్యాలయం కృషి చేస్తోందని డెన్నింగ్ బాబు వివరించారు.

మారుతీ, మహీంద్రా దూకుడు

డిసెంబరు అమ్మకాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీగా ఉన్న మారుతీ సుజుకీతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) డిసెంబరు నెలలో దేశీయంగా వాహన అమ్మకాల్లో వృద్ధిని సాధించాయి. ఏడాది చివరి నెలలో అమ్మకాలు తగ్గుతుంటాయి. కానీ ఈ కంపెనీలు మాత్రం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. హ్యుండయ్, టయోటా, టాటా మోటార్స్ అమ్మకాలు క్షీణించాయి. డిసెంబరులో మారుతీ దేశీయ అమ్మకాలు అంతకు క్రితం ఏడాది డిసెంబరుతో పోల్చితే 2.4 శాతం మేర పెరిగి 1,21,479 యూనిట్ల నుంచి 1,24,375 యూనిట్లకు చేరుకున్నాయి. కాంపాక్ట్ సెగ్మెంట్లో కొత్త వ్యాగన్ ఆర్, స్విఫ్ట్, సెలేరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ అమ్మకాలు 51,346 యూనిట్ల నుంచి 65,673 యూనిట్లకు పెరిగాయి.

మహీంద్రా: ఈ కంపెనీ దేశీయ అమ్మకాలు డిసెంబరులో ఒక శాతం పెరిగి 36,690 యూనిట్ల నుంచి 37,081 యూనిట్లకు చేరుకున్నాయి. తమ ఔట్‌లుక్‌కు అనుగుణంగానే అమ్మకాలు ఉన్నాయని, వాహనాల నిల్వలు కూడా సౌకర్యవంతమైన స్థాయిలో ఉన్నాయని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ చీఫ్ (అమ్మకాలు, మార్కెటింగ్) విజయ్ రామ్ నక్రా తెలిపారు. బీఎస్-6 వాహనాలను తీసుకువచ్చేందుకు సర్వసన్నద్ధం అయినట్టు ఆయన చెప్పారు.

__టయోటా:__ టయోటా కిర్లోస్కర్ మోటార్ దేశీయ అమ్మకాలు డిసెంబరులో 45 శాతం తగ్గి 11,836 యూనిట్ల నుంచి 6,544 యూనిట్లకు చేరాయి. 2019లో ఈ కంపెనీ మొత్తం 1,26,701 వాహనాలను విక్రయించింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే అమ్మకాలు 16.36 శాతం క్షీణించాయి.

హ్యుండయ్: డిసెంబరులో హ్యుండయ్ దేశీయ అమ్మకాలు 9.8 శాతం తగ్గి 42,093 యూనిట్ల నుంచి 37,953 యూనిట్లకు చేరాయి. 2019 సంవత్సరం దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమకు సవాలుగా మారిందని, ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ కంపెనీ వివిధ విభాగాల్లో 4 కొత్త కార్లను విడుదల చేసినట్టు హ్యుండయ్ డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) తరుణ్ గార్గ్ తెలిపారు. గత ఏడాదిలో కంపెనీ దేశీయంగా మొత్తం 5,10,260 కార్లను విక్రయించింది.

టాటా మోటార్స్: దేశీయ మార్కెట్లో డిసెంబరులో మొత్తం వాహనాల అమ్మకాలు 12 శాతం తగ్గి 50,440 యూనిట్ల నుంచి 44,254 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం ప్యాసెంజర్ వాహనాల అమ్మకాలు అంతకు ముందు ఏడాది డిసెంబరుతో పోల్చితే 10 శాతం తగ్గి 14,260 యూనిట్ల నుంచి 12,785 యూనిట్లకు చేరాయి.

ఎంజీ మోటార్స్: ఈ కంపెనీ డిసెంబరులో 3,021 వాహనాలను విక్రయించింది.

__హోండా కార్స్:__ డిసెంబరులో ఈ కంపెనీ దేశీయంగా 8,412 కార్లను విక్రయించింది. అంతకు ముందు ఏడాది ఇదే నెలతో పోల్చితే అమ్మకాలు 36 శాతం తగ్గాయి. తాము అంచనా వేసిన విధంగానే అమ్మకాలు నమోదయ్యాయని, బీఎస్ - 4 వాహనాల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) రాజేష్ గోయల్ తెలిపారు.

ఇండిగో @250 విమానాలు

ముంబై: విమానయాన సంస్థ ఇండిగో మంగళవారంనాడు మరో నాలుగు నియో విమానాలు ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దేశంలో 250కి పైబడి విమానాలు కలిగి ఉన్న ఏకైక విమానయాన సంస్థ ఇది. అలాగే ఈ ఘనత సాధించిన తొలి విమానయాన సంస్థ కూడా. రోజుకు 1500 సర్వీసులు నడుపుతున్న తొలి బడ్జెట్ విమానయాన సంస్థగా రికార్డు ఇండిగోకు ఉంది. ప్రస్తుతం దేశీయ విమానయాన మార్కెట్‌లో ఇండిగో వాటా 47 శాతం ఉంది. మంగళవారంనాడు మూడు ఎ321 నియో విమానాలు, ఒక 320 నియో విమానం తాము ప్రవేశపెట్టినట్టు ఆ కంపెనీ తెలిపింది.

స్టాక్ ఆధారిత వ్యూహమే ఉత్తమం

గత రెండేళ్లలో మార్కెట్ తీరును గమనిస్తే 2020 సంవత్సరంలో ఈక్విటీ పెట్టుబడులకు స్టాక్ ఆధారిత వ్యూహమే ఉత్తమం అనిపిస్తోంది. మార్కెట్ గత రెండేళ్లలో సాధించిన ర్యాలీలో ఎలాంటి హేతుబద్ధత కనిపించడంలేదు. మార్కెట్ ర్యాలీ అన్ని విభాగాలకు విస్తరించలేదు. కొన్ని ప్రత్యేక షేర్లు మాత్రమే మార్కెట్ కదలికలకు కారణం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో ఏయే రంగాలు మార్కెట్ చోదకశక్తులు అనే అంశం చెప్పడం కష్టంగా ఉంది. మార్కెట్ గత రెండేళ్లలో భారీ ర్యాలీలో ముందుకు సాగుతున్నప్పటికీ సగటు ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉండే స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఈ విభాగాల్లోని షేర్లు ఇన్వెస్టర్లకు లాభాలకన్నా 50 నుంచి 90 శాతం మేరకు నష్టాలను మిగిల్చాయి. షేర్ల వారీగా చూసినా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్ వంటివి ర్యాలీలో ఎన్నో మెట్లు పైకి దూసుకుపోయినా ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్న కర్ణాటక బ్యాంక్, ధనలక్ష్మి బ్యాంక్ వంటివి భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్‌లో 30 షేర్లుండగా ర్యాలీ కేవలం ఆరు షేర్లు -హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంకులకే పరిమితమైంది. 2019లో నిఫ్టీ సాధించిన లాభాల్లో 95 శాతం వాటా ఈ ఆరు షేర్లదే. మార్కెట్‌ను కొన్ని షేర్ల ఆధారంగానే ముందుకు నడిపేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రయత్నం సాగినట్టు ఈ షేర్ల కదలికలు నిరూపిస్తున్నాయి. నిరంతరం తగ్గుతూ వస్తున్నాయన్న కారణంగా టాటా మోటార్స్, యస్ బ్యాంక్ రెండింటినీ సెన్సెక్స్ నుంచి తప్పించడం కూడా మార్కెట్ కృత్రిమ వృద్ధికి దోహదకారి అయిందని భావించవచ్చు. నిర్మొహమాటంగా చెప్పాలంటే ప్రస్తుతం స్టాక్‌మార్కెట్ దేశ వాస్తవ ఆర్థిక స్థితికి గాని, స్థూల మార్కెట్‌కు గాని ఇండెక్స్‌లు ప్రాతినిధ్యం వహించడంలేదు.

మ్యూచువల్ ఫండ్లలోనూ అదే పరిస్థితి

చిన్న ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లలో ప్రవేశించేందుకు అనుకూలంగా భావించే మ్యూచువల్ ఫండ్ల పరిస్థితి కూడా ఏమంత బాగా లేదు. ఎంఎఫ్ స్కీమ్‌లను నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసి) ఏయే షేర్లలో పెట్టుబడి పెట్టాలనేది కూడా స్టాక్ ఎక్స్ఛేంజిలు, సెబీ పరోక్షంగా నిర్దేశిస్తున్నాయి. ఏఎంసీలు కేవలం టాప్ 50 కంపెనీల్లోనే ఇన్వెస్టర్ల సొమ్మును పెట్టుబడిగా పెడుతున్నాయి. ఏదైనా ఒక కంపెనీ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన తర్వాత దాని పూర్వాపరాలు, మంచి చెడుల ఆధారంగా అందులో ఇన్వెస్ట్ చేయాలా, వద్దా అనేది నిర్ణయించుకునే హక్కు ఇన్వెస్టర్‌కు ఉంటుంది. కాని ఎంఎఫ్‌ల విషయం వచ్చే సరికి ఆ హక్కును పూర్తిగా నిరాకరిస్తూ కొందరు పెద్దలు తమ కనుసన్నల్లో మాత్రమే వాటిని నడిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో మ్యూచువల్ ఫండ్లు కూడా చిన్న ఇన్వెస్టర్లకు న్యాయం చేయగలిగే స్థితిలో లేవు.



- ఎస్ఎస్ఎన్ రాజు, స్టాక్ మార్కెట్ నిపుణుడు

ఏ షేర్లపై దృష్టి పెట్టవచ్చు?

ఈ వాస్తవాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే ఇన్వెస్టర్లు ఎవరైనా మార్కెట్‌లో నిలకడ ధోరణిని ప్రదర్శిస్తూ భవిష్యత్ వృద్ధి అవకాశాలు గల షేర్లను ఎంపిక చేసుకుని వాటిలో ఇన్వెస్ట్ చేయడం ప్రస్తుతానికి మంచి వ్యూహం. బ్యాంకింగ్ రంగంలో ఇండియన్ బ్యాంక్ బాగుంది. అలాగే ఫండమెంటల్స్ బాగున్న ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై కూడా దృష్టి పెట్టవచ్చు.

- సిమెంట్ రంగంలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ రూ.82 వద్ద ఆకర్షణీయంగా ఉంది.
- ఫార్మాలో గ్రాన్యూల్స్ ఇండియా, ఫెర్మెంటా బయోలకు మంచి వృద్ధి అవకాశాలున్నాయి.
- ఇన్‌ఫ్రాలో ఎల్ అండ్ టీ, ఎన్‌బీసీసీ, ఎఫ్ఎంసీజీలో ఐటీసీ మెరుగైన షేర్లుగా కనిపిస్తున్నాయి.
- ధర ఎక్కువైనా పెట్టుబడి పెట్టగల సామర్థ్యం ఉన్న వారు మారుతీపై దృష్టి పెట్టవచ్చు. అలాగే డివిడెండ్లపై అధికంగా దృష్టి పెట్టే వారికి కూడా ఎన్‌టీపీసీ బాగుంది.
- ప్రస్తుతం ప్లాస్టిక్‌పై నిషేధం వచ్చిన కారణంగా వెస్ట్ కోస్ట్ పేపర్, స్టార్ పేపర్, జేకే పేపర్ భవిష్యత్తు బాగుంటుంది. ఆ షేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీకి..		విజయవాడ	474
హైదరాబాద్	464	విశాఖపట్నం	487
2వ తేదీకి..		వరంగల్	467
చిత్తూరు	488	డజను గుడ్లు రూ.	72
గోదావరి	474		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	95
వరంగల్	92	గుంటూరు	94
మహబూబ్‌నగర్	92	ఒంగోలు	97
కరీంనగర్	92	చిత్తూరు	92
కర్నూలు	92	నెల్లూరు	92
విశాఖపట్నం	93	అనంతపురం	86
గోదావరి	93		

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	39,300	---	---	---	39,220
క్రితం ముగింపు	39,180	---	40,450	39,250	39,290
22 క్యారెట్లు	37,410	---	---	---	37,350
క్రితం ముగింపు	37,320	---	37,210	36,350	37,420
వెండి (కిలో)	46,600	---	---	---	50,900
క్రితం ముగింపు	47,200	---	48,000	48,100	50,900

ఒక రాష్ట్రం.. 3 రాజధానులు
విజయవాడ ● గురువారం 2 జనవరి 2020

సీమకు రాజధాని ఇస్తారా... ప్రత్యేక రాష్ట్రానికి మద్దతిస్తారా?



- జగన్... మీ వైఖరి ఏమిటో చెప్పాలి
- సీమ రాష్ట్ర సాధన సమితి అధ్యక్షుడు కుంచం ప్రశ్న

ప్రొద్దుటూరు, జనవరి 1: 'రాయలసీమకు రాజధాని ఇస్తావా.. లేదంటే ప్రత్యేక రాయలసీమ రాష్ట్రానికి మద్దతిస్తావా.. నీ వైఖరి ఏంటో చెప్పు" అంటూ సీఎం జగన్‌ని సీమ రాష్ట్ర సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రొద్దుటూరులో మాట్లాడుతూ.. సీఎం మారితే రాజధాని మార్చాలా అని ప్రశ్నించారు. ఒక్క రాజధానినే అభివృద్ధి చేయలేని సీఎం జగన్ 3 రాజధానులను ఏం చేస్తారన్నారు. సీమలోని నేతలు, మేధావులు గొంతు విప్పకపోతే తీరని నష్టం కలుగుతుందన్నారు. సీమలో హైకోర్టు ఏర్పాటుతో ప్రయోజనం ఉండదన్నారు.

వేడుక 'మూడు' లేదు!

- న్యూ ఇయర్‌నాడూ రోడ్లపైనే.. ముగ్గులలో దిద్దిన నిరసనలు

గుంటూరు, విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'మాకు పండగలు లేవు.. శుభాలు, అశుభాలు లేవు.. మంచీచెడులు లేవు...అమరావతిని పూర్తిస్థాయి రాజధానిగా సీఎం జగన్ ప్రకటించిన నాడే మా జీవితాల్లో వెలుగు..' అని రాజధాని గ్రామాలు తేల్చేశాయి. ఈ గ్రామాల్లో సాగుతున్న నిరసనలు బుధవారానికి 15వ రోజుకు చేరాయి. రాజధాని అమరావతి గ్రామాల్లో రైతులు చేస్తున్న దీక్షలకు మహిళలు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ప్రపంచమంతా 2020కి స్వాగతం పలుకుతున్నా 29 గ్రామాలు మాత్రం ఆందోళనలో ఉన్నాయి. తుళ్లూరు, మందడంలో ఉదయం నుంచే పెద్ద ఎత్తున మహిళలు ధర్నాలకు వచ్చారు. మహిళలు రాజధానిపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ముగ్గుల రూపంలో సేవ్ అమరావతి అంటూ రాశారు. మరికొందరు నాగలికి రైతు ఉరి వేసుకున్నట్లుగా ముగ్గులు పెట్టారు. యువకులు తుళ్లూరు మెయిన్ రోడ్డులో సేవ్ అమరావతి అంటూ పెయింట్ వేశారు. మందడంలో జరిగిన మహాధర్నాలో టీడీపీ నేత వర్లరామయ్య పాల్గొన్నారు. 'చంద్రబాబు వంటి కామధేనువును వదులుకొని తన్నే సీఎంను తెచ్చుకొన్నారు' అని ఆవేదన చెందారు. తుళ్లూరు మహాధర్నాలో ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, టీడీపీ నేతలు గల్లా అరుణ, నన్నపనేని రాజకుమారి పాల్గొని ప్రసంగించారు. రాజధాని రైతులకు ఎన్టీఆర్ కుటుంబం అండగా ఉంటుందని రామకృష్ణ భరోసా ఇచ్చారు.



నిమ్మరసం తాగి 24 గంటల దీక్షను విరమిస్తున్న మాజీ మంత్రి దేవినేని

జగన్ తీరుతో రాష్ట్రపతి పాలన: దేవినేని ఉమా

విజయవాడ గొల్లపూడి, జనవరి 1: అడ్డపంచెల వాళ్లు వచ్చి ప్రశాంతంగా ఉన్న వైజాగ్‌ను అశాంతికి నిలయంగా మార్చేస్తారని అక్కడి ప్రజలు భయపడుతున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. 'సేవ్ రాజధాని' పేరుతో ఉమా చేపట్టిన 24గంటల దీక్ష బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ తీరుతో ఏపీలో రాష్ట్రపతి పాలన వచ్చినా రావచ్చన్నారు. పాలించమని పగ్గాలు చేతికిస్తే.. ప్రజలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు. నూతన సంవత్సరం రోజున రైతులను రోడ్డుపై నిలబెట్టారన్నారు. రాజధానిని మార్చమని వారిని ఎవరడిగారని ప్రశ్నించారు. దీక్షకు మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, జ్యోతుల నెహ్రూ, సమితి కన్వీనర్ శివారెడ్డి, జనసేన, బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

అసత్య పునాదులపై తరలింపు కుట్రలు

- రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం: ధూళిపాళ్ల



దీక్ష విరమింపజేస్తున్న ఆనందబాబు

పొన్నూరు టౌన్, జనవరి 1: వైసీపీ ప్రభుత్వం అసత్యాల పునాదులపై అమరావతి రాజధాని తరలింపునకు కుట్రలు పన్నుతోందని మాజీ ఎమ్మెల్యే చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. రాజధాని తరలింపును వ్యతిరేకిస్తూ పొన్నూరులో తన సతీమణి జ్యోతిర్మయి, కుమార్తె వైదీప్తితో కలిసి బుధవారం ఆయన నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ వైజాగ్ మీద సీఎంకు ప్రేమ లేదని, తన తల్లిని ఓడించారని కసి మాత్రమే ఉందన్నారు.

విశాఖ భూములపై జగన్ కన్ను: కేశినేని నాని

మంగళగిరి, జనవరి 1: 'విశాఖ భూములపై జగన్ కన్నుపడింది. అక్కడ తాను, తన ముఠా కలిసి భూకబ్జాలు చేసుకోవచ్చు. అమరావతిలో అయితే ఈ ఆటలు సాగవని రాజధానిని విశాఖకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు' అని ఎంపీ కేశినేని నాని విమర్శించారు. ఎర్రబాలెం గ్రామంలో బుధవారం ఆయన రైతుల ధర్నా శిబిరంలో మాట్లాడారు. రైతు కుటుంబాలను ఏడిపిస్తున్నావు. రోడ్లమీద నిలబెట్టావు. నీకు చేతకాకపోతే రాజీనామా చేయ్. మళ్లీ ఎన్నికలకు వెళదాం. ఎవరేంటో తేల్చుకుందాం' అని సీఎం జగన్‌కు కేశినేని సవాల్ విసిరారు.

కలల రాజధానిని కాపాడుకుందాం

- రాజమహేంద్రవరంలో సంతకాల సేకరణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1: మనమంతా కలలు గన్న రాజధాని అమరావతిని కాపాడుకుందామని రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రైతుల ఆందోళనకు మద్దతుగా మూడు రాజధానులు వద్దు, అమరావతే ముద్దు నినాదంతో ముఖ్యమంత్రికి గ్రీటింగ్ కార్డులపై సంతకాలు సేకరించి పంపిస్తున్నట్టు తెలిపారు. అర్బన్ పరిధిలోని 42 డివిజన్ల ప్రజలు వచ్చి సంతకాలు చేశారు.

ఈ వికేంద్రీకరణను వ్యతిరేకిస్తున్నాం: ఉగ్ర

కనిగిరి, జనవరి 1: పరిపాలన వికేంద్రీకరణను వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. నూతన సంవత్సరం వేళ.. ప్రకాశం జిల్లా కనిగిరిలో బుధవారం చేపట్టిన దీక్షలో ఆయన మాట్లాడారు. అమరావతి పరిస్థితిని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లేందుకు పోస్టు కార్డుల ఉద్యమం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం దురుద్దేశంతో తన జేబులోని వ్యక్తులతో కమిటీలు వేసి, తనకు అనుకూలంగా నివేదికలు తయారు చేయిస్తోందని విమర్శించారు. అమరావతి పరిరక్షణ సమితికి టీడీపీ శ్రేణులతోపాటు రైతులు రూ.1.02లక్షలు విరాళంగా అందించారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మౌనదీక్ష

అనంతపురం వైద్యం, జనవరి 1: రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మౌనదీక్ష చేపట్టారు. బుధవారం అనంతపురంలోని తన నివాసం వద్ద ఉదయం 5నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష సాగించారు. టీడీపీ శ్రేణులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు.

పశ్చిమలో రాజధాని నిరసనలు

దెందులూరు/భీమడోలు, జనవరి 1: రాజధానిగా అమరావతినే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లాలో నిరసనలు కొనసాగుతున్నాయి. రాజధానిని మూడు ముక్కలు చేయడం తగదని ఉంగుటూరులో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు నల్లదుస్తులు ధరించి నిరసన తెలిపారు. దెందులూరులో నిరాహార దీక్ష చేస్తున్న రైతులకు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మద్దతు తెలిపారు.



రాజధాని రైతుల ఉద్యమానికి మద్దతుగా శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలం నిమ్మాడలో టీడీపీ మాజీ మంత్రి అచ్చెన్నాయుడు, ఆయన అన్న కుమారుడు ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్లకార్డులను ప్రదర్శించారు.



మందడంలో మాజీ సీఎం చంద్రబాబు ప్రసంగానికి మద్దతుగా చేతులెత్తి నినదిస్తున్న ఆందోళనకారులు



నెత్తిన నిప్పుల కుంపటి

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. రాజధాని ప్రాంతంలోని యర్రబాలెం, కృష్ణాయపాలెం, మందడం గ్రామాల్లో రైతులు చేపట్టిన నిరసన, రిలే నిరాహారదీక్ష కార్యక్రమాలకు బుధవారం ఆయన తన సతీమణి భువనేశ్వరితో కలసి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో చంద్రబాబు మాట్లాడుతూ.. నూతన సంవత్సరాన్ని ఆనందంగా గడపాల్సిన సమయంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు మనోవేదనకు గురయ్యారని, తాను కూడా బాధతోనే ఇక్కడకు వచ్చానన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణానికి ఆనాడు ఒప్పుకొని ఇప్పుడెందుకు యూటర్న్ తీసుకున్నారని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. మాట తప్పను.. మడమ తిప్పనని చెప్పిన వ్యక్తి ఇప్పుడు మాట మార్చారని దుయ్యబట్టారు. 'మీరు తప్పు చేసి నన్ను పోరాడండని అంటున్నారు. కరెంటు తీగను పట్టుకోవద్దంటే వినలేదు.. ఇప్పుడు చూడండి ఏమైందో' అని ప్రజలకు చురకలంటించారు. రాజధానిలో ఒకే సామాజిక వర్గం ఉందని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ వెనుకబడిన కులాలు 75 శాతం ఉన్నాయని తెలిపారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటే ఏంటో జగన్ చెప్పాలని, ధైర్యం ఉంటే దానిపై దర్యాప్తు చేయాలని సవాల్ విసిరారు.

నాతోనే మైండ్‌గేమ్ ఆడతారా?

'ఒక్కసారి సీఎం కావాలనే జగన్ కోరిక తీరింది. ఆయన మళ్లీ రారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న నాతోనే మైండ్‌గేమ్ ఆడుతున్నారు. మేమేం తప్పు చేయలేదు. మాకు భయం లేదు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్. ఒక్క లిటిగేషన్ కూడా లేకుండా వేల ఎకరాలు సేకరించాం. కారుణ్య మరణాలకు అనుమతించాలని రాజధాని రైతులు రాష్ట్రపతిని కోరారంటే ఈ సీఎంకు సిగ్గుందా..? ఆనాడు జగన్ పాదయాత్రలో ప్రతి ఊరూ తిరిగి ముద్దులు పెట్టారు. అధికారంలోకి వచ్చాక పిడిగుద్దులు గుద్దుతున్నారు. మూడు రాజధానులు ప్రపంచంలో ఎక్కడా లేవు. దేశంలో ఏ సీఎం అయినా రాజధానిని మార్చారా..? విశాఖ ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూస్తున్నారు'

ఇవన్నీ గ్రాఫిక్సా?

'రాజధానిలో ఏమీ కట్టలేదని, అన్ని గ్రాఫిక్స్ అని అబద్ధాలు చెబుతున్నారు. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు 285 ఇళ్లు, ఐఏఎస్, ఐపీఎస్‌లకు 144 ఇళ్లు కట్టాం. టైప్ వన్ గెజిటెడ్ అధికారులకు 374, టైప్ టూ గెజిటెడ్ అధికారులకు 336 ఇళ్లు, ఎన్‌జీవోలకు 1968, గ్రూప్ డీ అధికారులకు 720 ఇళ్లు, మంత్రులకు 35, జడ్జిలకు 36, ఐఏఎస్‌లకు 115 ఇళ్లు.. ఇలా మొత్తం 4026 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాం. ఇవన్నీ గ్రాఫిక్సేనా? రాజధానిపై నివేదిక ఇచ్చిన జీఎన్‌రావు పెద్ద పనికిమాలిన అధికారి. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపు పోర్చుగల్‌లో ఫోర్జరీ చేస్తే వాళ్లపై ఎఫ్‌బీఐ దర్యాప్తు జరుగుతోంది గూగుల్‌లో 6093 అని సెర్చ్ కొడితే... నేరుగా వచ్చేదేమిటంటే ఖైదీ నంబర్ 6093 అని. దాని పక్కన 17వ రాష్ట్ర ముఖ్యమంత్రి (జగన్) అని వస్తుంది. సిగ్గుండాలి. వైఎస్ నన్ను చూస్తే భయపడేవారు. గౌరవించేవారు. ఇప్పుడు జగన్ వెకిలి నవ్వులు నవ్వుతున్నారు. రాష్ట్రం కోసం అదంతా భరిస్తున్నా'

రాజధాని రైతులకు విరాళాలు..

అమరావతి ఐక్యవేదికకు చంద్రబాబు తన తరపున రూ.లక్ష చెక్కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయచౌదరి రూ.లక్ష, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రూ.లక్ష, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ రూ.50 వేలు, ఎన్‌ఆర్‌ఐ బుచ్చిబాబు రూ.50 వేలు, గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు రూ.10 వేలు ఇచ్చారు. ఇంకా పలువురు నేతలు, కార్యకర్తలు విరాళాలు అందజేశారు.

పవన్ రావడం తప్పా....?

జనసేనాని పవన్ కల్యాణ్ రాజధాని గ్రామాలకు రావడం తప్పా..? ఆయనొస్తే ముళ్ల కంచెలు వేయించారు. జగన్ పాదయాత్ర సమయంలో నేను ముళ్లకంచెలు వేయించి ఉంటే తిరిగేవాడేనా? హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి ప్రపంచపటంలో పెట్టిన నాకు రాష్ట్ర విభజన అనంతరం రాజధాని నిర్మాణానికి వినూత్నమైన ఆలోచన వచ్చింది. అదే ల్యాండ్ పూలింగ్ విధానం. రాష్ట్రానికి ఆదాయం రావాలంటే సంపద సృష్టించాలి. అందుకు నగరాలు నిర్మించాలి. నన్ను నమ్మి రైతులు 33వేల ఎకరాల భూములను ల్యాండ్ పూలింగ్ ద్వారా ఇచ్చి త్యాగం చేశారు. అమరావతిలో ఎవరూ భూములు కొనకూడదా? ఎవరూ కొనుగోలు చేయకపోతే రైతులకు ధరెలా వస్తుంది? అమరావతిని ఎవరూ కదిలించలేరు'.

అమరావతిని కాపాడుకుందాం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవడం లక్ష్యంగా కొత్త సంవత్సరంలో ముందడుగు వేద్దామని చంద్రబాబు పిలుపిచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి ఇక్కడి తన నివాసానికి వచ్చిన వారితో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'గత ఏడు నెలల్లో రాష్ట్రానికి తీరని నష్టం జరిగింది. ఆ విధ్వంసం నుంచి రాష్ట్రం బయటపడాలి. ఆంధ్రకు పూర్వ వైభవం రావాలి. గాడి తప్పిన పాలన మళ్లీ మంచిబాటలోకి రావాలి. ఇది అందరికీ అన్ని విధాలా స్ఫూర్తినిచ్చే సంవత్సరం కావాలి' అని ఆకాంక్షించారు. కాగా.. ఆయన పిలుపునకు స్పందించి కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం వక్కలగడ్డ గ్రామస్థులు అమరావతి పరిరక్షణ జేఏసీకి 25వేలు విరాళంగా ఇచ్చారు. కొందరువృద్ధులు పింఛను సొమ్ము జత చేశారు.

బాబుకు వేద పండితుల ఆశీర్వచనం

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చంద్రబాబు దంపతులకు ఇక్కడి ఆయన నివాసంలో వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు.

సీఎంకు మంచి బుద్ధి ప్రసాదించాలని..

విజయవాడ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు బుధవారం కనకదుర్గమ్మను సతీసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో అమరావతిని, రాష్ట్రాన్ని కాపాడాలని, సీఎం జగన్‌కు,ఆయన మంత్రులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని దుర్గమ్మను కోరుకున్నట్లు తెలిపారు.

ఉద్యమానికి ప్లాటినంగాజు విరాళం

- రాజధానిలో అందజేసిన భువనేశ్వరి
- ఎర్రబాలెం రైతుల ధర్నాకు హాజరు
- అక్కడికక్కడే గాజు తీసి అందజేత
- రైతుల వెంటే మా కుటుంబమంతా
- చంద్రబాబుకు మీ తరువాతే మేం
- నిద్రలోనూ మీదే ధ్యాస: మాజీ సీఎం భార్య



మంగళగిరి, జనవరి 1 : అమరావతి రైతులు సాగిస్తున్న ఆందోళనకు చలించిపోయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఉద్యమ ఖర్చుల కోసం తన చేతికున్న ప్లాటినంగాజును తీసి ఇచ్చారు. ఎర్రబాలెం గణేశ్‌మందిర్ సెంటర్‌లో నిత్యం ధర్నాలు, వంటావార్పు చేస్తున్న రైతుల శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించారు. తన వంతు సాయంగా ప్లాటినంగాజును ఇచ్చారు. ఈ గాజును వేలం వేసి వచ్చిన సొమ్మును ఉద్యమానికి వాడాలని రైతుల తరపున ఆకుల ఉమమహేశ్వరరావుకు అందజేశారు. ఈ ఘటనతో మరికొంతమంది స్ఫూర్తిని పొంది అప్పటికప్పుడు సుమారు రూ.50వేల మేర ఎర్రబాలెం రైతులకు నగదు విరాళాలు అందించారు. ఈ సందర్భంగా రైతుల శిబిరాన్ని ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు. "రాజధాని అమరావతి రక్షణ కోసం రైతులు సాగిస్తున్న ఉద్యమం విజయవంతమయ్యేందుకు జీవితాలనైనా ధారపోసేందుకు మా కుటుంబమంతా సిద్ధంగా ఉంది. రాష్ట్రాన్ని చంద్రబాబు దేశంలోనే నంబరు వన్‌గా తీర్చిదిద్దేందుకు నిత్యం తపించేవారు. పోలవరాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కంకణం కట్టుకుని పనిచేశారు. భోజనం చేసేటప్పుడు, నిద్రపోయేటప్పుడు కూడా ఆంధ్రప్రదేశ్, అమరావతి అనే కలవరించేవారు. తరచుగా విసుగొచ్చి 'మీరు ఆరోగ్యమంతా చెడగొట్టుకుంటున్నారు. మమ్మల్ని కూడా మర్చిపోతున్నారు' అని అనేదాన్ని. మీరే ఆయన మనసులో ఉన్న మొదటి వ్యక్తులు. మీ తరువాతే ఆయనకు మా కుటుంబం. ఇక్కడ రాజధానికి భూములిచ్చి రైతులుగా మీరు పడుతున్న ఈ బాధలు చూస్తుంటే నాకెంతో జాలేస్తుంది. ఓ సాటి మహిళగా ఇక్కడి మహిళల ఆవేదనను అర్థం చేసుకుంటున్నాను. మీ ఉద్యమంలో చంద్రబాబుతో పాటు మేమూ భాగస్వాములమవుతాం" అని భువనేశ్వరి వారికి భరోసానిచ్చారు.

మమ్మల్ని కర్ణాటకలో కలిపేయండి

- విశాఖ వెళ్లాలంటే మాకు 20 గంటలు
- కర్నూలు ప్రజలు చేసిన పాపమేంటి?: తిక్కారెడ్డి



ఎమ్మిగనూరు, డిసెంబరు 31. వైసీపీ ప్రభుత్వం అనాలోచితంగా రాజధానిని అమరావతి నుంచి విశాఖకు మార్చేందుకు యత్నిస్తోందని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి మండిపడ్డారు. బుధవారమిక్కడ తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ మార్పు వల్ల కర్నూలు ప్రజలకు ఇబ్బందులు తప్పవని, అందుకే కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాన్ని కర్ణాటకలో కలపాలని డిమాండ్ చేశారు. మంత్రాలయం నుంచి విశాఖకు దాదాపు 20 గంటలు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. రాజధానికి వెళ్లేందుకే రెండురోజులు పడితే.. సామాన్య ప్రజలు ఎలా వెళ్తారన్నారు. కర్నూలుకు హైకోర్టు ఇచ్చామని చెబుతున్నారని.. హైకోర్టు ఏర్పాటు అంత సులువైన పనేనా.. దాన్ని ఇప్పటికిప్పుడు ఏర్పాటు చేయగలరా అని ప్రశ్నించారు. సాగు, తాగునీరు ఇవ్వమంటే హైకోర్టు ఇచ్చామని చెప్పుకోవడం ముఖ్యమంత్రి జగన్‌కే చెల్లిందన్నారు. 'ఒకప్పుడు బళ్లారి జిల్లాలో ఉన్న మా ప్రాంతాన్ని భాషాసంయుక్త రాష్ట్రాలుగా విడిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. కర్నూలు రాజధాని అంటే సరేనన్నాం. తర్వాత హైదరాబాద్‌కూ ఓకే చెప్పాం. రాష్ట్రం విడిపోయినప్పుడు అమరావతికి అంగీకరించాం. ఇలా ప్రతిసారీ త్యాగం చేస్తూనే ఉన్నాం. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులంటూ గందరగోళానికి గురిచేస్తోంది. రేపు బొత్స సత్యనారాయణ వంటి వారు సీఎం అయితే శ్రీకాకుళంలో రాజధాని పెడితే వెళ్లాలా? ఇక రాజధానులు మారే ఓపిక మాకు లేదు. మా ప్రాంతాన్ని కర్ణాటకలో కలపండి. ఇప్పటికే సరిహద్దులో ఉన్న అనంతపురం జిల్లా ప్రజలు ఆ రాష్ట్రంలో కలపాలని కోరుతున్నారు. అదే మాదిరిగా కర్నూలు పశ్చిమను కూడా కర్ణాటకలో కలపండి' అని డిమాండ్ చేశారు.

బీజేపీ వైఖరి తేలేది ఎల్లుండే!

- 4వ తేదీన కడపకు జేపీ నడ్డా
- రాజధానిపై స్పష్టమైన ప్రకటన?



న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని మార్పుపై బీజేపీ వైఖరి శనివారం (4వ తేదీన) తేటతెల్లం కానుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్ర పరిణామాలను కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అధిష్ఠానం సునిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయంలో వివిధ నేతల అభిప్రాయాలు, నివేదికలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కార్యనిర్వాహక అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాకు అందాయని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. నడ్డా ఈ నెల 4న కడపలో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా రాజధాని అంశంపై స్పష్టత ఇస్తారని సమాచారం. సోమవారమిక్కడ పార్టీ జాతీయ కార్యాలయానికి వచ్చిన అమిత్ షా దీనిపై చర్చించినట్లు తెలిసింది. రాజధాని ఎక్కడ ఉండాలో నిర్ణయించుకోవడం రాష్ట్రానికి సంబంధించిన విషయమని.. రాజధాని మార్పు విషయంలో సాంకేతికంగా కేంద్రం పాత్ర ఉండదని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నప్పటికీ.. ఇప్పటికే రాజధానిగా అమరావతి నిర్ణయమై.. కేంద్రం దాని నిర్మాణంలో పాలుపంచుకుంటుండగా.. దానిని ఆకస్మికంగా మార్చాలనుకుంటే ప్రశ్నించే హక్కు కేంద్రానికి ఉంటుందని రాష్ట్రానికి చెందిన బీజేపీ నేతలు.. పార్టీ జాతీయ నాయకత్వానికి చెప్పినట్లు తెలిసింది. ప్రధాని మోదీ స్వయంగా రాజధానికి శంకుస్థాపన చేయడం, కేంద్రం ఇప్పటివరకు రూ.2,500 కోట్లు ఇవ్వడం, రింగ్‌రోడ్, ఎక్స్‌ప్రెస్ హైవేలకు ఆర్థిక సాయం, వివిధ ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు కేంద్రం ముందుకు రావడం, హైకోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం.. ఇన్ని జరిగిన తర్వాత రాజధానిని మారుస్తామంటే కేంద్రం చూస్తూ ఊరుకోవడం సరైంది కాదని వారు వాదించినట్లు తెలిసింది. అంతేగాక అమరావతిని రాజధానిగా ఖరారుచేసే విషయమై నాటి సీఎం చంద్రబాబు సంప్రదించినప్పుడు.. కాంగ్రెస్, వైసీపీలతోపాటు బీజేపీ కూడా అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. రాజధాని విషయంలో తమ ప్రమేయం ఉండదని కేంద్రం చెప్పడం సరైంది కాదని, స్పష్టమైన వైఖరి తీసుకుని తమకు మార్గనిర్దేశం చేయాలని రాష్ట్ర నేతలు కోరినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, బీజేపీ ఎంపీ సుజనా చౌదరి ఒక లైన్ తీసుకుని మాట్లాడుతుండగా.. జీవీఎల్ మరోవిధంగా మాట్లాడుతున్నారు. దీనివల్ల పార్టీలో లుకలుకలున్నాయన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయని వారు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నడ్డా పర్యటనలో స్పష్టమైన వైఖరి ప్రకటించే అవకాశాలున్నాయని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

జేఏసీ ఉద్యమ కార్యాచరణ

విజయవాడ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పాలించమంటే ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చు పెడతారా అంటూ వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు.. సీఎం జగన్ తీరును ప్రశ్నించారు. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకపోతే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలంటూ ఆందోళన చేస్తున్న అమరావతి పరిరక్షణ సమితి(జేఏసీ)లోని వివిధ ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం రాత్రి విజయవాడలో జరిగింది. జేఏసీ నాయకులతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ పార్టీల తరపున ప్రతినిధులు హాజరై 4 రోజుల ఉద్యమ షెడ్యూల్‌ను ఖరారు చేశారు. జేఏసీ నేతృత్వంలో బుధవారం విజయవాడలో ముగ్గుల పోటీ జరిగింది. 'మన అమరావతి- మన రాజధాని' పేరిట జేఏసీలోని 24 సంస్థలు ఈ కార్యక్రమం నిర్వహించాయి. కాగా, 4 రోజుల ఉద్యమ షెడ్యూల్ ఇదీ..

శుక్రవారం: ఎక్కడికక్కడ భారీ ర్యాలీలు
శనివారం: నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో నిరసనలు..
ఆదివారం: రాష్ట్రమంతటా మానవహారాలు
సోమవారం: అన్ని జిల్లాల్లో ఎమ్మార్వో, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేత.

రాజధానితో ప్రజలకేం పని?

- అవి ఎక్కడుంటే ఏంటి?
- వాటితో 10% మందికే పని
- రియల్టర్లే ఆందోళనలు చేస్తున్నారు: పెద్దిరెడ్డి



తిరుపతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'రాజధానులు రాష్ట్రంలో ఎక్కడుంటే ఏమిటి? వాటితో 10% మందికే పని ఉంటుంది. తక్కిన వారికి ఎలాంటి సంబంధం ఉండదు' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. తిరుపతిలో బుధవారం ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. సీమ నుంచి 90% మంది ఉమ్మడి ఏపీకి సీఎంలుగా చేశారని.. ఏ ఒక్కరూ సీమ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అందరూ హైదరాబాద్ మీదే దృష్టిపెట్టడంతో విభజన అనంతరం తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు తెలంగాణకు 50% పైగా ఆదాయం ఒక్క హైదరాబాద్ నుంచే వస్తోందని.. ఇవన్నీ గమనించే సీఎం జగన్ 3 ప్రాంతాల గురించి ఆలోచించారన్నారు. దీనిపై ఒక హైపవర్ కమిటీని కూడా ఏర్పాటుచేశారని, 20 రోజుల్లో కమిటీ నివేదిక సీఎం ఆశయాలకు అనుగుణంగా వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'కర్నూలులో హైకోర్టు వచ్చి వైజాగ్‌లో రాకపోతే వారు కూడా చర్చించుకుంటారు. వైజాగ్‌లో కార్యనిర్వాహక రాజధాని రావడంతో సీమ వాసులు అసంతృప్తితో ఉన్నారు. అసలు రాజధానులతో ప్రజలకు ఏమి పని? అమరావతి నిర్మాణం చేయాలంటే వందేళ్లు ఒక్కరే ముఖ్యమంత్రిగా ఉంటేనే సాధ్యమవుతుంది. అక్కడ ఎవరైనా కాపురం చేసేటట్లుగా ఉందా? అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసేవారు మాత్రమే ఆందోళనలు చేస్తున్నారు. జగన్ తీసుకున్న నిర్ణయంతో అన్ని ప్రాంతాల వారు ఆయనకు 'థాంక్యూ సీఎం' అంటూ శుభాకాంక్షలు తెలపాలి' అని అన్నారు.

ఆందోళన చేస్తున్నది బినామీలు, పెయిడ్ ఆర్టిస్టులే!

- ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

తిరుపతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఆందోళన చేస్తున్నవారిలో కొందరు చంద్రబాబు బినామీలైతే, మరికొందరు పెయిడ్ ఆర్టిస్టులని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి ఆరోపించారు. బుధవారం ఓ కార్యక్రమంలో మాట్లాడారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలన్న ఆలోచనతోనే సీఎం 3 రాజధానుల అంశాన్ని తీసుకొచ్చారని, ఆ దిశగా కమిటీని వేశారని తెలిపారు. తామంతా ఒక్కటైతే జగన్ ఓడిపోయి ఉండేవారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆయన కుట్రపూరిత మనస్తత్వాన్ని బయటపెట్టాయని చెప్పారు. చంద్రబాబు, పవన్‌లాంటి వాళ్లు లక్షమంది ఒక్కటైనా జగన్‌ను ఏమీ చేయలేరన్నారు.



ఆస్ట్రేలియాలో దావానలం

పెర్త్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలతో యావత్ ప్రపంచమంతా సంబరాల్లో మునిగి తేలుతుంటే ఆస్ట్రేలియన్లు మాత్రం కార్చిచ్చుతో ఇబ్బందిపడుతున్నారు. ఆస్ట్రేలియాలో ఆగ్నేయ కోస్తా ప్రాంతంలోని న్యూ సౌత్‌వేల్స్, విక్టోరియా రాష్ట్రాల్లో గత నెలలో భారీగా మంటలు అంటుకున్నాయి. ఎటుచూసినా దట్టమైన పొగలు, అగ్నికీలలు వ్యాపించాయి. ఈ దావానలం ధాటికి రెండు రాష్ట్రాల్లోనూ డజన్ల కొద్దీ ఇళ్లు, వాహనాలు కాలిపోయాయి. స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలను అదుపు చేయడానికి బుధవారం సైనిక నౌకలు, ఎయిర్‌క్రాఫ్టులను తరలించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

67,385

1న భారత్‌లో జననాలు!

- ప్రపంచ వ్యాప్తంగా 3,92,078 మంది..
- పుట్టిన వారిలో 17% మనదేశంలోనే!
- వివరాలను వెల్లడించిన యునిసెఫ్
- హైదరాబాద్‌లో 210 మంది జననం



హైదరాబాద్/సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కొత్త సంవత్సరం తొలి రోజున 67,385 మంది పిల్లలు పుట్టి ఉంటారు! ప్రపంచ వ్యాప్తంగా జనవరి 1న 3,92,078 మంది జన్మించి ఉంటారు! ఇదీ యునిసెఫ్ అంచనా. ఈ మేరకు బుధవారం వివరాలను వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా జనవరి 1న జన్మించే శిశువుల్లో 17 శాతం మంది భారత్‌లోనే ఉంటారని తెలిపింది. ఈ విషయంలో అమెరికా అన్ని దేశాల కన్నా వెనుకబడి ఉంది. ఇక జనవరి 1న జన్మించే మొత్తం శిశువుల్లో సగం మంది 8 దేశాల్లోనే ఉంటున్నట్లు వెల్లడించింది. అందులో ఇండియా 67,385 మందితో అగ్రస్థానంలో ఉండగా.. చైనా 46,299, నైజీరియా 26,039, పాకిస్థాన్ 16,787, ఇండోనేషియా 13020, అమెరికా 10452, కాంగో 10247, ఇథియోపియా 8493 తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాగా.. హైదరాబాద్ నగరంలోని 4 ఏరియా ఆస్పత్రులు, 9 ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల్లో కలిపి బుధవారం 210 మందికి పైగా జన్మించారు.

130కే 200 ఉచిత చానళ్లు

(మొదటిపేజీ తరువాయి)



వెల్లువెత్తడంతో.. 'టారిఫ్ ఆర్డర్, ఇంటర్ కనెక్షన్ రెగ్యులేషన్స్, క్వాలిటీ ఆఫ్ సర్వీసెస్ రెగ్యులేషన్స్, 2017కు ట్రాయ్ సవరణలు చేపట్టి ఈ కొత్త విధానాన్ని ప్రకటించింది. దానిప్రకారం..

- వినియోగదారుడు నెలకు రూ. 130 (పన్నులు అదనం) చెల్లిస్తే 200 ఉచిత చానళ్లను.. అది కూడా వారు ఎంచుకున్న చానళ్లను తప్పనిసరిగా ఇవ్వాల్సిందే. వాటితోపాటు కేంద్ర సమాచార, ప్రసార శాఖ తప్పనిసరిగా పేర్కొన్న దూరదర్శన్ వంటి 26 చానళ్లను కూడా ఇవ్వాలి. ప్రస్తుతం ఈ మొత్తానికి దూరదర్శన్ చానళ్లు కాకుండా కేవలం 100 ఉచిత చానళ్లను మాత్రమే ప్రసారం చేస్తున్నారు. ఆ తర్వాత ఇచ్చే ప్రతి 25 ఉచిత చానళ్లకూ రూ.20 (పన్నులు అదనం) వసూలు చేస్తున్నారు.
- వినియోగదారు నెలకు 160 చెల్లిస్తే సర్వీస్ ప్రొవైడర్లు తమవద్ద ఉన్న ఉచిత చానళ్లన్నీ ఇవ్వాల్సిందే.
- చాలా టీవీ చానళ్ల యాజమాన్యాలు.. అలా కార్టే (విడివిడిగా మనకు కావాల్సిన చానల్‌ను ఎంచుకునే పద్ధతి)లో తమ చానళ్లలో ప్రధాన చానల్‌కు ఎక్కువ ధర పెట్టి, దానికి అనుబంధంగా ఉండే మిగతా చానళ్లకు తక్కువ ధర పెట్టాయి. అన్నిటినీ కలిపి గంపగుత్తగా (బొకే) తీసుకుంటే మాత్రం తక్కువ ధరకే వచ్చేలా చేశాయి. దీంతో వినియోగదారులు అన్నింటినీ కలిపి తీసుకోవాల్సిన పరిస్థితి. దీనికి విరుగుడుగా ట్రాయ్ కొత్త విధానంలో రెండు ప్రధాన నిబంధనలను పెట్టింది. అవేంటంటే.. 1.) అలా కార్టేలో విడివిడిగా ఇచ్చే చానళ్ల ధర బొకే ధరకు ఒకటిన్నర రెట్లకు మించి ఉండకూడదు. ఉదాహరణకు.. 'అ' అనే చానల్ ఐదారు చానళ్లు ఇస్తుంది. వాటిని విడివిడిగా (అలాకార్టేలో) తీసుకుంటే రూ.60 అయ్యేలా ధరలు నిర్ధారిస్తుంది. అవే చానళ్లను బొకేలాగా కొనుక్కుంటే రూ.30కే ఇస్తామని ప్రకటిస్తుంది. దీంతో ప్రజలు బొకే తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. అదే, కొత్త విధానం ప్రకారమైతే.. అలాకార్టేలో ఆ చానళ్ల ధరలన్నింటినీ కలిపినా రూ.45కు మించకూడదు. 2.) అలాకార్టేలో ఉండే ఒక చానల్ సగటు ధర.. ఆ చానల్ ఉన్న బొకేలోని చానళ్ల సగటు ధరకు 3 రెట్లకు మించి ఉండరాదు.
- బొకేలో చేర్చిన పే చానళ్లకు సంబంధించి ఒక చానల్‌కు గరిష్ఠ ధర రూ.19 నుంచి 12కు తగ్గింపు. అంటే రూ.12 లోపు ధర ఉన్న చానళ్లనే బొకేలో చేర్చాలి.
- ఒక ఇంట్లో రెండు కనెక్షన్లు ఉంటే... రెండో కనెక్షన్‌కు నెట్‌వర్క్ క్యారేజ్ ఫీజులో (అంటే మన కేబుల్/డీటీహెచ్ కనెక్షన్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవడానికి ప్రతి నెలా కట్టే మొత్తం. అంటే రూ.130+పన్నులు) 40% చార్జీనే వసూలు చేయాలని పేర్కొంది. ఒకటి కన్నా ఎక్కువ టీవీలున్నవారికి పెద్ద శుభవార్త ఇది.
- ఏదైనా చానల్‌కు 20 శాతానికిపైగా వీక్షకులు ఉంటే సంబంధిత చానల్ నుంచి క్యారియర్ ఫీజును వసూలు చేయవద్దని ఎస్ఎంవోలకు ట్రాయ్ స్పష్టం చేసింది. 20 శాతానికి తక్కువగా ఎంత శాతం వీక్షకులు ఉన్నప్పటికీ క్యారియర్ ఫీజును రూ.4 లక్షలకు మించి వసూలు చేయకూడదు.
- కొత్త విధానం ప్రకారం సవరించిన అ-లా-కార్టె చానల్, బొకేల ధరలను జనవరి 15లోగా బ్రాడ్‌కాస్టర్లు, జనవరి 30లోగా డీటీహెచ్, కేబుల్ ఆపరేటర్లు తమ వెబ్‌సైట్లలో ప్రకటించాలి.



సీఏఏకు వ్యతిరేకంగా కొచిలో ముస్లిం సంస్థల సభ

సీఏఏ సెగ.. కోల్‌కతాలో ఫొటోగ్రాఫర్‌పై దాడి

- ఆందోళనలో పాల్గొన్న రోనీసేన్‌పై పిడిబాకు పోటు

న్యూఢిల్లీ, జనవరి 1: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)కు వ్యతిరేకంగా కోల్‌కతాలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్, సినీ నిర్మాత రోనీసేన్‌పై దాడి జరిగింది. ఘర్షణ, తోపులాటలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. తనపై పిడిబాకుతో అవిజిత్ దాస్ గుప్తా అనే వ్యక్తి దాడిచేసినట్లు పోలీసులకు రోనీసేన్ ఫిర్యాదు చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న జామియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థులపై బాలీవుడ్ నటి స్వర భాస్కర్ ప్రశంసలు కురిపించారు. 'సీఏఏ, ఎన్నార్సీపై మనం ఆల్యసంగానైనా నిద్రలేచాం. మీ ఆందోళనలతో మొత్తంగా దేశాన్నే నిద్రలేపారు' అని ఆమె అన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ బుధవారం ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతినబూనారు. వారాణసీలో డిసెంబరు 19న 144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తూ సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారనే ఆరోపణలతో రవిశంకర్ (36), ఏక్తా (32) దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వారి 14నెలల బిడ్డ పరిస్థితి దయనీయంగా మారింది. తల్లిదండ్రులను అరెస్టు చేయడంతో శిశువు ఒంటరైందని.. తల్లిపై బెంగ పెట్టుకొని బిడ్డ ఆరోగ్యం క్షీణిస్తున్నా బీజేపీ ప్రభుత్వానికి పట్టదా అంటూ ట్విటర్‌లో కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ విమర్శించారు. తన మతతత్వ పోకడలతో రాజ్యాంగాన్ని బీజేపీ బలహీన పరుస్తోందని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి విమర్శించారు. పశ్చిమబెంగాల్‌లో సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు కౌంటర్‌గా ప్రచారం నిర్వహిస్తామని బుధవారం బీజేపీ ప్రకటించింది.



ఒకే దేశం ఒకే రేషన్ కార్డు

ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 1: ఒకే దేశం ఒకే రేషన్ కార్డు విధానాన్ని కేంద్రం అమల్లోకి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, రాజస్థాన్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, గోవా, జార్ఖండ్, త్రిపురల్లో బుధవారం నుంచి ఈ సదుపాయం ప్రారంభమైంది. దీని ప్రకారం ఈ 12 రాష్ట్రాలకు చెందిన ప్రజాపంపిణీ వ్యవస్థ లబ్ధిదారులు వీటిలో ఏ రాష్ట్రంలో ఉన్నా తమ వాటా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. ఈ ఏడాది జూన్ నాటికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను 'వన్ నేషన్ వన్ రేషన్' విధానానికి అనుసంధానిస్తారు. ఈ మేరకు రేషన్ కార్డులు కొత్త ఫార్మాట్‌లో రూపొందించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి నూతన కార్డులు అందుబాటులోకి వస్తాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జారీచేసే కార్డులన్నీ ఒకే స్టాండర్డ్ ఫార్మాట్‌లో ఉంటాయి.



బిహార్ మంత్రుల కంటే నితీశే పేద

- ఆస్తిలో పెరిగినది రెండు ఆవులే

పట్నా, జనవరి 1: ముఖ్యమంత్రిగా ఉన్నా నయాపైసా కూడా వెనకేసుకోలేదంటున్నారు బిహార్ సీఎం నితీశ్ కుమార్! నిరుటితో పోలిస్తే ఆయన ఆస్తిలో పెరుగుదల కేవలం రెండు ఆవులు- ఒక దూడ. 2018లో ఆయనకు ఎనిమిది ఆవులుండేవి. ఇపుడు పది అయ్యాయి. మంత్రివర్గ సహచరుల, వ్యక్తిగత ఆస్తుల వివరాలను ఆయన బుధవారం ప్రకటించారు. కిందటేడాది ఓ పశువుల షెడ్డు, 8 ఆవులు, ఆరు దూడలు ఉన్నట్లు చూపారు. ఈసారి పది ఆవులు, ఏడు దూడలున్నట్లు తెలిపారు. స్థిరాస్థిగా ఢిల్లీ ద్వారకానగర్‌లో ఉన్న ఓ పాత ఇంటిని చూపారు. దాని విలువ రూ.42 లక్షలు. రూ.16లక్షల మేర చరాస్థి ఉన్నట్లు చెప్పారు. కిందటేడాది ఆయన వద్ద ఉన్న నగదు రూ 42వేలు కాగా ఇప్పుడది రూ 38,039 లకు తగ్గింది. నితీశ్ కుమారుడి కొడుకు పేరున రూ.1.49 కోట్ల స్థిరాస్థి, అంతే మొత్తంలో చరాస్తి ఉన్నట్లు.. అది టీచరుగా పనిచేస్తున్న తన భార్య నుంచి సంక్రమించినట్లు వెల్లడించారు. విశేషమేమంటే నితీశ్ మంత్రివర్గ సభ్యులకు ఆయన కంటే ఆస్తిపాస్తులు ఎక్కువ.



రేణూ దేశాయ్ అప్పుడలా.. ఇప్పుడిలా

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన కుమార్తె ఆద్యతో కలిసి దిగిన ఫొటోను ఆయన మాజీ భార్య రేణూ దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇది తండ్రీకుమార్తెల ప్రేమ అంటూ వ్యాఖ్య రాశారు. 'ఆద్య కొన్నిసార్లు నా లాగా కనిపిస్తుంది. చాలా సార్లు వాళ్ల నాన్నమ్మ, నాన్నకు కాపీలా ఉంటుంది. నా కెమెరా ఫేవరెట్ పర్సన్ ఆద్య' అని ఆమె పోస్ట్ చేశారు. అయితే ఇటీవలే ఆమె తన పిల్లల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఎంతైనా పవన్ రక్తం అంటూ నెటిజన్లు కామెంట్ చేశారు. తన రక్తమే అంటూ ఆమె సమాధానమిచ్చారు. అనంతరం ఆమె సమాధానంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే మళ్లీ తాజాగా ఆ ఫొటో పోస్ట్ చేసి, ఆవిధంగా వ్యాఖ్యానించి ఉండవచ్చని భావిస్తున్నారు.

నింగిలోకి నలుగురు!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. కుదిరితే 2020 నవంబరులోనే చంద్రయాన్-3 ప్రయోగిస్తాం. చివరిక్షణంలో ఏమైనా మార్పులు జరిగితే తప్ప ఈ కార్యక్రమం వాయిదా పడదు" అని శివన్ స్పష్టం చేశారు. 2020లో పాతికవరకు ప్రయోగాలు చేపడతామని తెలిపారు. 2019లో పెండింగ్‌లో ఉన్న మిషన్స్‌ను ఈ ఏడాది మార్చిలోపు పూర్తి చేస్తామని కె.శివన్ ప్రకటించారు.

ఎందుకు గురి తప్పిందంటే...

2019లో భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-2.... అతిస్వల్ప తేడాతో విఫలమైన సంగతి తెలిసిందే. చంద్రుడి ఉపరితలంపైకి సాఫీగా దిగాల్సిన 'విక్రమ్ ల్యాండర్'... దాదాపు రెండు కిలోమీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది (హార్డ్ ల్యాండింగ్). 'వెలాసిటీ రిడక్షన్' వ్యవస్థ వైఫల్యం వల్లే ఇలా జరిగిందని శివన్ తెలిపారు. దీనికి అంతర్గత కారణాలున్నాయని చెప్పారు. విక్రమ్ ల్యాండర్ ఎక్కడ కుప్పకూలిందో తమకు ముందుగానే తెలుసునన్నారు. వాటి శకలాలను తొలుత నాసా గుర్తించి ఇస్రోకు సమాచారం అందించిందన్నారు. ఈ ప్రక్రియలో సహకరించిన చెన్నైకి చెందిన యువ నిపుణుడిని ఆయన అభినందించారు. విక్రమ్ ల్యాండర్ శకలాల చిత్రాలను విడుదల చేయబోమని, ఇస్రో నిబంధనలు అందుకు అంగీకరించవని చెప్పారు. తమిళనాడులోని తూత్తుకుడిలో ఉపగ్రహ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ మొదలైందని తెలిపారు. ఇక్కడి నుంచి చిన్న ఉపగ్రహ వాహక నౌకల (ఎస్ఎస్ఎల్వీ) ప్రయోగానికి ఇది అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

'యాన్' విశేషాలు...

- చంద్రయాన్-3లో భాగమైన ల్యాండర్, రోవర్, ప్రొపెల్షన్ మాడ్యూల్‌ల తయారీకి రూ.250 కోట్లు ఖర్చవుతుంది. ఉపగ్రహ ప్రయోగానికి రూ.365 కోట్లు ఖర్చవుతుంది. మొత్తం మిషన్ వ్యయం రూ.615 కోట్లు.
- చంద్రయాన్-2 ఆర్బిటర్ జీవితకాలం ఏడేళ్లు. చంద్రయాన్-3కి కూడా ఇదే ఆర్బిటర్‌ను ఉపయోగిస్తారు.
- 'గగన్‌యాన్'.. భారత్ చేపడుతున్న తొలి మానవ సహిత అంతరిక్ష ప్రయోగం. మన వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు ఫ్రాన్స్, రష్యాలతో ఒప్పందం కుదిరింది.
- గగన్ యాన్‌లో మహిళా వ్యోమగాములు కూడా ఉంటారని గతంలో ఇస్రో ప్రకటించింది.

పీవోకే స్వాధీనమే టార్గెట్?

- సీడీఎస్ ఏర్పాటు వెనుక లక్ష్యమదే..!
- త్రివిధ దళాల సమన్వయంతో సంయుక్త కార్యాచరణకు వ్యూహం
- ప్రణాళికలు బయటపెట్టం: రావత్



భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) బిపిన్ రావత్‌తో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె, నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్ బదౌరియా

న్యూఢిల్లీ, జనవరి 1: పాక్-ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) స్వాధీనమే లక్ష్యంగా సైనిక వ్యవహారాల విభాగం ఏర్పాటు, మహాదళపతి (సీడీఎస్) వ్యవస్థలను కేంద్రం నెలకొల్పిందా?... ఈ ప్రశ్నలకు రాజకీయ వర్గాల్లో అవుననే సమాధానం వస్తోంది. మూడు దళాలను సమన్వయపరిచి- సంయుక్తంగా ఓ కార్యాచరణ సిద్ధం చేయడానికి ఈ వ్యవస్థను ఆరంభించినట్లు ప్రచారం జరుగుతోంది. బుధవారంనాడు దేశ తొలి సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ బిపిన్ రావత్‌ను ఈ ప్రశ్న అడిగినపుడు- ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. "ప్రణాళికలను బహిరంగపరచం. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా మా పని ఉంటుంది" అని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

ఆర్టికల్ 370 నిర్వీర్యం, కశ్మీర్ విభజన తరువాత కేంద్రం తన తదుపరి దృష్టిని పీవోకేపై సారించినట్లు ఇప్పటికే వార్తా కథనాలు వచ్చాయి. పాక్‌తో ఇక ఏ శాంతి చర్చలైనా కశ్మీర్ గురించి కాదు, ఆక్రమిత కశ్మీర్ స్వాధీనం గురించే... అని అనేక మంది కేంద్ర మంత్రులు పలు సందర్భాల్లో స్పష్టీకరించిన సంగతి తెలిసిందే. పీవోకేలోని గిల్గిట్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, ఆక్సాయ్ చిన్.. ఇవన్నీ భారత్ భూభాగమే అని విదేశాంగమంత్రి ఎస్ జయశంకర్ సైతం ఓసారి తేల్చిచెప్పారు. ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ఆక్సాయ్ చిన్‌ను వదిలేసి మిగిలిన పాక్-ఆక్రమిత ప్రాంతాన్ని తిరిగి వశం చేసుకుని కశ్మీర్లో కలిపేయాలని కేంద్రం ప్రణాళికలు రచించినట్లు వెల్లడైంది. మూడు దళాల మధ్య సమన్వయంతో ఏకీకరణ జరిపేందుకు కేంద్రం జనరల్ రావత్‌కు మూడేళ్ల గడువు ఇచ్చింది. ఆలోగా ఇది సాధ్యమేనని రావత్ కూడా మీడియాతో అన్నారు. ఓ రకంగా పీవోకేపై సంయుక్త కార్యాచరణకు మూడేళ్ల గడువు పెట్టుకున్నట్లేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. దళాల సమన్వయమే కాదు, ఆధునిక యుద్ధరీతుల్లో దేశాన్ని సమాయత్తం చేయడం, రఫేల్, అణు జలాంతర్గాములు, ఎస్-400 వాయు రక్షణ వ్యవస్థలను సమకూర్చుకోవడం...వీటన్నింటినీ సీడీఎస్ త్వరితం చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

నో పాలిటిక్స్..!

రాజకీయాలకు త్రివిధ దళాలు చాలా దూరమని జనరల్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారంనాడు యుద్ధస్మారక చిహ్నం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, అనంతరం త్రివిధ దళాల సైనిక వందనాన్ని స్వీకరించాక దేశ తొలి సీడీఎస్‌గా లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. సైనిక వ్యవహారాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోతున్నదన్న విమర్శల గురించి ఆయనను ప్రశ్నించినపుడు- 'మేం రాజకీయాలకు దూరం. చాలా దూరం. అధికారంలో ఉన్న ప్రభుత్వ ఆదేశాలనుసారం పనిచేయడమే మా విధి' అని రావత్ బదులిచ్చారు. 'మూడు దళాల మధ్య సమన్వయం సాధించడం నా లక్ష్యం. వనరులు సద్వినియోగమయ్యేట్లు చూస్తా. ఆర్మీ, నేవీ, వైమానిక దళాలు మూడూ ఓ బృందంగా పనిచేసేట్లు చేస్తా. వాటి సామర్థ్యాన్ని పెంచే చర్యలపై దృష్టి పెడతా" అని వివరించారు. "ఇది నా ఆదేశాల ప్రకారం నడిచే వ్యవస్థ కాదు. సమీకృత వ్యవస్థ. మూడు విభాగాలూ కలిసి ఒకటిగా చేస్తాం. 1+1+1= 3 కాదు, 5 లేదా 7... అంటే అంత బలమైనది" అని రావత్ వ్యాఖ్యానించారు. ఆర్మీ నుంచి వైదొలిగాక బరువు దిగిపోయినట్లు భావించానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ యూ టర్న్

సీడీఎస్ ఏర్పాటు విషయంలో ఆరంభంలోనే కేంద్రం తప్పటడుగు వేసిందంటూ జనరల్ రావత్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. దేశ భద్రతను పెంచే ఏ చర్యనైనా సమర్థిస్తామని అంటూ సీడీఎస్ ఏర్పాటును స్వాగతించింది. "మాటల కన్నా చేతలే ఎక్కువ విషయాన్ని చెబుతాయి. కొత్త సీడీఎస్ ఎలా పనిచేస్తారో త్వరలోనే దేశం తెలుసుకుంటుంది. సీడీఎస్‌ను నియమించినది ప్రభుత్వం. జనరల్ రావత్ తనపై ఉంచిన బాధ్యతలను నెరవేరుస్తారని భావిస్తున్నాం. దేశ భద్రతను పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా కాంగ్రెస్ దానిని వ్యతిరేకించదు" అని పార్టీ అధికార ప్రతినిధి సుస్మితా దేవ్ బుధవారంనాడు అన్నారు.



పోప్‌కు కోపమొచ్చింది!

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సెయింట్ పీటర్స్ ప్లాజాలో చిన్నారులకు ఆశీస్సులు అందించి వెళ్తున్న పోప్ ఫ్రాన్సిస్‌తో కరచాలనం చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళ.. ఆయన చెయ్యి పట్టుకొని లాగేసింది. 83 ఏళ్ల పోప్.. కొంచమైతే కిందపడిపోయే వారే! చెయ్యి వదలకపోవడంతో పోప్ ఆమె చేతిపై చిన్నగా కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో బుధవారం పోప్ క్షమాపణలు చెప్పారు. కొన్ని సార్లు సహనం కోల్పోతామని పేర్కొన్నారు.

రిజర్వేషన్ల నుంచి మినహాయించండి: ఐఐఎంలు

న్యూఢిల్లీ, జనవరి 1: ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వేషన్ల అమలు నుంచి తమను మినహాయించాలని దేశవ్యాప్తంగా ఉన్న 20 ఐఐఎమ్‌లు కేంద్ర మానవ వనరుల శాఖను కోరాయి. టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థిక బలహీన వర్గాల రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం ఈ విద్యాసంస్థలకు బుధవారం లేఖ రాసింది. దీంతో ఐఐఎమ్‌లు ఈ విధంగా స్పందించాయి. ఈ విద్యాసంస్థల్లో టీచర్ల నియామకానికి సంబంధించి ప్రస్తుతం ఈ రిజర్వేషన్లు అమలు కావడం లేదు. శాస్త్రీయ, సాంకేతిక ఉపాధ్యాయ పోస్టుల్లో రిజర్వేషన్లు పాటించనవసరం లేదంటూ 1975లో సిబ్బంది, వ్యవహారాల శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నియామకాలు జరుగుతున్నాయి.

పాక్ చొరబాటుదారుల కాల్పుల్లో అమరులైన ఇద్దరు జవాన్లు

- 2019లో 160 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం: కశ్మీర్ డీజీపీ



అమరులైన అర్జున్‌థాపా, సావంత్ సందీప్ రఘునాథ్(ఫైల్)

జమ్ము, జనవరి 1 : కశ్మీర్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంట పాకిస్థానీ చొరబాటుదారుల కాల్పుల్లో ఇద్దరు భారత జవాన్లు అమరులయ్యారు. మంగళవారం అర్ధరాత్రి చొరబాటుదారులు పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఖారీ త్రయత్ అడవుల మీదుగా రాజౌరి జిల్లా నౌషేరా సెక్టార్‌లోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఈక్రమంలో ఆ అడవుల్లో కార్డన్ సెర్చ్ విధులు నిర్వర్తిస్తున్న జవాన్లపై కాల్పులకు తెగబడ్డారు. వారి దాడిని తిప్పికొట్టే ప్రయత్నంలో రైఫిల్‌మన్ అర్జున్‌థాపా మగార్(25), నాయక్ సావంత్ సందీప్ రఘునాథ్(29)లు అమరులయ్యారు. సావంత్ మహారాష్ట్రలోని సతారా జిల్లావాసి కాగా, మగార్ నేపాల్‌లోని గుర్ఖా జిల్లావాస్తవ్యుడు. కాగా, ఈ ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని ఆర్మీ పీఆర్‌వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ వెల్లడించారు. మరోవైపు నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత.. కశ్మీర్‌లోని ఆస్పత్రుల్లో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆయా సేవలను మంగళవారం అర్ధరాత్రి నుంచి పునరుద్ధరించినట్లు ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సాల్ ప్రకటించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా ఆస్పత్రులకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాలేదని సమాచారం. కాగా, 2019 సంవత్సరంలో జమ్మూకశ్మీర్‌లో వివిధ ఘటనల్లో 160 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు డీజీపీ దిల్‌బాగ్ సింగ్ తెలిపారు. 2018తో పోల్చితే 2019లో లోయలో ఉగ్రవాద ఘటనలు 30 శాతం తగ్గాయన్నారు. ఉగ్రవాద సంస్థల్లో స్థానిక యువత చేరే రేటు గణనీయంగా తగ్గిందన్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో 250 మంది ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారని.. వారిలో 102 మంది పాకిస్థానీలన్నారు.

వంట గ్యాస్ మంట!

- ఎల్పీజీ సిలిండర్‌కు రూ.21 పెంపు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ ధర మండుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు పెరుగుతుండటంతో స్థానికంగానూ ఎగబాకుతున్నాయి. గత 5 నెలల్లో పెరగటమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. 2019 సెప్టెంబరు నుంచి పెరుగుదల మొదలైంది. అప్పటి నుంచి ఈ నెల వరకు పరిశీలిస్తే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.141.50 పైసలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ జనవరి నెలకు రూ.21 పెరిగింది. ఐదు నెలలుగా గ్యాస్ ధర పెరగడమే తప్ప తగ్గలేదు. 2019 ఆగస్టులో రూ.628 ఉండేది. సెప్టెంబరు నుంచి పెరుగుదల మొదలైంది. సెప్టెంబరులో రూ.16, అక్టోబరులో రూ.13.50, నవంబరులో రూ.76, డిసెంబరులో రూ.15, ఇప్పుడు మరో రూ.21 పెరిగింది. మొత్తం మీద ఐదు నెలల్లో కలిపి రూ.141.50 పెరిగింది. ఎల్పీజీపై డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)స్కీం అమలులో ఉంది. ఈ క్రమంలో సబ్సిడీ గ్యాస్ వినియోగదారులపై 5 శాతం ఆర్థిక భారం పడుతోంది. సిలిండర్ ధర రూ.100 పెరిగితే సబ్సిడీ పరిధిలోని వినియోగదారుడు రూ.5 భరించాల్సి వస్తోంది.

'స్థానిక' రిజర్వేషన్లు సిద్ధం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ సిద్ధం చేసింది. 59.85శాతం రిజర్వేషన్లతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలను నిర్ణయించే ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేశారు. ఏయే స్థానాలు ఎవరికి కేటాయించారన్న విషయం అధికారికంగా వెల్లడి కాకపోయినప్పటికీ ఎక్కడికక్కడ స్థానిక నేతలు అధికారుల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు. తొలుత ఎస్సీలకు 19.08 శాతం, ఎస్టీలకు 6.77శాతం, బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ అధికారులు జిల్లాల్లో కసరత్తు పూర్తి చేశారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో కొత్త రాష్ట్రంగా పరిగణించి రొటేషన్ కొత్తగా ప్రారంభిస్తూ రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో పాత రొటేషన్‌ను కొనసాగిస్తూ మరో జాబితా తయారుచేశారు. రెండు రకాల జాబితాలు సిద్ధంగా ఉంచడం ద్వారా హైకోర్టు సూచించిన విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నారు.



నిఫ్ట్ డైరెక్టర్‌గా విజయ్‌కుమార్ మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్ డైరెక్టర్‌గా అసోం - మేఘాలయ కేడర్ 2007 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ మంత్రి ఎంపికయ్యారు. ఈవిషయాన్ని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆయన నిఫ్ట్ డైరెక్టర్‌గా ఎంపికైనందున, ఆ పోస్టు నుంచి రిలీవ్ చేయడానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది.



ఊహకందని విజయమిది!

కోనేరు హంపి

గన్నవరం ఎయిర్‌పోర్టులో హంపి

విజయవాడ (భవానీపురం): ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలుస్తానని ఊహించలేదని చెస్ స్టార్ కోనేరు హంపి తెలిపింది. రష్యాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో విజేతగా నిలిచిన హంపి.. బుధవారం గన్నవరం విమానాశ్రయం చేరుకుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'గతేడాది ఆగస్టులో వరుసగా మూడు మెగా టోర్నీల్లో బరిలోకి దిగినా ఓటమే ఎదురైంది. నా కెరీర్‌కు అది సవాల్ విసిరింది. దీంతో ఎలాగైనా గెలవాలన్న కసి, పట్టుదలే తాజా టైటిల్ గెలిచేందుకు దోహదం చేశాయి. నాన్న అశోక్, భర్త అన్వేష్‌ల సహకారం లేకుంటే ఈ విజయం సాధ్యమయ్యేదికాదు' అని హంపి చెప్పుకొచ్చింది.

ఇంతకంటే స్ఫూర్తి ఇంకేం కావాలి!

దివ్యాంగుడి వీడియోను షేర్ చేసిన సచిన్



న్యూఢిల్లీ: కొత్త ఏడాదిని అందరూ స్ఫూర్తిమంతంగా ఆరంభించాలని దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆకాంక్షించాడు. ఫ్యాన్స్‌కు శుభాకాంక్షలు చెబుతూ.. అందరికీ ప్రేరణగా నిలిచే ఓ వీడియోను షేర్ చేశాడు. దివ్యాంగుడైన రామ్ అనే బాలుడు క్రికెట్ ఆడుతున్న వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. రెండు కాళ్లు చచ్చుబడినా ఆ బాలుడు బంతిని కొట్టి పాకుతూ సింగిల్ తీయడం ఆకట్టుకుంటోంది. రన్ తీసిన తర్వాత సహచరుడికి బ్యాట్‌ను అందించడానికి మళ్లీ పిచ్ మధ్యకు పాక్కుంటూ వెళ్లాడు. ఈ వీడియో తన హృదయాన్ని ద్రవింపజేసిందని.. మీ గుండెలనూ బరువెక్కిస్తుందని మాస్టర్ కామెంట్ రాశాడు. 2020ను ఆరంభించడానికి ఇంత కంటే స్ఫూర్తిమంతమైన వీడియో ఇంకేం ఉంటుందన్నాడు.





నటాషాతో హార్దిక్ నిశ్చితార్థం

ముంబై: సెర్బియాకు చెందిన బాలీవుడ్ నటి నటాషా స్టాన్కోవిచ్‌తో తాను డేటింగ్ చేస్తున్నానని టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అంగీకరించాడు. అంతేకాదు వారు ఎంగేజ్‌మెంట్ కూడా చేసేసుకున్నారు. ఆ ఫొటోలను హార్దిక్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. సముద్రంలో బోటు షికారులో..నటాషా ముసిముసి నవ్వులు చిందిస్తుండగా హార్దిక్ ఆమెకు ఉంగరం తొడిగాడు. అంతకు ముందు తాను, నటాషా ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'కొత్త ఏడాదిని నా వెలుగు జిలుగుల నటాషాతో ప్రారంభిస్తున్నా' అని హార్దిక్ రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా హార్దిక్-నటాషాకు విరాట్ కోహ్లీ శుభాకాంక్షలు తెలిపాడు.

కొత్త దశాబ్ది తొలి ఏడాది క్రీడా రంగానికి తలమానికమైన ఒలింపిక్స్ జరగనున్నాయి. ప్రతి సంవత్సరం ఆయా క్రీడల ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొన్నా.. నాలుగేళ్లకోసారి జరిగే విశ్వ క్రీడా సంరంభంలో పాల్గొనడం ఏ ఆటగాడి కెరీర్‌కైనా పరిపూర్ణత. ఇక ఒలింపిక్స్‌లో పతకం నెగ్గితే ఆ ఆటగాడికి క్రీడా జీవితం సంపూర్ణమైనట్టే. గత రియో ఒలింపిక్స్ అనంతరం క్రీడా రంగంలో భారత్ అనూహ్యమైన అభివృద్ధి సాధించింది. వివిధ విభాగాల్లో మన ఆటగాళ్లు ప్రపంచ స్థాయిలో అదిరిపోయే ప్రదర్శన చేశారు. దాంతో టోక్యో ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లపై అంచనాలు అధికమయ్యాయి. నిరుడు ఆయా క్రీడాంశాల్లో తమదైన ముద్ర వేసి కొత్త సంవత్సరంలో కూడా అదే జోరు కొనసాగించే అవకాశమున్న క్రీడాకారులపై ఓ లుక్కేద్దాం.

ఈ ఏడాది ఐదుగురు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

వినేష్ ఫొగట్



కజకిస్థాన్‌లో జరిగిన వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గడం ద్వారా తన సామర్థ్యాన్ని వినేష్ ఫొగట్ నిరూపించుకుంది. కాంస్య పతక పోరులో గ్రీస్‌కు చెందిన మేటి రెజ్లర్ మరియా ప్రెవోలరాకీని 4-1తో చిత్తుచేసిన ఫొగట్..టోక్యో 'టిక్కెట్' కూడా ఖాయం చేసుకుంది. అంతేకాదు 2020 ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిన తొలి భారత రెజ్లర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. వరల్డ్‌చాంపియన్‌షిప్ ద్వారా ఒలింపిక్ బెర్త్ సొంతం చేసుకోవడంతో..టోక్యోలో పతకంపై వినేష్‌పై అంచనాలను పెంచేశాయి. స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్ ఫామ్‌లేమితో తంటాలుపడుతుండడంతో విశ్వ క్రీడల్లో వినేష్‌పై భారత్ భారీగా ఆశలు పెట్టుకొంది.

సౌరభ్ చౌధురి



దేశ షూటింగ్‌లో నిరుడు సౌరభ్ చౌధురి ఓ సంచలనం. గత ఫిబ్రవరిలో ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ పురుషుల 10మీ. ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో వరల్డ్ రికార్డుతో స్వర్ణం కొల్లగొట్టడం ద్వారా సౌరభ్ సంచలనం సృష్టించాడు. టైటిల్ సాధించడంతోపాటు టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌నూ అతడు సొంతం చేసుకున్నాడు. ఢిల్లీ టోర్నీ ద్వారా భారత్ దక్కించుకొన్న ఒలింపిక్ ఏకైక బెర్త్ సౌరభ్‌దే కావడం విశేషం. అంతేకాదు ఢిల్లీ పోటీల మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మనూ భాకర్‌తో కలిసి పసిడి పతకాన్ని కూడా చౌధురి చేజిక్కించుకున్నాడు. మ్యూనిచ్ ప్రపంచకప్‌లో ఈ రెండు విభాగాల్లో టైటిల్ కైవసం చేసుకొన్న సౌరభ్..రియో డి జనెరో వరల్డ్‌కప్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం అందుకున్నాడు. అలాగే ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన ఈ ఉత్తరప్రదేశ్ టీనేజర్.. యశస్వినీ సింగ్‌తో కలిసి మిక్స్‌డ్‌లో టైటిల్ సాధించాడు. ఈనేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌తో పాటు ఈ సంవత్సరం జరిగే ఇతర మెగా ఈవెంట్లలో సౌరభ్ మరిన్ని పతకాలు తన ఖాతాలో వేసుకుంటాడని అంచనా వేస్తున్నారు.

సాతియన్



భారత టీటీ అంటే దశాబ్దంన్నరగా తెలుగు ఆటగాడు శరత్ కమల్ పేరే వినిపిస్తోంది. అంతర్జాతీయ టీటీలో భారత్‌కు ఓ పేరు తీసుకొచ్చిన 37 ఏళ్ల కమల్ రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నాడు. ఈ తరుణంలో అతడి వారసుడెవరన్న ప్రశ్నకు జి. సాతియన్ నేనున్నానంటూ ముందుకొచ్చాడు. శరత్ మార్గదర్శనంలో రాటుదేలిన సాతియన్ గతేడాది టాప్-20 అంతర్జాతీయ ఆటగాళ్లలో కొందరిని ఓడించి శభాష్ అనిపించాడు. వీరిలో జపాన్ యువ సంచలనం, వరల్డ్ నెంబర్ 5 హరిమోటో టొమోకాజు కూడా ఉండడం విశేషం. అంతేకాదు అంతర్జాతీయ టీటీ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో టాప్-25లో స్థానం దక్కించుకున్న తొలి భారత ఆటగాడిగా 26 ఏళ్ల సాతియన్ రికార్డు సృష్టించాడు. గత జూలైలో అతడు 24వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. అనతికాలంలోనే అంతర్జాతీయస్థాయిలో అద్భుతంగా రాణిస్తున్న సాతియన్‌పై టోక్యోలో భారీ అంచనాలున్నాయి.



అమిత్ పంఘల్

భారత్ బాక్సింగ్ గురించి చెప్పుకొంటే రెండుపేర్లే ప్రముఖంగా వినిపిస్తాయి. అందులో ఒకటి మేరీకోమ్‌దైతే.. రెండోది అమిత్ పంఘల్‌ది. 49 కిలోల నుంచి 52 కేజీల విభాగానికి మారినా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో దేశానికి తొలి రజత పతకం అందించాడంటే 23 ఏళ్ల అమిత్ సత్తా ఏపాటిదో అర్థమవుతుంది. 52 కిలోలలో ఏషియన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ పంచ్ విసిరిన పంగల్ టోక్యో ఒలింపిక్స్‌లో పతక అంచనాలను పెంచాడు.

శ్రేయాస్ అయ్యర్



పరిమిత ఓవర్లలో నాలుగో నెంబర్‌లో సమర్థుడైన బ్యాట్స్‌మన్ సమస్యను సుదీర్ఘకాలంగా టీమిండియా ఎదుర్కొంటోంది. రెండేళ్లుగా పలువురు ఆటగాళ్లను పరిశీలించినా వారిలో ఎవరూ కుదురుకోలేకపోయారు. కానీ గతేడాది అవకాశం దక్కించుకొన్న ముంబై బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ సత్తా చాటుకున్నాడు. పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ చేయడంతోపాటు ఫీల్డింగ్‌లో చురుగ్గా ఉండే అయ్యర్ ప్రతిభకు కోచ్ రవిశాస్త్రి ఫిదా అయ్యాడు. అందుకే.. ఎంతోకాలంగా జట్టును వేధిస్తున్న నాలుగో నెంబర్ స్లాట్ తలనొప్పి తగ్గినట్టేనని అతడు పేర్కొన్నాడు. అక్టోబరులో ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్ అయ్యర్ సత్తాకు సవాల్ కానుంది. ఆ పరీక్షలో నెగ్గి జట్టులో తన స్థానాన్ని శ్రేయాస్ సుస్థిరం చేసుకుంటాడేమో చూడాలి.


రాహుల్‌కు మూడో జీఎం నార్మ్



రాహుల్ శ్రీవాత్సవ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ చెస్ క్రీడాకారుడు పెద్ది రాహుల్ శ్రీవాత్సవ్ (18) గ్రాండ్‌మాస్టర్ కావడానికి అవసరమైన ఆఖరి జీఎం నార్మ్‌ను సాధించాడు. ఇటలీలోని వెనిస్‌లో మంగళవారం ముగిసిన మోంటెబెలునా ఓపెన్ చెస్‌లో రాహుల్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకంతో పాటు జీఎం నార్మ్ ధ్రువపత్రాన్ని కూడా అందుకున్నాడు. ప్రస్తుతం 2,469 ఎలో రేటింగ్ పాయింట్లతో ఉన్న అతడు మరో 31 పాయింట్లు సాధిస్తే తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదాను సంపాదించిన మూడో చెస్ క్రీడాకారుడిగా నిలుస్తాడు. గత ఏడాది ఆగస్టులో గ్రీస్‌లో జరిగిన పోటీల్లో తొలి జీఎం నార్మ్‌ను, డిసెంబరులో జరిగిన సెర్బియా ఓపెన్‌లో రెండో జీఎం నార్మ్‌ను రాహుల్ సొంతం చేసుకున్నాడు.

జీవితేష్ ఖాతాలో ఇటలీ టైటిల్



వరంగల్‌కు చెందిన జొన్నలగడ్డ సాయి అగ్ని జీవితేష్ (21) ఇటలీలో జరిగిన రొబిచెట్టో ఓపెన్ టోర్నీ చెస్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 94 మంది యూరోపియన్ ఇంటర్నేషనల్ మాస్టర్లు పాల్గొన్న ఈ టోర్నీలో జీవితేష్ అగ్రస్థానంలో నిలిచి సత్తా చాటాడు.

గంగూలీ నాకు భోజనం పంపేవాడు!



ఇంజమామ్

కరాచీ: క్రికెట్‌లో మతానికి తావులేదని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ అన్నాడు. తనపట్ల మతపరమైన వివక్ష చూపారని ఆరోపణలు చేసిన పాక్ స్పిన్నర్ డానిష్ కనేరియా ఆరోపణలను హక్ ఖండించాడు. కొందరు సహచరులు హిందువులతో కలసి భోజనం చేయరనే ఆరోపణకు సమాధానంగా.. గంగూలీ తనకు భోజనం పంపిన సందర్భాన్ని ఇంజీ గుర్తు చేసుకున్నాడు. '2005 టూర్‌కు ముందు కోల్‌కతాలో ఓ యాడ్ షూటింగ్‌కు వెళ్లా. గంగూలీ కూడా ఆ షూట్‌లో పాల్గొన్నాడు. దానికి ముందు సచిన్, నేను కలిసి సౌరవ్‌కు చెందిన రెస్టారెంట్‌ను ప్రారంభించాం. నేను తినే భోజనాన్ని గంగూలీ తన రెస్టారెంట్ నుంచే పంపేవాడు' అని హక్ చెప్పాడు. పాకిస్థానీయులది విశాల హృదయమని, అందరినీ ఆదరిస్తారని చెప్పాడు. '2004లో పాక్ టూర్‌కు భారత్ వచ్చినప్పుడు సాదర స్వాగతం పలికాం. ఆ తర్వాతి ఏడాది మేం భారత్ పర్యటనకు వెళ్లినప్పుడూ అదే విధంగా ఆదరించారు. షార్జా మ్యాచ్‌ల సందర్భంగా హోటల్ రూమ్‌ల్లో టీమిండియా ప్లేయర్లతో కలిసి తినేవాళ్లమ'ని హక్ తెలిపాడు.

మాథ్యూస్ రీఎంట్రీ

భారత్ టూర్‌కు లంక జట్టు

కొలంబో: శ్రీలంక మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ మళ్లీ టీమ్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ నెల ఐదు నుంచి భారత్‌తో జరిగే మూడు టీ-20ల సిరీస్ కోసం 16 మంది సభ్యుల జట్టును శ్రీలంక క్రికెట్ ప్రకటించింది. మలింగ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దాదాపు 16 నెలల గ్యాప్ తర్వాత మాథ్యూస్ టీ20లకు ఎంపికయ్యాడు. లంకేయులు గురువారం భారత్ రానున్నారు.

లంక జట్టు: మలింగ (కెప్టెన్), గుణతిలక, అవిష్క ఫెర్నాండో, మాథ్యూస్, దసున్ షనక, కుశాల్ పెరీరా, డిక్‌వెలా, డిసిల్వా, ఇసురు ఉదాన, భనుక రాజపక్సే, ఒషాడ ఫెర్నాండో, హసరంగా, లాహిరు కుమార, కుశాల్ మెండిస్, సందకన్, కసున్ రజిత.



విరాట్ కోహ్లీ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంగా భార్య అనుష్కతో కలిసి దిగిన పైఫొటోను కోహ్లీ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు.

వండర్ కిడ్



ఆర్చరీలో అంజని అద్భుత ప్రతిభ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): విల్లు చేత పడితే ఆ బాలిక సంధించే బాణాలకు లెక్కుండదు. బాణం గురి పెట్టిందంటే టార్గెట్ కూడా వణకాల్సిందే. ఆ చిన్నారి విల్లంబుల హోరులో రికార్డులు తెరమరుగవుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన 11ఏళ్ల బేతు చందనసాయి అంజని ఆర్చరీలో అద్భుత ప్రదర్శనతో వండర్ కిడ్‌గా పేరు తెచ్చుకుంటోంది. 10 మీటర్ల విభాగంలో 15 నిమిషాల్లో 136 బాణాలను నిర్దేశిత లక్ష్యానికి సంధించి ఇంటర్నేషనల్ వండర్ అండ్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో అంజని చోటు సంపాదించింది. ఈ రికార్డు సాధనకు ముందు ఆమె 8 నిమిషాల్లో 76 బాణాలను వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ విల్లు పట్టాక అంజనీ మదిలో అంకెలు మారిపోయాయి. 15 నిమిషాల వద్ద కౌంట్‌డౌన్ ఆపేసరికి 136 బాణాలు వేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది.

యూట్యూబ్‌లో వీడియోలు చూసి..: అంజని తల్లిదండ్రులు శ్రీలక్ష్మి, సత్యనారాయణ. వీరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం. హైదరాబాద్‌లోని గాజులరామారంలో స్థిరపడ్డారు. గత ఏడాది యూట్యూబ్‌లో ఆర్చరీ పోటీల వీడియోలు చూస్తూ ఆ క్రీడలో శిక్షణ తీసుకుంటానని అమ్మానాన్నలకు చెప్పింది. అలా గత జూన్‌లో కూకట్‌పల్లిలోని ఆర్చరీ కోచ్‌లు రమేష్, గంగరాజు వద్ద అంజని ప్రాక్టీస్ ప్రారంభించింది.

ఆసియా పసిఫిక్ పోటీలకు అర్హత: కూతురు ఆసక్తిని గమనించిన తండ్రి సత్యనారాయణ ఇంటి వద్ద కూడా ప్రాక్టీస్ రేంజ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోజు ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు సాధన చేయడం దినచర్యలో భాగంగా చేసుకుంది. సరిగ్గా రెండు నెలలు గడిచేసరికి గత సెప్టెంబరులో గండిపేటలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన టోర్నీలో అండర్-14 విభాగంలో రజత పతకం నెగ్గి శుభారంభం చేసింది. ఆ ఉత్సాహంతో గత నవంబరులో కేరళలో జరిగిన జాతీయస్థాయి రూరల్ పోటీల బరిలో దిగింది. అండర్-14 విభాగంలో 50 మీ. పోటీలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది ఆర్చర్లు తలపడ్డారు. వీరందరినీ వెనక్కి నెట్టి అంజని పసిడి పతకం సాధించి శభాష్ అనిపించింది. అంతేకాక థాయ్‌లాండ్‌లో వచ్చే నెలలో జరగనున్న ఆసియా పసిఫిక్ రూరల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొనే అవకాశం కూడా అంజనికి లభించింది. భవిష్యత్‌లో దేశానికి ప్రాతినిథ్యం వహించడమే తన లక్ష్యమని అంజని చెబుతోంది.



తమిళ నటుడితో జ్వాల డేటింగ్..?

చెన్నై: బ్యాడ్మింటన్ మాజీ స్టార్ గుత్తా జ్వాల ప్రేమలో పడిందా..? అంటే అవుననే అంటోంది కోలీవుడ్ మీడియా. ఈ డబుల్స్ ఏస్ షట్లర్ కొన్నాళ్లుగా తమిళ నటుడు విష్ణు విశాల్‌తో డేటింగ్‌లో ఉన్నట్టు సమాచారం. తాము సన్నిహితంగా ఉన్న ఫొటోలను ఇరువురూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ విష్ణు తనను ముద్దాడుతున్న ఫొటోను జ్వాల బుధవారం ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇప్పుడీ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటోతో ఇద్దరి మధ్య ఎఫైర్ బహిరంగమైపోయిందంటూ నెటిజన్లు తెగ కామెంట్ చేస్తున్నారు. విష్ణు విశాల్ తమిళంలో ఇప్పటివరకూ 14 సినిమాల్లో నటించాడు.

వన్డే, టీ20 కెప్టెన్‌గా ధోనీ

అన్ని ఫార్మాట్లలో కోహ్లీ
క్రిక్ఇన్ఫో దశాబ్దపు జట్లు



న్యూఢిల్లీ: ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో దశాబ్దపు వన్డే, టీ20 జట్లకు కెప్టెన్‌గా ధోనీ ఎంపికయ్యాడు. అన్ని ఫార్మాట్లలోనూ ప్లేయర్‌గా చోటు దక్కించుకొన్న కోహ్లీని టెస్ట్ సారథిగా ఎంపిక చేశారు. విరాట్ తోపాటు భారత క్రికెటర్లలో అశ్విన్ ఒక్కడికే టెస్ట్ టీమ్‌లో చోటుదక్కింది. రోహిత్‌కు వన్డేల్లో చోటు లభించగా.. పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. ఐదుగురు వెస్టిండీస్ ప్లేయర్లు క్రిస్ గేల్, డ్వేన్ బ్రావో, సునీల్ నరైన్, పొలార్డ్, రస్సెల్ టీ20 టీమ్‌కు ఎంపిక కావడం విశేషం. ఇక మహిళల దశాబ్ది వన్డే, టీ20 జట్లలో మిథాలీ రాజ్, పేసర్ జులన్ గోస్వామికి చోటుదక్కింది. ఆస్ట్రేలియా ప్లేయర్ మెగ్ లానింగ్ కెప్టెన్‌గా ఎంపికైంది.

మన్‌జోత్ కల్రాపై వేటు



న్యూఢిల్లీ: వయసు సంబంధిత స్కామ్‌లో ఢిల్లీ క్రికెటర్, అండర్-19 వరల్డ్‌కప్ ప్లేయర్ మన్‌జోత్ కల్రాపై వేటు పడింది. ఏడాది పాటు రంజీలు ఆడకుండా కల్రాపై డీడీసీఏ తాజా మాజీ అంబుడ్స్‌మన్, రిటైర్డ్ జడ్జ్ దురేజ్ అహ్మద్ సస్పెన్షన్ విధించారు. అండర్-16, 19 విభాగాల్లో వయసు సంబంధిత అవకతవకల ఆరోపణల కారణంగా వేటు పడింది. ఇదే తరహా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఢిల్లీ సీనియర్ టీమ్ వైస్ కెప్టెన్ నితీష్ రాణా నుంచి మరికొన్ని ధ్రువీకరణ పత్రాలు కోరినా.. ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. అండర్-19 స్టార్ శివమ్ మావి కేసును బీసీసీఐకి రిఫర్ చేశారు. కాగా, తన పదవీ కాలం చివరి రోజు రాత్రి అహ్మద్ ఈ ఆదేశాలను జారీ చేయడం ఢిల్లీ క్రికెట్ సంఘం అధికారులను విస్మయానికి గురి చేసింది. అంబుడ్స్‌మన్ ఆదేశాలతో ఏజ్ గ్రూప్ క్రికెట్ ఆడకుండా కల్రాపై రెండేళ్ల నిషేధం పడగా.. ఈ సీజన్ రంజీలు ఆడే పరిస్థితిలేదు.

అర్ధరాత్రి.. అడవిలో..!



దట్టమైన అటవీ ప్రాంతం. ఎముకలు కొరికే చలి. అర్ధ రాత్రి సమయం. అప్పుడే ఓ గర్భిణికి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు సపర్యలు చేశారు. బుధవారం తెలవారుతుండగా.. డోలీని సిద్ధం చేశారు. ఓ పది మంది కలిసి డోలీని మోసుకుంటూ విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం పొర్లు గ్రామం నుంచి బయలుదేరారు. 15 కిలోమీటర్లు నడిచి కసిరాయిబంద చేరుకున్నారు. గర్భిణికి నొప్పులు అధికం కావడంతో కిందికి దించారు. కొద్ది క్షణాల్లోనే ఆమె ప్రసవించింది. మళ్లీ తల్లీబిడ్డలను డోలీలో కూర్చోబెట్టి.. ఎనిమిది కిలోమీటర్లు నడిచి దబ్బగుంట చేరుకున్నారు. అక్కడ సిద్ధంగా ఉన్న 108 వాహనంలో ఆసుపత్రికి చేరుకున్నారు. తల్లి కెరంగి చిన్నాలమ్మ, శిశువును పరీక్షించిన వైద్యులు.. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు చెప్పడంతో.. అంతా ఊపిరిపీల్చుకున్నారు.

- శృంగవరపుకోట

రీయింబర్స్ లేదు.. రోడ్డునపడాలా?

- **ఇంజనీరింగ్ కాలేజీ ఉద్యోగుల ఆందోళన**
- **3,400 కోట్లకు చేరిన బకాయిలు**

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ రగడ సిబ్బంది మెడకు చుట్టుకుంది. ప్రభుత్వం నుంచి రీయింబర్స్ బకాయిలు విడుదల కాకపోవడంతో 75% కాలేజీలు తమ సిబ్బందికి వేతనాలను నిలిపేశాయి. దీంతో వారు కనీస ఖర్చులకు కూడా డబ్బులు లేక తంటాలు పడుతున్నారు. రాష్ట్రంలో 287 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా.. ఒక్కో కాలేజీలో కనిష్ఠంగా 150 మంది, గరిష్ఠంగా 500 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. సగటున 250 మంది పనిచేస్తున్నప్పటికీ మొత్తం మీద దాదాపు 70 వేల మంది వరకు సిబ్బంది ఉంటారని అంచనా. కాలేజీలకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాకపోవడంతో వీరికి నెలవారీ జీతాలను నిలిపి వేశారు. దీంతో ఇంటి అద్దెలు చెల్లించే పరిస్థితి లేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఇంజనీరింగ్‌తో పాటు రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ, లా, బీఈడీ, బీఫార్మసీ తదితర ప్రొఫెషనల్ కోర్సులను నిర్వహిస్తున్న కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తాజా అంచనా ప్రకారం రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3400 కోట్లకు చేరుకున్నాయి. దీనిలో 2018-19 విద్యా సంవత్సరంలోని బకాయిలు రూ.1224 కోట్లు కాగా, 2019-20 బకాయిలు దాదాపు 2,176 కోట్ల వరకు ఉన్నాయి. గత ప్రభుత్వం 2018-19 విద్యాసంవత్సరానికి మొదటి క్వార్టర్ ట్యూషన్ ఫీజు రీయింబర్స్ చేసింది. సాధారణ ఎన్నికలకు ముందు రెండో క్వార్టర్‌కు సంబంధించి గత జనవరిలో సుమారు రూ.250 కోట్ల వరకు చెల్లించేందుకు సిద్ధమైంది. సీఎఫ్ఎంఎస్ నుంచి సకాలంలో బిల్లులు క్లియరెన్స్ కాకపోవడంతో విడుదల కాలేదు. ఇక, జగన్ ప్రభుత్వం వచ్చిన 4 నెలల తర్వాత చంద్రబాబు ప్రభుత్వం తాలూకు బిల్లులను క్లియర్ చేశారు. అయితే, ఒక్కో ప్రాంతంలోని కాలేజీలకు ఒక్కో విధంగా ఇవ్వడం గమనార్హం.

మారిన ప్రాధాన్యతలు

ప్రభుత్వం మారడంతో రీయింబర్స్‌మెంట్ ప్రాధాన్యతలు మారిపోయాయి. ప్రొఫెషనల్ కాలేజీలకు ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సిన ట్యూషన్ ఫీజు బకాయిలు పేరుకుపోయాయి. 2019-20, 2020-21, 2021-22లకు సంబంధించి గత ఏఎఫ్ఆర్సీ అన్ని ప్రొఫెషనల్ కాలేజీలు సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించింది. 287 ఇంజనీరింగ్ కాలేజీలకు మూడు సంవత్సరాలకుగాను ట్యూషన్ ఫీజులను ఈ ఏడాది జూన్‌లో ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ప్రభుత్వం గత ఏఎఫ్ఆర్సీ సిఫారసులను పెండింగ్ పెట్టింది. ఉన్నత విద్యలో సంస్కరణలు, ఉన్నత విద్య రెగ్యులేటరీ, పర్యవేక్షణ కమిషన్‌ను ఏర్పాటు చేసి ట్యూషన్ ఫీజులను నిర్ధారిస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ తర్వాత రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ చట్టం చేసింది. తాజాగా కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఈ పరిస్థితుల్లో 2019-20, 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు ట్యూషన్ ఫీజులు నిర్ధారించేందుకు మరింత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో కొత్త ఫీజులు తేలే లోపు పాత బకాయిలను విడుదల చేయాలని కాలేజీల యాజమాన్యాలు కోరుతున్నాయి. ప్రతి మూడు నెలలకోసారి ట్యూషన్ ఫీజులను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. సకాలంలో రీయింబర్స్ చేయని ఫలితంగా సింహభాగం కాలేజీలు తమ ఫ్యాకల్టీకి, సిబ్బందికి గత ఐదారు నెలల నుంచి జీతాలు చెల్లించలేదు. ఫీజులు రీయింబర్స్ కానందునే సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఇంజనీరింగ్ కాలేజీల అసోసియేషన్ చెబుతోంది. కాలేజీలు, సిబ్బంది, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఫీజు బకాయిలను విడుదల చేయాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేస్తోంది.



పెందుర్తిలో ప్రభుత్వ భూములు పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్, అధికారులు

విశాఖలో ప్రవీణ్ ప్రకాశ్

- **పెందుర్తి, సబ్బవరం మండలాల్లో ప్రభుత్వ భూముల పరిశీలన**

సబ్బవరం, జనవరి 1: విశాఖపట్నం జిల్లాలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించేందుకు సీఎంవో ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ బుధవారం విశాఖ వచ్చారు. విశాఖలో కార్యనిర్వాహక రాజధాని ఏర్పాటు చేయబోతున్నారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్‌తో కలిసి పెందుర్తి, సబ్బవరం మండలాల్లోని ప్రభుత్వ భూములను ప్రవీణ్ పరిశీలించారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో ఇళ్ల స్థలాల కోసం రెవెన్యూ అధికారులు సేకరించిన భూములను, ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన 200 ఎకరాలను, పీఎస్ఎల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని, జెర్రిపోతులపాలెంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను చూశారు. సబ్బవరం మండలం అసకపల్లిలో బ్లాక్-4 కింద సేకరించిన సర్వే నంబరు 1లోని 18.65 ఎకరాల ప్రభుత్వ భూమిని, 87లో ఉన్న 17.4 ఎకరాల డీఫారం భూములను, మ్యాపులను పరిశీలించారు. ఇవి కాకుండా ల్యాండ్ పూలింగ్ కింద ఎరుకునాయుడుపాలెం, పైడివాడ, పైడివాడ అగ్రహారం (బ్లాక్-1 లో 366.03 ఎకరాలు), గొల్లలపాలెం(బ్లాక్-2,3)లో 548.06 ఎకరాలు, గాలిభీమవరం (బ్లాక్-5,6)లో 303.72 ఎకరాలను సేకరించినట్లు తహశీల్దార్ రమాదేవి వివరించారు. సబ్బవరం, పరవాడ, గాజువాక మండలాల సరిహద్దులో సుమారు 800 ఎకరాలు సేకరించినట్లు తెలిపారు. కలెక్టర్ వినయ్‌చంద్ మాట్లాడుతూ.. నవరత్నాల్లో భాగంగా ఉగాది నాటికి జిల్లాలో 2.8 లక్షల నుంచి 3 లక్షల మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీని కోసం సేకరించిన భూముల పరిశీలనకు ప్రవీణ్ ప్రకాశ్ వచ్చారని తెలిపారు. వారి వెంట జేసీ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, విశాఖ ఆర్డీవో కిశోర్, పాడేరు సబ్‌కలెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'రీయింబర్స్' ఇక ఈజీకాదు!

ఉత్తీర్ణతా శాతం, హాజరుపై నిఘా.. సంతృప్తిగా ఉంటేనే ఫీజులు చెల్లింపు

- **2020-21 నుంచి ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు**
- **క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ ఏర్పాటు**
- **ప్రతి వర్సిటీలో డేటాబేస్ సెంటర్**
- **ఓపెన్ వర్సిటీగా 'అప్పారావు వర్సిటీ'**
- **ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ వెల్లడి**

అమరావతి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): "డిగ్రీ అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థుల్లో 40 శాతం మంది పరీక్షలు రాయడం లేదు. చాలా మంది విద్యార్థులు తరగతులకు సరిగా హాజరుకావడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు కనీస అటెండెన్స్‌తో పాటు ఉత్తీర్ణతా శాతం ఆధారంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్న ప్రతిపాదన ఉంది" అని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్(సీజీపీ) సగటును ప్రాతిపదికగా తీసుకుని రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్న సిఫారసు ఉన్నప్పటికీ ఎంతో కొంత ఉత్తీర్ణత శాతాన్ని పెడితేనే మంచిదని భావిస్తున్నామని చెప్పారు. డిగ్రీ కోసం 6 లక్షల వరకు సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో సగం కూడా భర్తీ కావడం లేదని, 25% కంటే తక్కువ సీట్లు భర్తీ అయిన కాలేజీలను మూసేయమని సూచించామని ఆయన తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా అఫిలియేషన్ లేని డిగ్రీ కళాశాలలకు నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పాటించని కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన తాడేపల్లిలోని తన కార్యాలయంలో 2020-21 విద్యాసంవత్సరంలో మండలి కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయి కాబట్టి డిగ్రీలో నాలుగో ఏడాది పూర్తిగా స్కిల్ కోసం, ఇంటర్న్‌షిప్ కోసం ఆయా విభాగాల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగేళ్ల డిగ్రీ కోసం యూజీసీకి లేఖ రాశామన్నారు. బీఎస్సీ(ఇంజనీరింగ్) కోసం కరిక్యులమ్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బోధనపై అవగాహన కోసం ఫ్యాకల్టీకి 2 నెలల పాటు శిక్షణా కార్యక్రమాన్ని చేపడతామన్నారు. 2021 నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్స్ అమలు చేస్తామని చెప్పారు. అన్ని వర్సిటీల్లోనూ విద్యార్థులు, లెక్చరర్ల డేటాబేస్ తయారు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని, సీఎంఐఎస్‌లో అడ్మిషన్లు, ప్రొగ్రామ్స్, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్ తదితర అన్ని అంశాలు అందులో ఉంటాయని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ కాలేజీల అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల అనుబంధ కళాశాలలన్నీ త్వరలో ఏర్పాటయ్యే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వం తీసుకునే ప్రతిపాదన ఉందన్నారు. వర్సిటీల్లో దశల వారీగా ఫ్యాకల్టీ ఖాళీలను భర్తీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో క్వాలిటీ అసెస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేస్తామని, కళాశాలలు జాతీయ ప్రమాణాలు సాధించేలా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని వివరించారు. డిగ్రీ కళాశాలలకు అక్రెడిటేషన్ తప్పనిసరని చెప్పారు. ఉమ్మడి ఆస్తుల్లో మన వాటా కింద రూ.55 కోట్లు రావాల్సి ఉందని, దీనిలో ఉన్నత విద్యా మండలికి రావాల్సిన నిధులపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటామని తెలిపారు. గురజాడ అప్పారావు వర్సిటీని ఓపెన్ వర్సిటీగా మార్చే అవకాశం ఉందన్నారు. ఉన్నత విద్యలో జీఈఆర్‌ను 35% నుంచి 70 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని, దీనికిగాను ఓపెన్ విద్యను ప్రోత్సహిస్తామని వివరించారు.



హేమచంద్రారెడ్డి

లక్ష్యాలకు దూరంగా
మత్స్య రంగం

- **రాష్ట్రాల అలసత్వమే కారణం**
- **నిధులిచ్చినా ఖర్చు చేయట్లేదు**
- **పార్లమెంటరీ స్థాయీసంఘం ఆక్షేపణ**

న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిలో ప్రధాన భూమిక వహిస్తున్న మత్స్యరంగాన్ని కొన్ని రాష్ట్రాలు అలసత్వం చేస్తున్నాయి. వివిధ పథకాలతో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న కోట్లాది రూపాయలను సైతం సక్రమంగా ఖర్చు చేయడం లేదు. ఖర్చుచేసిన నిధులకు వినియోగపత్రాలు(యూసీ) సమర్పించని రాష్ట్రాలు కూడా ఉన్నాయి. మత్స్యరంగం సమగ్రాభివృద్ధి కోసం వివిధ పథకాల్లో 75:25, 60:40 నిష్పత్తిలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను భరించాల్సి ఉంది. ఆ మేరకు అనేక రాష్ట్రాలు తమ వాటా కింద నిధులు జమ చేయకపోగా, కేంద్రం ఇచ్చిన నిధులను మత్స్య రంగాభివృద్ధికి ఖర్చు చేయకుండా, ఇతర పద్దులకు బదలాయిస్తున్నాయి. కేంద్ర పథకాలకు నిబంధనల మేరకు రాష్ట్రాలు తమ వాటా నిధులు ఇవ్వకపోతే ఈ పథకాలు విఫలం దిశగా వెళ్తాయని కేంద్ర వ్యవసాయశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం కేంద్రానికి తాజాగా సమర్పించిన నివేదికలో ఆందోళన వ్యక్తం చేసింది. మత్స్యరంగం ఆర్థిక పరిపుష్టికి రాష్ట్రాలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు సహకరించడంలేదని పీసీ గడ్డి గౌదార్ నేతృత్వంలోని ఈ కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబరు 29 వరకు రూ.599.40 కోట్ల వరకు యూసీలు పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొంది. యూసీలు సమర్పించని రాష్ట్రాలలో తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, బిహార్ తొలి నాలుగు స్థానాల్లో ఉన్నట్లు తెలిపింది. నిధుల కేటాయింపు విధానంలో మార్పులు తీసుకురావాలని, 75:25, 80:20 నిష్పత్తిలో కేటాయింపు ఉండాలని సూచించింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.